RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in




18 అక్టోబర్ 2024 శుక్రవారం | హైదరాబాద్ | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:20 | సంచిక:118

# ఇది సుందరీకరణ కోసం కాదు.. ఇది మూసీ పునరుజ్జీవనం కోసం






సచివాలయంలో మీడియా సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి స్పీచ్ హైలైటింగ్ పాయింట్స్..

తెలంగాణ ప్రజల భవిష్యత్ ను, రాష్ట్ర, దేశ ఆర్థిక వ్యవస్థను నిర్దేశించే కార్యాచరణ ప్రభుత్వం తీసుకుంది..

33 బృందాలు మూసీ పరివాహక ప్రాంతంలో పేదల సమస్యలను తెలుసుకున్నాయి.

దుర్గంధంలో దుర్భర జీవితాలను గడుపుతున్న పేదల కష్టాలను తెలుసుకున్నాం.

ప్రపంచంతో పోటీ పడే నగరంగా హైదరాబాద్ ను తీర్చిదిద్దుతాం.

ఉపాధి కల్పనతో అక్కడి పేదలను ఆదుకోవాలనే ఆలోచన మా ప్రభుత్వానికి ఉంది.

పండిట్ జవహర్ లాల్ నెహ్రూ ఎడ్యుకేషన్, ఇరిగేషన్ రెవల్యూషన్ తీసుకొచ్చారు.

కాంగ్రెస్ విజన్ వల్లే దేశానికి ప్రపంచంతో పోటీ పడే శక్తి లభించింది.

దేశంలో సాంకేతిక విప్లవం తీసుకొచ్చిన ఘనత రాజీవ్ గాంధీది.

పెట్టుబడుల సరళీకరణ విధానం తీసుకొచ్చింది పీవీ నరసింహారావు.

ఆనాడు నెహ్రూ, రాజీవ్, పీవీ ప్రవేశపెట్టిన పాలసీలను కొందరు వ్యతిరేకించారు.

కానీ ఆ పాలసీలే దేశాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లాయి.

అధికారం కోల్పోయిన నిస్పృహతో కొందరు ఏదేదో మాట్లాడుతున్నారు..

బందిపోటు దొంగల్లా పదేళ్లు తెలంగాణను దోచుకున్నవారు మూసీ పునరుజ్జీవనాన్ని అడ్డుకోవాలని ప్రయత్నిస్తున్నారు.

సుందరీకరణ అంటూ కాస్మటిక్ కలర్ అద్దాలని చూస్తున్నారు.

వాళ్ల మెదడులో మూసీ మురికి కంటే ఎక్కువ విషం నింపుకున్నారు.

ఇది సుందరీకరణ కోసం కాదు.. ఇది మూసీ పునరుజ్జీవనం కోసం

మూసీ మురికి నుంచి ప్రజలను కాపాడాలనేదే మా ప్రయత్నం.

ప్రజల జీవన ప్రమాణాలు మెరుగు పరచాలనేదే మా ఆలోచన.

మల్లన్న సాగర్ ,రంగనాయక్ సాగర్ , కొండపోచమ్మ కు నేను ఎక్కడికైనా వస్తా..

ఎక్కడికైనా సెక్యూరిటీ లేకుండా రావడానికి నేను సిద్ధంగా ఉన్నా..

మీరూ రండి రచ్చబండ నిర్వహిద్దాం..

కేసీఆర్.. నీ నియోజకవర్గానికి నేను వస్తా..

రచ్చబండలో కూర్చుని చర్చిద్దాం...

ఇది మూసీ సుందరీకరణ కాదు...మూసీ పునరుజ్జీవనం..

ఇది కొందరు దుబాయ్ వెళ్లి అందం కోసం జుట్లు నాటించుకోవడం లాంటి కార్యక్రమం కాదు..

నగరం మధ్య నదీ ప్రవాహం ఉన్న నగరం దేశంలో ఎక్కడా లేదు..

మూసీ పరివాహక ప్రాంత ప్రజల సమస్యలు పరిష్కరిస్తూ వారిని తరలించాలనేదే మా ఆలోచన.

1600 పైచిలుకు మూసీ ఇండ్లు నదీ గర్భంలో ఉన్నాయి.

దసరా నేపథ్యంలో వారికి ఇండ్లు ఇచ్చి, ఖర్చులకు డబ్బులు ఇచ్చి అక్కడి నుంచి తరలించాం..

మల్లన్న సాగర్, కొండపోచమ్మ బాధితులను దుర్మార్గంగా రాత్రికి రాత్రి ఖాళీ చేయించింది మీరు..

కొండపోచమ్మ ప్రాజెక్టులో మునిగిన 14 గ్రామాల్లో ఏ ఒక్కరికైనా ఇండ్లు ఇచ్చారా?

మిడ్ మానేరు ముంపు బాధితులకు ఇండ్లు ఇస్తామని మోసం చేసింది మీరు...

కానీ మేం అలా చేయడం లేదు..

బఫర్ జోన్ లో ఉన్న 10వేల కుటుంబాలకు కూడా పునరావాసం కల్పిస్తాం.

ఈ నగరాన్ని అభివృద్ధి చేయడం విపక్షాలకు ఇష్టంలేదా?

చరిత్ర కాలగర్భంలో మూసీని సమాధి చేయదలచుకున్నారా?

మేం ఉండేది ఐదేళ్లా, పదేళ్లా అనేది ప్రజలు నిర్ణయిస్తారు

ఉప్పెనలా వరదలు వస్తే నగరమే మిగలదు..

ఇదేమైనా గజ్వేల్ ఫామ్ హౌసా, లేక ధరణి లాంటి మాయాజాలమా?

ఎవరినో మోసం చేసి ఏదో చేయాలన్న ఆలోచన నాకు లేదు.. మూసీ పునరుజ్జీవనం ప్రాజెక్ట్ లో నా స్వార్థం లేదు..

ఆదాయాన్ని పెంచి పేదలకు పంచడమే మా ప్రభుత్వ ఆలోచన.

మూసీ విషం హైదరాబాద్ నగరాన్నే కాదు.. నల్లగొండనూ విషతుల్యం చేస్తోంది..

నల్లగొండ ప్రాంతానికి ఎలా పునరుజ్జీవనం కలిగించాలి..

మాట్లాడితే లక్షా 50వేల కోట్లు అని మాట్లాడుతున్నారు.. మీలా దోచుకోవడానికి ఇదేమైనా కాళేశ్వరం అనుకున్నారా?

మూసీ రివర్ కు సంబంధించి ప్రాజెక్టు రిపోర్టు తయారు చేసేందుకు ఐదు కంపెనీలు ఇక్కడ ఉన్నాయి.

మూసీ పునరుజ్జీవనంతో పాటు అవసరమయ్యే నిధుల అంచనా, సేకరణ లాంటి ప్రణాళికలు రూపొందిస్తారు.

18 నెలల్లో మూసీని ఏం చేయాలో వారు డీపీఆర్ అందిస్తారు..

ఇప్పటి వరకు మూసీ నదికి సంబంధించి జరిగిన ఒప్పందం రూ.141 కోట్లు మాత్రమే..

మరి లక్షా 50 వేల కోట్లు ఎక్కడి నుంచి వచ్చాయి?

సుందరీకరణ అనే పదాన్ని ఎక్కడి నుంచి తీసుకొచ్చారు...?

ఇది మూసీ సుందరీకరణ కాదు.. ఇది మూసీ పునరుజ్జీవనం.

మూసీ పునరుజ్జీవనం అనే గొప్ప కార్యక్రమాన్ని అడ్డుకోవడానికి.. అసూయ, ద్వేషంతో కొందరు సృష్టించే అపోహలను నమ్మకండి.

హైదరాబాద్ నగరంలోని అద్భుతమైన చారిత్రక కట్టడాలను కాలగర్భంలో కలిపేయాలని కొందరు కంకణం కట్టుకు తిరుగుతున్నారు.

ఏ సంస్థల గురించి వాళ్లు మాట్లాడుతున్నారో అవే సంస్థలకు వాళ్లు కూడా గతంలో కాంట్రాక్టులు ఇచ్చారు.

అప్పుడు లేని అభ్యంతరం మూసీ అభివృద్ధి విషయంలోనే ఎందుకు?

వాళ్లు చేస్తే గొప్ప.. మేం చేస్తే తప్పా?

హరీష్, కేటీఆర్, ఈటెల ముగ్గురూ మూడు నెలలు మూసీ ఒడ్డున నివసించాలి..

ఇప్పుడే ఆ ముగ్గురికీ ఇండ్లు కేటాయించాలని అధికారులకు ఆదేశిస్తున్నా... వాళ్లకు భోజన సదుపాయం కూడా ఏర్పాటు చేయండి..

మూసీ పరివాహకం అలాగే ఉండాలనుకుంటే మీరు అక్కడ ఉండి రోల్ మోడల్ గా నిలవండి.

మూడు నెలలు మీరు అక్కడ ఉండగలిగితే నేను ఈ ప్రాజెక్టును విరమించుకుంటా..

ఒక తెలంగాణ కవి తన నలుగురు కూతుర్లకు గంగ, యమునా, సరస్వతీ, కృష్ణవేణి అని పేర్లు పెట్టుకున్నాడు..

మన మూసీ నది పేరు పెట్టుకోకపోవడానికి గత పాలకులు కాదా?

ఈ ద్రోహాన్ని ఇలాగే కొనసాగిద్దామా..?

దేశ ద్రోహం కంటే ఇది పెద్ద నేరం..

హిరోషిమా,నాగసాకిలలో పడిన అణుబాంబు కంటే మూసీ ఆక్రమణ ప్రమాదకరం..

మూసీ నది పునరుజ్జీవనంపై చర్చకు ప్రత్యేకంగా అసెంబ్లీ సమావేశాలు పెడదాం.

మూసీ పరివాహక ప్రజలను ఆదుకునేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది..

వారికి ఏం ఇద్దామో చెప్పాలని కేసీఆర్, కేటీఆర్, కిషన్ రెడ్డి, ఈటెల చెప్పాలని విజ్ఞప్తి చేస్తున్నా..

అవసరమైతే న్యాయ నిపుణుల సలహా తీసుకుని ఎంపీల అభిప్రాయాలను అసెంబ్లీ రికార్డుల్లోకి తీసుకుందాం..

మన నగరాన్ని ఎలా ముందుకు తీసుకెళ్లాలో మీరు చెప్పండి..

ఎంఐఎం, బీజేపీ, బీఆరెస్, కమ్యూనిస్టు పార్టీల అధ్యక్షులకు నేను విజ్ఞప్తి చేస్తున్నా..

మీకు ఎలాంటి అనుమానాలు ఉన్నాయో నాకు పంపండి.. ప్రభుత్వం రాతపూర్వక వివరణ ఇవ్వడానికి సిద్ధంగా ఉంది..

ఈ శనివారం లోగా మీరు యాక్షన్ ప్లాన్ ఇవ్వాలని కోరుతున్నా..




## కొమురం భీమ్ కు నివాళులర్పించిన సీఎం రేవంత్



హైదరాబాద్ కొమురం భీమ్ వర్ధంతి సందర్భంగా జూబ్లీహిల్స్ నివాసంలో ఆయన చిత్రపటానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

## జీహెచ్ఎంసి కమిషనర్ గా ఇలంబరితీ

హైదరాబాద్:గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కొత్త కమిషనర్గా ఐయేఎస్ అధికారి కె. ఇలంబరితి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు కమిషనర్గా ఉన్న ఆమ్రపాలి కాటా ఏపీకి వెళ్ళిన నేపథ్యంలో.. ఆ స్థానాన్ని ట్రాన్స్పోర్ట్ కమిషనర్ ఇలంబరితికి జీహెచ్ఎంసీ కమిషనర్గా అదనపు బాధ్యతలు అప్పగించారు. దీంతో ఆయన జీహెచ్ఎంసీ కమిషనర్గా తన బాధ్యతలు చేపట్టారు.

ప్రజాబలం

18 అక్టోబర్ 2024 శుక్రవారం

## ఇంటింటి సర్వే.. పేదల సంజీవని

ఆధునిక కాలంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాల రూపకల్పనకు, పథకాల అమలుకై సర్వేలు ప్రధాన ఆధారం అవుతున్నాయి. అలాంటి సర్వేనే తెలంగాణ రాష్ట్రంలో నిర్వహించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర కేబినెట్ ఫిబ్రవరిలో ఆమోదం తెలిపింది. దీనిని వెనువెంటనే నిర్వహించాలని గత వారం ప్రభుత్వం జీవో జారీ చేసింది. ఈ సర్వేను రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి ఇంటికి వెళ్లి (డోర్ టు డోర్) చేయడానికి గాను ఆరవై రోజులు గడువును విధించారు. దీన్ని పర్యవేక్షించడానికి నోడల్ అధికారిని కూడా నియమించారు. రాష్ట్రంలో నూతన జనాభా లెక్కలు అయ్యే వరకు ఈ వివరాలనే రాష్ట్ర సర్కార్ ప్రామాణికంగా తీసుకోనుంది. భారతదేశంలో అత్యధికులు పేదవారు. దీనికి తెలంగాణ రాష్ట్రమేమీ మినహాయింపు కాదు. దేశంలో 28 శాతం కుటుంబాలు దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నాయని వివిధ సర్వేలు తేల్చి చెప్పాయి. దాదాపు అదే స్థాయిలో పేద కుటుం బాలు రాష్ట్రంలోనూ ఉన్నాయి. అలాంటి వారి వివరాలను సమగ్రంగా తెలుసుకోవడానికి ఇంటింటి సర్వే ఉపయోగపడుతుంది. రాష్ట్రంలోని పేద కుటుంబాల వివరాలను సమగ్రంగా తెలుసుకోవడానికి ఇంటింటి సర్వే ఉపయోగపడుతుంది. ఇది ఒక రకంగా కులగణనకు ప్రాధాన్యం ఇస్తూనే ప్రతి ఇంటిని (కుటుంబాన్ని) ఒక యూనిట్‌గా చేసుకుని అన్ని అంశాలను సేకరించేలా ప్రణాళికలను రూపొందించారు. రాష్ట్ర ప్రణాళిక సంఘం ఆధ్వర్యంలో జరిగే ఈ సర్వే ప్రధానంగా ఐదు అంశాలపై (కులాన్ని కలిపితే ఆరు అంశాలు) దృష్టి పెట్టనున్నది. కుల వివరాలతో పాటుగా ఆయా కుటుంబాలలోని విద్య, ఉపాధి (ఉద్యోగ), సామాజిక, రాజకీయ, ఆర్థిక వెనుకబాటుతనానికి సంబంధించిన విషయాలను నమోదు చేయనున్నది.

పేదల సంక్షేమం, సామాజిక సమానత్వం, అభివృద్ధి, సాధికారత, ఆర్థిక స్వావలంబన వంటి వాటి ప్రాతిపదికన సర్వే జరుగుతుండటం గమనార్హం. ఈ సర్వేలో రాష్ట్ర బీసీ కమిషన్, స్టేట్ ప్లానింగ్ బోర్డులు సంయుక్తంగా అన్ని కులాల వివరాలను సేకరించనున్నాయి. ముఖ్యంగా రాష్ట్రంలోని బీసీ ఓటర్ల సంఖ్య ఎంత? రాజకీయంగా వారి వెనుకబాటుతనాన్ని అంచనా వేయ డంతో పాటు వారికి కేటాయించాల్సిన వాటాలను నిర్ణయించడానికి ఇది దోహదం చేస్తుంది. సర్వే వివరాలతో స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయడానికి బిసీలకు కల్పించాల్సిన రిజర్వేషన్‌లను కమిషన్ ఖరారు చేయనున్నది. రాష్ట్ర ఎస్సీ జనాభా వివరాలు కూడా దీని ద్వారా తేలుతున్నందున ఎస్సీ వర్గీకరణ కోసం కులాలు, ఉప కులాలను గ్రూపుల వారీగా విభజించడానికి, వారికి ఇప్పటివరకు ప్రభుత్వపరంగా లభించిన సౌకర్యాలపైన కూడా స్పష్టత రానుంది. ఎస్సీ వర్గీకరణ అమలుకై సర్వే ఫలితాలను వాడుకోవచ్చును. కానీ రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణను మాత్రం 2011నాటి జనాభా లెక్కల ప్రకారం చేయనున్నట్లు ఇప్పటికే ప్రకటించింది. కేవలం స్థానిక సంస్థల్లో బీసీలకు పొలిటికల్ రిజర్వేషన్, ఎస్సీ వర్గీకరణ ఉపయోగపడేలా మాత్రమే కాకుండా రాష్ట్రంలోని ఇతర కులాలకు బలహీన వర్గాల వారి పరిస్థితిని బేరీజు వేయడానికి, భవిష్యత్తులో ప్రభుత్వం తరపున వారికి కల్పించాల్సిన అవకాశాలపై నిర్ణయం తీసుకోవడానికి ఇంటింటి సర్వే ఉపయోగపడుతుంది. దీనివల్ల ప్రభుత్వం అందించాల్సిన సంక్షేమ పథకాలు, కొత్తగా ప్రవేశపెట్టే స్కీములు తదితరాలపై స్పష్టమైన నిర్ణయం తీసుకోవడానికి వీలు అవుతుంది.

తెలంగాణలో ప్రజా ప్రభుత్వం పేరుతో ఏర్పాటైన కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీల పథకాలతో పాటు సంక్షేమరాజ్య లక్షణాలలో ఒకటైన ప్రజా సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యతను ఇవ్వడం హర్షణీయం. దేశం మొత్తంలోనే సంక్షేమరాజ్య లక్ష్యాలను నెరవేర్చడంలో తెలంగాణ ప్రభుత్వం ముందు వరుసలో ఉందనడంలో సందేహం లేదు. అయితే గత ప్రభుత్వాలు సంక్షేమ పథకా లు, అభివృద్ధి పనులు సైతం ప్రవేశపెట్టాయి కానీ వాటి లబ్దిదారులే అనర్హులు. ప్రతి పథకం అవినీతి జాడ్యంలో కూరుకుపోయిందని అనేక నివేదికలు బట్టబయలు చేశాయి. ఈ విషయాలు తెలిసిన ప్రభుత్వాలు ఏమీ పట్టనట్లుగా వ్యవహరించడం కొసమెరుపు. ప్రతి ఐదేళ్లకొకసారి వచ్చే ఎన్నికల తంతులో భాగంగా ప్రభుత్వాలు మారా యే తప్ప పేద ప్రజలకు ఒరిగేదేమీలేదు. గెలిచిన ప్రతి ప్రభుత్వం కూడా తన మందీమార్బలానికి పథకాలలో వాటాలు కల్పిస్తూ మరింత తూట్లు పొడిచాయే తప్ప, అక్రమార్కులను, అనర్హులను ఏరివేయడంలో శ్రద్ధ పెట్టలేదు. దీంతో కోట్లాది రూపాయల పేదల సొమ్ము అనర్హులు, అవినీతిపరుల జేబుల్లోకి చేరింది. గతంలో పథకాలలోని అవినీతి గురించి ప్రధానమంత్రులు స్వయంగా మాట్లాడుతూ రూపాయిలో పావలా మాత్రమే లబ్దిదారునికి చేరుతుందని ఒకరు ప్రకటిస్తే, మరొకరు కేవలం పదిహేను పైసలే చేరుతున్నాయని ప్రకటించారు. ఇలా అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలు అవినీతిమయమై అనర్హుల పాలవుతున్నాయి. వీటన్నింటిని గమనించిన పేదల పక్షపాతి, దీక్షా, దక్షత కలిగిన తెలంగాణ ముఖ్యమంత్రి ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చాలంటే, మ్యానిఫెస్టోను సక్రమంగా అమలు చేయాలంటే ముందుగా అవినీతి అక్రమార్కులను, అనర్హులను ఏరివేస్తేనే నిజమైన పేదవాడికి న్యాయం జరుగుతుందని గుర్తెరిగి ఇంటింటి సర్వే మొదలుపెట్టడం ముదావహం. ప్రస్తుతం వివిధ పథకాల లబ్ధిదారులు ఎవరు? నిజమైన వారికే దక్కుతున్నాయా లేదా? వారి సామాజిక స్థితి, ఆర్థిక, వైద్య సౌకర్యాల పరిస్థితులు ఏమిటి? విద్య సౌకర్యం గతంలో వారు పొందింది ఎంత? ఉపాధి, ఉద్యోగం ఉందా, లభిస్తుందా? వీటిని లబ్ధిపొందగోరేవారు ఎంత మంది? ఇలాంటి అనేక అంశాల సమ్మేళితమే ఇంటింటి సర్వే. అయితే గత ప్రభుత్వం సర్వే జరిపి నివేదికలు రూపొందించినా వాటిని అమలు చేయకుండా బుట్టదాఖలు చేసినట్టు కాకుండా సర్వే ఫలితాల ప్రకారం నూతన సంస్కరణలు, సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తేనే నిజమైన లబ్దిదారులకు మేలు జరుగుతుంది. దీనితో బహుజన హితాయ, బహుజన సుఖాయ అనేది సాకారం అవుతుంది. అప్పుడే నిజమైన ప్రజా ప్రభుత్వం అనిపించుకుంటుంది.

## సీఎం చంద్రబాబు సహా 9 మంది హై-రిస్క్ వీఐపీల భద్రత సీఆర్‌పీఎఫ్‌కి అప్పగింత

### ఎన్ఎస్‌జీ కమాండోలను ఉపసంహరించాలని కేంద్రం నిర్ణయం

### వీఐపీల భద్రత కోసం సీఆర్‌పీఎఫ్ 7వ బెటాలియన్‌కు హోంశాఖ ఆమోదం

### నెలలోగా హై-రిస్క్ వీఐపీల భద్రత బాధ్యతలను చేపట్టనున్న సీఆర్‌పీఎఫ్

దేశవ్యాప్తంగా 9 మంది 'హై రిస్క్' వీఐపీల భద్రత విషయంలో కేంద్ర ప్రభుత్వం కీలకమైన నిర్ణయం తీసుకుంది. వీరి భద్రత నుంచి ఎన్ఎస్‌జీ కమాండోలను పూర్తిగా ఉపసంహరించుకొని, ఆ బాధ్యతలను సీఆర్‌పీఎఫ్‌కు అప్పగించేందుకు సిద్ధమైంది. వచ్చే నెలలోగా ఈ ప్రక్రియను పూర్తి చేయాలంటూ కేంద్ర ప్రభుత్వం ఆదేశించినట్లు అధికారిక వర్గాలు తెలిపాయి. ఈ మేరకు ప్రత్యేకంగా శిక్షణ పొందిన కొత్త బెటాలియన్‌ను సీఆర్‌పీఎఫ్‌కు కేటాయిస్తూ కేంద్ర హోంమంత్రిత్వ శాఖ ఆమోదం తెలిపింది. ఇటీవలే పార్లమెంటు భద్రతా విధుల నుంచి ఉపసంహరించిన వీఐపీ భద్రతా విభాగాన్ని సీఆర్‌పీఎఫ్ 7వ బెటాలియన్‌గా కేటాయించింది.

హై-రిస్క్ వీఐపీలు వీరే..

ప్రస్తుతం నేషనల్ సెక్యూరిటీ గార్డ్స్ (ఎన్ఎస్‌జీ) బ్లాక్ క్యాట్ కమాండోలు 'జెడ్ ప్లస్' కేటగిరీ భద్రత కల్పిస్తున్న వీఐపీలు 9 మంది ఉన్నారు. ఈ జాబితాలో ఏపీ సీఎం చంద్రబాబుతో పాటు ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్, బీఎస్‌పీ అధినేత్రి మాయావతి, కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, మాజీ ఉప ప్రధాని, బీజేపీ కురువృద్ధుడు ఎల్‌కే అద్వానీ, కేంద్ర మంత్రి సర్బానంద సోనోవాల్, బీజేపీ సీనియర్, ఛత్తీస్‌గఢ్ మాజీ సీఎం రమణ్ సింగ్, జమ్మూ కశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి గులాం నబీ ఆజాద్, నేషనల్ కాన్ఫరెన్స్ అధ్యక్షుడు ఫరూక్ అబ్దుల్లా ఉన్నారు. వీరందరి భద్రతను ఇకపై సీఆర్‌పీఎఫ్ చూసుకోనుంది. సీఎం చంద్రబాబు భద్రతను ఎన్ఎస్‌జీ నుంచి సీఆర్‌పీఎఫ్‌కి మార్చేందుకు ఆంధ్రప్రదేశ్ పోలీసుల బృందం ఇటీవల ఢిల్లీకి వెళ్లిందని సంబంధిత వర్గాలు తెలిపాయి.కాగా రెండు బలగాల మధ్య భద్రతా విధుల బదిలీ ప్రక్రియ ఒక నెల లోపు పూర్తవుతుందని కేంద్ర హోంశాఖ వర్గాలు భావిస్తున్నాయి. వీఐపీల భద్రతా విధుల నుంచి ఎన్ఎస్‌జీని ఉపసంహరిస్తే దాదాపు 450 మంది 'బ్లాక్ క్యాట్' కమాండోలు కేంద్రానికి అందుబాటులో ఉంటారు. ఎన్ఎస్‌జీని కేవలం ఉగ్రవాద నిరోధానికి మాత్రమే వినియోగించాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. ఇందులో భాగంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది.

## వివాదాల్లో కొండా సురేఖ



హైదరాబాద్, అక్టోబరు 17, (న్యూస్ పల్స్)ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన బీసీ సామాజిక వర్గం చెందిన మంత్రి కొండా సురేఖ ఎపిసోడ్ పొలిటికల్ సర్క్యూట్స్ లో హాట్ టాపిక్‌గా మారింది. బీఆర్ఎస్ సోషల్ మీడియాలో తనను వ్యక్తిగతంగా టార్గెట్ చేసి ట్రోల్ చేశారని, దాని వెనక ఆ పార్టీ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు ఉన్నారంటూ.. ఆరోపిస్తూ చేసిన వ్యాఖ్యలతో పొలిటికల్ కాంట్రవర్సీ అయింది. సినిమా సెలబ్రిటీలతో కేటీఆర్‌కు లింక్స్ అంటూ చేసిన కామెంట్స్ సంచలనం రేపాయి అప్పటి నుండి కొండా సురేఖ వార్తల్లో ఉంటున్నారు.సినీ నటులు నాగార్జునకు చెందిన ఔ కన్వెన్షన్ కూల్చివేత నుండి మొదలైన మంత్రి కొండా సురేఖ కాంట్రవర్సీ.. ప్రస్తుతం సొంత జిల్లాలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల ఫ్లెక్సీ వివాదంతో ప్రత్యక్ష ఫిర్యాదుల దాకా వెళ్లింది. ఏఐసీసీ తెలంగాణ ఇంచార్జ్ దీపాదాస్ మున్షి, టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ను కలిసి చర్యలు తీసుకోవాలని వరంగల్ జిల్లా ఆ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు ఫిర్యాదు చేశారు. తమ తమ నియోజిక వర్గాల్లో జరిగే వ్యవహారాల్లో ఉద్దేశపూర్వకంగా కలగచేసుకుని తమకు స్వేచ్ఛ లేకుండా చేస్తున్నారని పలువు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పార్టీకి ఫిర్యాదు చేయడంతో రాజకీయంగా చర్చకు దారితీస్తోంది.ఫిర్యాదు చేసినవారిలో స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్. నాగరాజు, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి, వరంగల్ వెస్ట్ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, భూపాల పల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ, ఎమ్మెల్సీ బసవరాజు సారయ్య ఉన్నట్లు తెలిస్తోంది. ప్రోటోకాల్ ప్రభుత్వ కార్యకలాపాలు వ్యక్తిగత వ్యవహారాల్లో మంత్రి కొండా సురేఖ జోక్యం చేసుకోవడం నచ్చడం లేదని సదరు నాయకులు ఆరోపిస్తున్నారు.ఏఐసీసీ తెలంగాణ చీఫ్‌తోపాటు టీపీసీసీకి ఫిర్యాదు చేయడమే కాకుండా ఢిల్లీ హై కమాండ్ వరకు కొండా సురేఖ వివాదం వెళ్లిందంటూ ప్రచారం సాగుతోంది. మంత్రి కొండా సురేఖ విషయం లో మాట్లాడాలంటూ ఏఐసీసీ కార్యదర్శి ఐఅ వేణుగోపాల్ అపాయింట్‌మెంట్ వరంగల్ ఎమ్మెల్యేలు కోరినట్లు తెలుస్తోంది. అయితే, రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జి దీప్‌దాసు మున్షీ.. పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ హామీతో ఎమ్మెల్యేలు ఢిల్లీ టూర్ ప్రస్తుతం వాయిదా వేసుకున్నట్లు సమాచారం. సమస్య పరిష్కారం చేస్తాం.. పరిష్కారం కాకపోతే అప్పుడు డిల్లీకి వెళ్ళండి అని సర్దిచెప్పడంతో ఢిల్లీ వెళ్లడం వాయిదా వేసుకున్నట్లు తెలిసింది.మరో వైపు బీసీ మహిళా నేతగా మంత్రిగా ఉన్న తనను కావాలనే బద్నాం చేస్తున్నారని కొండా సురేఖ ఆరోపిస్తున్నారు. కేటీఆర్ తనపై విషప్రచారం చేసిన సమయంలో తాను చేసిన కామెంట్స్ పై సైతం కుట్రలో భాగంగానే రాద్ధాంతం చేశారని విమర్శిస్తున్నారు. మరి.. కొండా సురేఖ ఎపిసోడ్‌కు తెలంగాణ కాంగ్రెస్ ఎలా ఫుల్‌స్టాప్ పెడుతుందో చూడాలి..!

## మిల్లర్లే కొంటున్నారు పచ్చి వడ్లకు క్వింటాల్ కు రూ. 2,200 చెల్లింపు.




నిజామాబాద్ : జిల్లాలో వరి పంట కోతలు మొదలై 20 రోజులు దాటింది. ఇంకా సర్కార్ కొనుగోలు కేంద్రాలు ప్రారంభంకాకపోయినా, మిల్లర్లే నేరుగా కల్లాల మీదకు వచ్చి జోరుగా ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. ఖరీఫ్ వచ్చిన వడ్లలో ఇప్పటికే 35 శాతం వరకు కొన్నట్టు తెలుస్తోంది. కల్లాల వద్దకు ఏజెంట్ల సహాయంతో చేరుకొని సన్నాలు, దొడ్డురకం తేడాలేకుండా పచ్చివడ్లను క్వింటాల్కు రూ.2,200 ధరకు కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వ మద్ధతు ధరకు దాదాపు సమానంగా మిల్లర్లు రేట్‌ఇస్తుండడంతో రైతులు వారివైపే మొగ్గుచూపుతున్నారు. సన్న వడ్లకు ఈ సీజన్ నుంచి క్వింటాల్కు రూ.500 చొప్పున బోనస్ ఇవ్వాలని పాలకులు నిర్ణయించారు. కానీ, మిల్లర్ల కల్లాల దగ్గరే కొంటుండంతో రైతులు ముందుగానే అమ్మేసుకుంటున్నారు. దీంతో వారు బోనస్ నష్టపోవాల్సి వస్తోంది.

వరుసగా మూడో సీజన్:

జిల్లాలో సాగు భూమి విస్తీర్ణం 5.53 లక్షల ఎకరాలుకాగా రెండేండ్ల నుంచి వరిసాగు అనూహ్యంగా పెరిగింది. ప్రస్తుత ఖరీఫ్లో రికార్డు స్థాయిలో 4.30 లక్షల ఎకరాలలో వరి పంట వేశారు. అందులో సన్నరకం వరి పంట 4.02 లక్షల ఎకరాలు కాగా, కేవలం 28 వేల ఎకరాలలో మాత్రమే దొడ్డురకం పంట ఉంది. ఏ, గ్రేడ్ వడ్లకు ప్రభుత్వ మద్దతు ధర క్వింటాల్ కు రూ.2,320, కామన్ రకం సన్నాలకు రూ.2,300 రేట్ కొనసాగుతోంది. మద్ధతు ధరకు అదనంగా రూ.500 బోనస్ ప్రకటించింది. వెరసి క్వింటాలడ్లకు కలిపి మొత్తం రూ.2,800 రేట్ దక్కే అవకాశం ఉండటంతో జిల్లా రైతులు ఈసారి సన్న రకం వరి సాగు చేశారు.

అయితే 2023--24 ఖరీఫ్, యాసంగిలో కర్నాటక, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాల మిల్లర్లు జిల్లాలో పండిన వడ్లను భారీగా కొనుగోలు చేశారు. భారీ వర్షాల కారణంగా ఆ రాష్ట్రాలలో వరిసాగు దెబ్బతినడంతో తెలంగాణకు వచ్చారు. ఈసారి కర్నాటక, ఆంధ్రప్రదేశ్ స్టేట్మిల్లర్లతోపాటు నల్గొండ, కోదాడ, ఖమ్మం, హైదరాబాద్ జిల్లాల నుంచి 20 రోజుల కిందే వచ్చిన మిల్లర్లు జిల్లాలో వడ్లు కొనుగోళ్లు షురూ చేశారు. పచ్చివడ్లకు మొదట్లో క్వింటాల్కు రూ.2,450 చెల్లించి ప్రస్తుతం రూ.2,200 ఇస్తున్నారు. ఇప్పటిదాకా సుమారు నాలుగు లక్షల మెట్రిక్ టన్నులు సేకరించినట్లు తెలుస్తోంది. క్వింటాల్ వడ్లకు రూ.30 కమిషన్పై గ్రామాలల వారీగా ఏజెంట్లను నియమించుకుంటున్నారు. దీంతో సర్కారు కొనుగోళ్ల లక్ష్యం దెబ్బతింటోంది. అంకెలు. సంఖ్యలు దాటని ఆఫీసర్ల ప్రణాళిక, ఈ ఖరీఫ్లో జిల్లాలో 12 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేసిన ఆఫీసర్లు, అందులో 8 లక్షల టన్నులు 629 సర్కారు సెంటర్స్‌ఏర్పాటు చేసి కొనాలని ప్రణాళిక రూపొందించారు. సన్నరకం వడ్ల కోసం 465, దొడ్డురకానికి 164 సెంటర్లను ఓపెన్ చేస్తామని ప్రకటించారు. దసరా పండగ దాటినా ఇంకా సెంటర్లు తెరవలేదు. వడ్లు నింపడానికి కావాల్సిన 1.20 కోట్ల గన్నీ బ్యాగులు, టర్పాలిన్లు ఇంకా జిల్లాకు చేరలేదు.

ప్రభుత్వ సెంటర్లు ఓపెన్ అయితే మద్దతు ధరతో పాటు సన్న వడ్లకు రూ.500 బోనస్ అంది ఆర్థికంగా లాభం పొందుతారు. బస్తాకు 3 కిలోల తరుగు తీసున్నా మిల్లర్లు చెల్లిస్తున్న రేట్ కాస్త పరవాలేదనుకున్నా రైతులు బోనస్ మాత్రం నష్టపోతున్నారు. పైగా ప్రభుత్వ కొనుగోళ్ల టార్గెట్కు కూడా పెద్ద దెబ్బే. వచ్చే జనవరి నుంచి రేషన్ కార్డులకు సన్నబియ్యం అందించాలనే సర్కారు నిర్ణయంపై కూడా ఇది ప్రభావం చూపుతుందని అంటున్నారు.

## తెలంగాణ భవన్ లో
## మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు చిట్ చాట్..!

హైదరాబాద్ రేవంత్ రెడ్డి ప్రభుత్వం వచ్చిన తరువాత ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఒక్క చీర కాదు మేము అధికారంలోకి వస్తే రెండు చీరలు ఇస్తామని చెప్పారు.బతుకమ్మ రోజు ఒక్క చీర కాదు కధా, ఉన్న చీర కూడా బంద్ పెట్టారు.అధికారంలోకి వస్తే రైతు బంధు రూ.10,000 కాదు, రూ.15,000 ఇస్తామని చెప్పి ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు.కేసీఆర్ కిట్ బంద్ చేశారుచేప పిల్లలు చెరువుల్లోనే వదలడం లేదు, చేప పిల్లలు తక్కువగా పోవాలని అధికారులు ఆదేశాలు ఇస్తున్నారు.చేప పిల్లలకు టెండర్ పిలవలేదు, ముదిరాజ్‌లకు గంగపుత్రులకు తీవ్రమైన అన్యాయం చేసింది ఈ ప్రభుత్వం.మార్పు మార్పు అని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్, ఇవాళ ఈ మార్పులు చేస్తోందిరెండు చీరలు అన్నారు, ఉన్న చీర పోయింది.డబుల్ చేప పిల్లలు చెరువుల్లో వేస్తామనీ చెప్పి ఒక్క చేప పిల్ల కూడా చెరువుల్లో వేయలేదు, ఇదీ మార్పు చెరువులు పూర్తిగా నిండినప్పటికీ చేప పిల్లలు ఎందుకు వేయడం లేదు? ఆగస్ట్ లో పోయాల్సిన చేప పిల్లలను అక్టోబర్ వచ్చినా పోయలేదు. మేము 100కోట్లు ఖర్చు చేస్తే. కాంగ్రెస్ ప్రభుత్వం చేప పిల్లల కోసం బడ్జెట్ లో పెట్టింది 16కోట్లు. రీజనల్ రింగ్ రోడ్ భూసేకరణ రీజనల్ రింగ్ రోడ్ మా హయంలో ఉత్తర, దక్షిణ భాగం రెండు భాగాలుగా ప్రతిపాదన చేశాం. ఉత్తర భాగం 158 కిలోమీటర్లు కేంద్ర ప్రభుత్వం ఆమోదించింది. భూసేకరణ కోసం 3ఏ ద్వారా నోటిఫికేషన్లు ఇవ్వటం జరిగింది. ఖర్చు మాత్రం రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు కలిసి సగం భరించేలా ప్రతిపాదన. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 10 నెలలు అవుతోంది, భూసేకరణ చేయడం లేదు, ఎందుకు ఆలస్యం జరుగుతోంది? ఉత్తర భాగంలో యుద్ధ ప్రాతిపదికన మార్కెట్ విలువ ప్రకారం రైతులకు డబ్బులు చెల్లించాలి. ఎల్ సి టి వారికి దక్షిణ భాగంలో అలైన్మెంట్ ఫైనల్ చేయమని నేషనల్ హైవే అథారిటీ వారు చెప్పారు. 182 కిలోమీటర్ల అలైన్మెంట్ పూర్తి చేసింది. దక్షిణ భాగం అలైన్మెంట్ పూర్తిగా మార్చారు ప్రముఖుల భూములు ఉన్నాయి అని అలైన్మెంట్ మార్చారు. ఒక్కసారి ఫైనల్ చేసిన అలైన్మెంట్ ని నేషనల్ హైవే అథారిటీ వారు ఒప్పుకోరు అని తెలిసి రాష్ట్ర ప్రభుత్వం అలైన్మెంట్ మార్చింది. నేషనల్ హైవే అథారిటీ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన అలైన్మెంట్ ని ఒప్పుకోకపోతే రాష్ట్ర ప్రభుత్వం 20 వేల కోట్లుతో దక్షిణ భాగం రీజనల్ రింగ్ రోడ నిర్మించబోతుంది. అలైన్మెంట్ మార్చడం వల్ల 182 కిలోమీటర్ల నుంచి 198 కిలోమీటర్లకు పెరిగింది. కాంట్రాక్టర్ల లాభం కోసం 20 వేల కోట్ల భారాన్ని రాష్ట్ర ప్రజలపై వేస్తున్నారు. రుణమాఫీ కోసం అప్పు పుట్టడం లేదని మంత్రి తుమ్మల అంటున్నారు, అలైన్మెంట్ మార్చడం వల్ల 20 వేల కోట్లు ఎక్కడి నుంచి తెస్తారు మరి? మీ లాభం కోసం 20,000 కోట్ల అప్పు చేస్తారా అని ప్రశ్నించారు.

# జ్ఞానపీఠ అవార్డు గ్రహీత రావూరి

ప్రతిష్టాత్మకమైన జ్ఞానపీఠ్ అవార్డు పొందిన మూడో తెలుగు రచయిత రావూరి భరద్వాజ. ఆయన కన్నా ముందు ఈ అవార్డు కవి సామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణకు, డాక్టర్ సి. నారాయణరెడ్డికి ఈ అవార్డు లభించింది. భరద్వాజ 2011లో త్రిపురనేని గోపీచంద్ పురస్కారాన్ని, 2009లో లోక్ నాయక్ పౌండేషన్ సాహిత్య పురస్కారాన్ని, 2012లో జ్ఞానపీఠ పురస్కారాన్ని అందుకున్నారు. రావూరి భరద్వాజ (జూలై 5, 1927 – (అక్టోబరు 18, 2013) తెలుగు లఘు కథా రచయిత, నవలా రచయిత, రేడియోలో రచయితగా పేరు తెచ్చు కున్నారు. గొప్ప భావుకుడైన తెలుగు కవి, రచయిత. రావూరి భరద్వాజ 37 కథా సంపుటాలు, 17 నవలలు, 6 బాలల మినీ నవలలు, 5 బాలల కథా సంపుటాలు, 3 వ్యాస, ఆత్మ కథా సంపుటాలు, 8 నాటికలు, ఐదు రేడియో కథానికలు రచిం చారు. ఈయన బాల సాహిత్యంలో కూడా విశేషకృషి సలిపారు. సినీ పరిశ్రమలో తెరవెనుక జీవితాన్ని కళ్లకు కట్టినట్టు చిత్రీకరించిన పాకుడు రాళ్ళు నవల భరద్వాజ యొక్క ఉత్కృష్ట రచనగా పరిగ ణింప బడుతుంది. ఆయన రచనలలో జీవన సమరం మరో ప్రముఖ రచన. తెలుగు రచనా ప్రపంచంలో వినూత్న సాహితీ ప్రక్రియకు శ్రీకారం చుట్టిన ఘనుడాయన. ఆడంబ రాలు లేని సాధారణ జీవితం ఆయనది. భరద్వాజకు దిగువ మధ్యతరగతి, పేదప్రజల భాషపై గట్టిపట్టు ఉంది. ఒక బీద కుటుంబంలో జన్మించిన భరద్వాజ కేవలం ఉన్నత పాఠశాల స్థాయి వరకే చదువు కున్నారు. ఆ తరువాత కాయకష్టం చేసే జీవితాన్ని ప్రారంభించారు. చిన్న తనంలో పొలాల్లో గడిపిన భరద్వాజ వ్యవసాయ కూలీల కఠినమైన జీవన పరిస్థితులను గమనించే వారు. అప్పుడే పల్లె ప్రజల భాష, యాస, ఆవేశాలు, ఆలోచనలు, కోపాలు, తాపాలు గమనించిన భరద్వాజ ఆ అనుభవాలను తర్వాత కాలంలో తన రచనలలో నిజమైన పల్లె వాతావరణాన్ని సృష్టించడానికి ఉపయోగించు కున్నారు. 2013 అక్టోబరు 18న రావూరి భరద్వాజ తిరిగిరాని లోకాలకు తరలి వెళ్ళారు. రావూరి 1927 జూలై 5వ తేదీన కృష్ణా జిల్లా లోని నందిగామ తాలూకా కంచికచర్ల సమీపం లోని మోగులూరు (నాటి హైదరాబాదు సంస్థానంలోని) గ్రామంలో రావూరి కోటయ్య, మల్లికాంబ దంపతులకు జన్మించారు. ఆయన విద్యాభ్యాసం 8వ తరగతి వరకే సాగింది. తొలి నాళ్ళలో రావూరి భరద్వాజపై చలం ప్రభావం ఎక్కువగా ఉండేది. యుక్త వయసులోనే తెనాలిచేరి అక్కడ ఒక ప్రెస్సులో పనిచేయటం ప్రారంభించారు. 1946లో నెల్లూరులోని జమీన్ రైతు వారపత్రిక సంపాదక వర్గంలో చేరారు.1948లో దీనబంధు వారపత్రికకు బాధ్యులుగా ఉన్నారు. జ్యోతి,సమీక్ష, అభిసారిక, చిత్రసీమ, సినిమా, యువ పత్రికల్లో 1959వరకు కొన్నాళ్ళు ఫౌంటెన్ పెన్నుల కంపెనీలో సేల్స్‌మన్‌గా పని చేశారు. అక్కడ యజమాని అమానుషత్వాన్ని భరించలేక రాజీనామా చేసి కొన్నాళ్ళపాటు ఖాళీగా ఉన్నారు. ఆ తర్వాత హైదరాబాదు ఆకాశవాణి కేంద్రంలో 1959లో ప్రూఫ్ రీడింగ్ కళాకారునిగా చేరి చివరకు 1987లో ప్రసంగ కార్యక్రమాల ప్రయోక్తగా పదవీ విరమణ చేశారు. రావూరి భరద్వాజ గురించి చాలాకాలం పరిశోధన చేసి, రచనల గురించి సమగ్రమైన పరిశీలన చేసిన బొగ్గుల శ్రీనివాస్ ప్రకారం భరద్వాజ సుమారు 187 పైగా పుస్తకాలను వెలువరించారు, 500 పైగా కథలను 37 సంకల నాలుగా, 19 నవలలు, 10 నాటకాలు వ్రాశారు. భరద్వాజ తన తొలి కథ ఒకప్పుడును 16 ఏళ్ల ప్రాయంలో వ్రాశారు. ఇది జానపద శైలిలోసాగే కథ. భరద్వాజపై చలం ప్రభావం మెండుగా ఉంది. చలాన్ని అనుకరిస్తూ ఈయన అనేక సెక్సు కథలు వ్రాశారు. త్వరలోనే సెక్సు కథలు వ్రాయటంలో అందెవేసిన చెయ్యి అనిపించు కున్నారు. అనేక పత్రికలు ఆ వ్యాసంగంలో ఈయన్ను ప్రోత్సహించాయి. ఏ మాత్రం సంకోచం, జంకు లేకుండా జీవనోపాధికై ఆయన అనేక కథలు వ్రాశారు. 1983లో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డును పొందారు. నాలోని నీవు, అంతరంగిణి, ఒక ఏకాంతం, ఒకింత వేకువ కోసం వంటి కవితా సంకలనాలు రచించారు. భరద్వాజ రచించిన కౌముది, హిందీ, గుజరాతీ భాషల్లోకి అనువాద మైంది. ఆత్మగతం, బానుమతి, దూరపు కొండలు, జీవనాడి, మనోరత్నం, నీరు లేని నది, సశేషం, స్వప్న సీమలు, స్వర్ణ మంజరి వంటి 11 నాటకాలు రచించారు. బాల సాహిత్యానికి సంబంధించి 33 పుస్తకాలు రచించారు. పిల్లల కోసం ఏడు నవలలు రాశారు. విచిత్రమైన మానవ భావోద్వేగాలే ప్రధానాంశాలుగా కథలు వ్రాసే భరద్వాజ శైలి సరళమైనది. పాత్ర చిత్రీకరణలో, ఒక సన్నివేశాన్ని పరిచయం చేయటంలో రావూరి భరద్వాజకు ఉన్న ప్రజ్ఞ అద్భుతమైనది. రావూరి భరద్వాజ పేరు ప్రఖ్యాతులు తెచ్చిన రచనల్లో ముఖ్యమైనది, చలనచిత్ర పరిశ్రమను వస్తువుగా చేసుకొని తెలుగులో వెలువడిన మొట్ట మొదటి నవల పాకుడు రాళ్లు. భరద్వాజ దీనికి మాయ జలతారు అని నామకరణం చేశారు. అయితే శీలా వీర్రాజు పాకుడురాళ్లు అనే పేరు పెట్టాడు. మల్లంపల్లి సోమశేఖర శర్మ, ముదిగొండ సుబ్రహ్మణ్య శర్మల ప్రోత్సాహంతో రావూరి భరద్వాజ తాను అంతకు ముందే రాసిన 'పాలపుంత' అనే ఓ పెద్ద కథని పాకుడురాళ్లు నవలగా రాశారు. మూడు సంవత్సరాల పాటు కృష్ణా పత్రికలో ధారా వాహికగా వెలువడిన పాకుడురాళ్లు నవలపై శ్రీకృష్ణదేవ రాయ, శ్రీ వేంకటేశ్వర విశ్వ విద్యాలయాల్లో పరిశోధనలు జరగడం విశేషం. రావూరి భరద్వాజకు 1980లో ఆంధ్ర విశ్వ విద్యాలయం, 1987లో జవర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వ విద్యాలయం, 1991లో నాగార్జున విశ్వ విద్యాలయం గౌరవ డాక్టరేట్లు ప్రదానం చేసి గౌరవించాయి. 1980లో కళాప్రపూర్ణ – ఆంధ్ర విశ్వవిద్యాలయం,1983లో కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం, 1985లో సోవియట్ భూమి నెహ్రూ పురస్కారం ఇనుక తెర వెనకకు లభించింది. 1987లో రాజాలక్ష్మీ ఫౌండేషన్ అవార్డు,1987లో తెలుగు కళాసమితి కె.వి.రావు, జ్యోతిరావు అవార్డు, 1997లో తెలుగు విశ్వ విద్యాలయం నుండి సాహిత్యలో విశిష్ట పురస్కారం, 2007లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కళారత్న అవార్డు, 2008లో లోక్ నాయక్ ఫౌండేషన్ పురస్కారం, (వినూత్న సాహితీ ప్రక్రియ కల్పించినందుకు, డిసెంబరు 4 వ తేదీన ప్రకటించారు), 2011లో కేంద్ర సాహిత్య అకాడమీ, వంగూరి ఫౌండేషన్, గోపీచంద్ జాతీయ సాహిత్య పురస్కారాలు లభించాయి. 2012లో జ్ఞానపీఠ అవార్డు తెలుగు సాహిత్యానికి ఆయన చేసిన బహుముఖమైన కృషికి దక్కింది.

# తొలిజ్ఞానపీఠ అవార్డు గ్రహీత

తెలుగు వారికి తొలి జ్ఞానపీఠాన్ని అందించిన బహుముఖ ప్రజ్ఞలు కవిసమ్రాట్ శ్రీ విశ్వనాథ సత్యనారాయణ. విశ్వనాథ వారి ఏ రచన అయినా సరే భారతీయ ఆత్మను, జీవుని వేదనను ప్రతిబింబించేదే. ప్రతీ అక్షరంలోను అసాధారణ ఊహాశక్తిని, అద్భుత రచనాశైలిని నింపి పాఠకుల హృదయాలలోకి పరుగులెత్తించ గలిగిన శక్తి ఆయన సొంతం. తెలుగు సాహిత్య ప్రక్రియల్లో విశ్వనాథ వారు స్పృశించని ప్రక్రియ లేదు. తన రచనల ద్వారా కులాతీత, మతాతీత విధానాలను ఎండగట్టారు.

ఆధునిక తెలుగు రచయితల్లో ఆయన పేరు లేకుండా తెలుగు సాహిత్య చరిత్ర గురించి వివరించడం అసాధ్యం. విశ్వనాథ 1895, సెప్టెంబరు 10న కృష్ణా జిల్లా నందమూరు గ్రామంలో జన్మించాడు. తండ్రి శోభనాద్రి, తల్లి పార్వతమ్మ. ఈయన భార్య వరలక్ష్మమ్మ. విద్యాభ్యాసము నందమూరు, ఇందుపల్లి, మరియు పెదపాడు గ్రామాల్లోను, పై చదువులు బందరు పట్టణంలోను సాగాయి. బందరు హైస్కూలులో తిరుపతి వేంకట కవులలో ఒకరైన చెళ్ళపిళ్ళ వేంకట శాస్త్రి తెలుగు ఉపాధ్యాయునిగా లభించడం ఆయన అదృష్టం. బి.ఎ. తరువాత విశ్వనాథ బందరు హైస్కూలులోనే ఉపాధ్యాయునిగా చేరాడు. ఉద్యోగం చేస్తూనే మద్రాసు విశ్వవిద్యాలయం నుంచి ఎమ్.ఎ. పట్టా సాధించాడు. తరువాతి కాలంలో ఈయన వివిధ కళాశాలల్లో అధ్యాపక పదవులు నిర్వహించాడు. బందరు నేషనల్ కాలేజి (1928), గుంటూరు ఆంధ్రా క్రిస్టియన్ కాలేజి (ఏసీ కాలేజీ) (1938 వరకు), విజయవాడ లో ఎస్.ఆర్.ఆర్., సి.వి.ఆర్. కాలేజి (1938–1959), కరీంనగర్ ప్రభుత్వ ఆర్ట్స్, సైన్స్ కాలేజి (1959) మొదలైన కళాశాలల్లో ఆయన పని చేసాడు. 1957 లో విశ్వనాథ ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ ఉపాధ్యక్షుడుగానూ, 1958లో విధానమండలికి నామినేటెడ్ సభ్యుడుగానూ పని చేశాడు. మహాత్మా గాంధీ నడుపుతున్న సహాయ నిరాకరణోద్యమంలో పాల్గొనడం కోసం ఉద్యోగాన్ని వదులు కున్నాడు. 1916 లో "విశ్వేశ్వర శతకము" తో విశ్వనాథ రచనా ప్రస్థానము ప్రారంభ మైనది. అప్పటి జాతీయోద్యమ ప్రభావంతో ఆ సమయంలోనే "ఆంధ్ర పౌరుషము" రచించాడు. 1920 నాటికే తెలుగులో ప్రసిద్ధ కవిగా గుర్తింపు తెచ్చు కొన్నాడు. 1961 లో కరీంనగర్ ప్రభుత్వ కళాశాలలో ప్రాచార్యునిగా పదవీ విరమణ చేసిన తరువాత పూర్తి స్థాయిలో తన సమయాన్ని సాహితీ వ్యాసాంగానికే కేటాయించాడు. తరువాత విశ్వనాథ రచనా పరంపర పుంఖానుపుంఖాలుగా కొనసాగింది. 25 పైచిలుకు కావ్యాలు, 6 శతకాలు, 13 గేయ కావ్యాలు, 15 నాటకాలు, 88 నవలలు, 10 సంస్కృత నాటకాలు, 10 విమర్శన గ్రంథాలు, మరెన్నో వ్యాసాలు, ఉపన్యాసాలు... తెలుగుభాషకు విశ్వనాథ ఎనలేని సేవలు అందించాడు. ఆయన రచనలను కొన్ని ఇతర భాషలలోకి అనువదించారు. రేడియో కోసం నాటకాలు, ప్రసంగాలు రూపొందించాడు.

విశ్వనాథ రచనల్లో ప్రత్యేకంగా చెప్పుకోవాల్సినవి... ఆంధ్ర పౌరుషము, రామాయణ కల్పవృక్షము, వేయిపడగలు, కిన్నెరసాని పాటలు, పురాణవైర గ్రంథమాల, కాశ్మీర చారిత్రిక నవలలు, విశ్వనాథ మధ్యాక్కఱలు, నన్నయ ప్రసన్నకథాకలితార్థయుక్తి వంటివి. తెలుగు తనమన్నా, తెలుగు భాష అన్నా విశ్వనాథకు ప్రత్యేక అభిమానం. ఆంధ్ర పౌరుషం, ఆంధ్రప్రశస్తి ఆయన మొదటి రచనల లోనివి. విశ్వనాథ రచనలలో ఆయన పాండిత్యమే కాక, రచనాశిల్పం, పాత్ర చిత్రణ, చారిత్రక అవగాహన, వ్యక్తిత్వం అద్భుతంగా కనిపిస్తుంటాయి. తన రచనలలో శ్రీమద్రామాయణ కల్పవృక్షం (జ్ఞానపీఠ అవార్డు లభించినది) తనకు వ్యక్తిగతంగా ఎంతో తృప్తినిచ్చిందని అంటుండే వాడు. ఎందరో కవులు వ్రాసినా మళ్ళీ ఎందుకు వ్రాయాలంటే రోజూ తింటున్నామని అన్నం తినడం మానివేయడం లేదుగదా అన్నాడు. వేయిపడగలు నవలను మాజీ ప్రధాన మంత్రి పి.వి.నరసింహారావు "సహస్రఫణ్" పేరుతో హిందీ లోకి అనువదించాడు. భారతీయ సంస్కృతి, ఆచారం, విశేషాలు, మధ్య తరగతి జీవన విధానాలు ఈ నవలలో విశేషంగా చూప బడ్డాయి. తమిళనాడులోని మదురై ప్రాంతం నేపథ్యంలో వచ్చిన నవల "ఏకవీర"ను పుట్టపర్తి నారాయణాచార్యులు మళయాళంలోనికి, అంబటిపూటి హనుమయ్య తమిళంలోనికి అనువదించారు.

ఏకవీర సినిమా కూడా వచ్చింది. ఆ సినిమాకు సి.నారాయణరెడ్డి మాటలు, పాటలు సమకూర్చాడు. విశ్వనాథ వ్యక్తిత్వం ప్రాచీన విధానాలకు, ఆచారాలకు కట్టుబడ్డది. భారతీయత మీద, తెలుగుదనం మీద అభిమానం కలిగింది. తన అభిప్రాయాలను, ఇష్టాయిష్టాలను నిక్కచ్చిగా తెలిపేవాడు. ఈ కారణంగా విశ్వనాథను వ్యతిరేకించిన వారు చాలామంది ఉన్నారు. ఛాందసుడు అనీ, "గతకాలమె మేలు వచ్చుకాలము కంటెన్" అనేవాడు అనీ (శ్రీశ్రీ విమర్శ) విమర్శించాడు. విశ్వనాథకు పాశ్చాత్య సాహిత్యం అంటే పడదని అనుకొంటారు. కాని ఆయన పాశ్చాత్య సాహిత్యం పట్ల గౌరవం కలిగి ఉండేవాడు. షేక్స్‌పియర్, మిల్టన్, షెల్లీ వంటి కవుల రచనలను ఆసాంతం పరిశీలించాడు. 1964లో ఆంధ్ర విశ్వ కళాపరిషత్ "కళాప్రపూర్ణ" తో సన్మానించింది. 1942లో గుడివాడ లో "గజారోహణం" సన్మానం జరిగింది. 1956 లో షష్టి పూర్తి వేడుకలు కూడా గుడివాడలో ఘనంగా జరిగాయి. శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం డి.లిట్ పట్టాతో సన్మానించింది. 1962 లో "విశ్వనాథ మధ్యాక్కఱలు" రచనకు కేంద్రసాహిత్య అకాడెమీ వారి బహుమతి లభించింది. 1970 లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం "ఆస్థాన కవి"గా గౌరవించింది. 1970 లో భారత ప్రభుత్వము "పద్మభూషణ పురస్కారం"తో గౌరవించింది. జ్ఞానపీఠ అవార్డు పొందిన తొలి రచయిత. కొన్ని రచనలను రేడియో నాటికలుగా మలిచారు. ఆయన రచనలను ఇతర భాషల్లో కూడా అనువదించారు. విశ్వనాథ చేపట్టని ప్రక్రియ కాని, ప్రయోగం కానీ లేదు. నవల, కథ , నాటిక, పాట, ఏదైనా తగిన పరిష్కారాన్ని అందించే విధంగా ఉండటం స్పష్టంగా కనిపిస్తుంది. ఆయన పద్య రచన అపూర్వం. సంస్కృత నాటకాల్లో గుప్త పాశుపతం, అమృత శర్మిష తెలుగు నాటకాల్లో కనకరాజు, అనార్కలి ప్రసిద్ధమైనవి. ఆయన కొన్ని పత్రికలకు సంపాదకులుగా కూడా పని చేశాడు. కొంతకాలం ఆయన ఆంధ్రప్రదేశ సాహిత్య అకాడమికి ఉపాధ్యక్షుడుగా ఉన్నాడు. విశ్వనాథ రచనల్లో ప్రత్యేకంగా ఆంధ్రపౌరుషము, రామాయణ కల్పవృక్షము, వేయిపడగలు, కిన్నెరసాని పాటలు, పురాణవైర గ్రంథమాల, కాశ్మీర చారిత్రిక నవలలు, విశ్వనాథ మధ్యాక్కఱలు, నన్నయ ప్రసన్నకథాకలితార్థయుక్తి వంటివి. తెలుగు తనమన్నా, తెలుగు భాష అన్నా విశ్వనాథకు ప్రత్యేక అభిమానం. ఆంధ్ర పౌరుషం, ఆంధ్రప్రశస్తి ఆయన మొదటి రచనల లోనివి. విశ్వనాథ రచనలలో అతని పాండిత్యమే కాక, రచనాశిల్పం, పాత్ర చిత్రణ, చారిత్రక అవగాహన అద్భుతంగా కనిపిస్తుంటాయి. ఆయన చేసిన "రామాయణ కల్పవృక్షము" అనే పుస్తక రచనకు గాను జ్ఞాన పీఠ అవార్డు అందు కున్నారు. కోల్‌కతా, ముంబయి ఢిల్లీ, మద్రాసు, బెంగుళూరు వంటి పట్టణాల్లో ఆయన పొందిన సత్కారాలు అపూర్వమైనవి. 1964లోఆంధ్ర విశ్వ కలా పరిషత్ విశ్వనాథను "కళా ప్రపూర్ణ" బిరుదుతో సత్కరించారు. భారత ప్రభుత్వం "పద్మభూషణ్" బిరుదుతో గౌరవించింది. ఇతర ప్రభావాలు, ప్రలోభాలు లేని విశ్వనాథ స్వాతంత్ర్య రచనా శైలిని స్పృశిస్తూ గురువు చెళ్ళపిళ్ళ వేంకటశాస్త్రి తన శిష్యుని గురించి ఇలా అన్నాడు..."నా మార్గమ్మును కాదు, వీని దరయన్ నా తాత ముత్తాతలందే మార్గమ్మును కాదుబీ మార్గమది యింకేదో యనంగా వలెన్ సామాన్యుండన రాదు వీని కవితా సమ్రాట్ వవుత మా హేతువై,యీ మచ్ఛిష్యుని దా వరించినది, నేనెంతే ముదంబందెదన్".

కవిగా పండితునిగా, నవలా రచయితగా, నాటక కర్తగా, విమర్శకుడుగా, గాయకుడిగా రాణించిన విశ్వనాథ 1976 అక్టోబరు 18న తనువు చాలించారు. ఆ అద్భుత ప్రతిభాశాలి నడిచిన సాహితీసేవా మార్గంలో నేటి యువత చిత్తశుద్ధితో అడుగులు వేయాలని ఆశిద్దాం. సూర్యుని కాంతి, చంద్రుని వెన్నెల, కృష్ణమ్మ పరవళ్ళు, గోదారి చల్లదనం ఉన్నంతవరకు తెలుగు సాహిత్య అభిమానుల గుండెల్లో విశ్వనాథ మరియు ఆయన రచనలు చిరస్మరణీయం.

# ఇలాంటిరిజర్వేషన్లుఎక్కడైనా ఉన్నాయా?

మొన్న నియామక పత్రాలు ఇచ్చిన టీచర్ ఉద్యోగ నియామాకాల్లో ఒక జిల్లాలో 6వ ర్యాంక్ వచ్చిన బీసీ– డి అబ్బాయికి స్కూల్ అసిస్టెంట్ సాంఘిక శాస్త్రంలో ఉద్యోగం రాలేదు, కానీ 42వ ర్యాంకు వచ్చిన ఓసీ అబ్బాయికి ఉద్యోగం వచ్చింది. అదే జిల్లాలో 61వ ర్యాంకు వచ్చిన ఎస్సీ అమ్మాయికి జాబ్ రాలేదు, 452 వ ర్యాంకు వచ్చిన ఓసీ అమ్మాయికి జాబ్ వచ్చింది. మరొక జిల్లాలో 70 వ ర్యాంక్ వచ్చిన రవళి బీసీ– బి అమ్మాయికి ఉద్యోగం రాలేదు, 180వ ర్యాంక్ వచ్చిన ఓసి అమ్మాయికి ఉద్యోగం వచ్చింది. ఇంకో జిల్లాలో 70వ ర్యాంక్ వచ్చిన బీసీ– డి అబ్బాయికి జాబ్ రాలేదు, కానీ 385 ర్యాంక్ వచ్చిన ఓసీ అబ్బాయికి జాబ్ వచ్చింది. రాష్ట్రంలోని 33 జిల్లాలోనూ ఇదే పరిస్థితి. ఇవి ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ వల్ల ఎస్సీ, ఎస్టీ, బీసీలకు జరిగిన అన్యాయానికి కొన్నిఉదాహరణలు మాత్రమే..! తెలంగాణ ప్రభుత్వం 11 వేల ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయగా ఈడబ్ల్యూఎస్ 10శాతం రిజర్వేషన్స్ వల్ల బీసీ, ఎస్సీ, ఎస్టీ బిడ్డలకు ముఖ్యంగా బీసీ బిడ్డలకు రావలసిన 11 వందల ఉద్యోగాలు రాకుండా పోయాయి. కొత్త ప్రభుత్వం ఉద్యోగ నియామకాలపై ప్రత్యేక దృష్టి పెట్టి మొత్తం 30,000 ఉద్యోగాలు భర్తీ చేస్తే, ఈడబ్ల్యూఎస్ పది శాతం రిజర్వేషన్ల వల్ల 3000 ఉద్యోగాలు ఎస్సీ, ఎస్టీ, బీసీ బిడ్డలు కోల్పో యారు. అంటే బీసీ బిడ్డల నోటికాడి కూడును అన్యాయంగా ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ పేర అగ్రకులాల పిల్లలకు కట్టబెట్టారు. ఈ నష్టానికి కారకులెవరు? ఈ విధానాన్ని తెచ్చిన పాలకులు దీనిని ఎలా సమర్థించుకుంటారు? ప్రపంచ వ్యాప్తంగా ఇలాంటి రిజర్వేషన్లు ఎక్కడైనా ఉన్నాయా? ఏ దేశ రాజ్యాంగమైన ఇలాంటి విధానాన్ని అనుమతిస్తుందా? ఇది సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధం కాదా?

తరతరాలుగా దోపిడీకి గురైన కులాలకు, సామాజికంగా వివక్షతకు గురి అయిన కులాలకు, విద్యాపరంగా, సామాజికంగా వెనుకబడిన కులాలకు రాజ్యాంగ నిర్మాతలు సామాజిక కోణంలో సహజ న్యాయ సూత్రాలకు అనుగుణంగా ఏర్పాటు చేసిందే రిజర్వేషన్ విధానం. నిజానికి రాజ్యాంగ రచనలోనే బీసీలకు అన్యాయం జరిగింది. ఎస్సీ, ఎస్టీలతో పాటు బీసీలకు రిజర్వేషన్లు ఆనాడే లభించాల్సింది. అంబేద్కర్ ఆ ప్రయత్నం చేసినప్పటికీ అగ్ర కులాలతో నిండిన రాజ్యాంగసభ ఆ ప్రయత్నాలను అడ్డుకుంది. అందుకే రాబోయే ప్రభుత్వాలు ఇతర వెనుకబడిన తరగతుల అభివృద్ధి కోసం తగు చర్యలు తీసుకోవాలని రాజ్యాంగం పేర్కొంది. ఇందుకై 1950 నుంచి బీసీలు పోరాటం చేస్తే కాక కాళేశ్వర్ కమిషన్ వేసి, రిపోర్ట్సను కోల్డ్ స్టోరేజీలో పెట్టారు. జనతా ప్రభుత్వం బీసీల స్థితిగతుల అధ్యాయనానికి మండల కమిషన్‌ను నియమించినప్పటికి రిపోర్టు ఇచ్చే నాటికి ప్రభుత్వం కూలిపోవడంతో ఆ రిపోర్టును అటకెక్కించారు. చివరకు వీపీ సింగ్ ప్రభుత్వం బీసీలకు రిజర్వేషన్లు అమలు చేస్తే.. వీపీ సింగ్ ప్రభుత్వాన్ని కూల్చి వేశారు. ఇలా 40 సంవత్సరాలు పోరాడితే గానీ బీసీలకు రిజర్వేషన్లు రాలేదు. ఆ ఫలాలు ఇప్పుడిప్పుడే అందుకుంటున్న సమయంలో.. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు తీసుకొచ్చింది బీజేపీ ప్రభుత్వం. నాడు బీసీ రిజర్వేషన్లను వ్యతిరేకించిన ఆ పార్టీయే ఏ రకమైన పోరాటం చెయ్యకపోయినా, కమిషన్ రిపోర్టు లేకపోయినా, ఏకపక్షంగా, మెజారిటీ ఉందని, రాజ్యాంగాన్ని సవరించి ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లను తీసుకవచ్చి ఇప్పుడిప్పుడే ఓపెన్ కేటగిరిలో పోటీ పడుతున్న బీసీ బిడ్డల నోట్లో మట్టి కొట్టింది. తాన తందాన అన్నట్లు బీసీ కమిషన్లు సూచించిన విధంగా బీసీ రిజర్వేషన్స్ పెంచమంటే 50 శాతం సీలింగ్ విధించిన న్యాయశాఖ ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్స్ ద్వారా 50 శాతం సీలింగ్ దాటిన రిజర్వేషన్లను సమర్థించడం విస్మయానికి గురిచేసింది. ఈడబ్ల్యూఎస్ అమలుకై విద్యా సంస్థల్లో ప్రత్యేకంగా 10 శాతం సీట్లను పెంచుతామని తద్వారా ఎస్సీ, ఎస్టీ, బీసీలకు నష్టం జరగదని నమ్మబలికిన కేంద్రం ఎన్ని విద్యాసంస్థల్లో 10 శాతం సీట్లు పెంచింది? సూపర్ న్యూమరీ పోస్టులు సృష్టిస్తాం అన్న కేంద్రం ఏ శాఖలో ఎన్ని పోస్టులు సృష్టించింది? ఈడబ్ల్యూఎస్ అమలు చేస్తున్న రాష్ట్రాలు ప్రత్యేక సీట్లు, సూపర్ న్యూమరీ పోస్టులు సృష్టించే అమలు చేస్తున్నాయా? మన రాష్ట్రంలో వైద్య విద్యాసంస్థలో ఏమి జరిగింది? ఆర్థిక ప్రాతిపదికన ఇచ్చినప్పుడు ఈడబ్ల్యూఎస్ ఓసిలతో పాటు ఎస్సీ, ఎస్టీ, బీసీలకు కూడా వర్తింపజేసిన కొంత న్యాయంగా అనిపించేది. అలా కాకుండా ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్ వర్తిస్తే ఈడబ్ల్యూఎస్ వర్తించదని ప్రత్యేక నిబంధన పెట్టి ఓసి పక్షపాతాన్ని చాటుకుంది. ఓసిలకే ఈ డబ్ల్యూ ఎస్ అన్నప్పుడు ఓపెన్ కేటగిరీ 50శాతంలో నుంచే ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు 10 శాతం తీయాలి. కానీ మొత్తం 100%లో 10 శాతం తీయడం అంటే అన్యాయంగా ఎస్సీ, ఎస్టీ, బీసీల పోస్టులని లాగేసుకుని ఓసీలకు ఇచ్చినట్లు కాదా? ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ఒక నిబంధన, అగ్ర వర్ణ కులాలకు ఒక నిబంధననా? ఉపకార వేతనాలు పొందాలంటే ఎస్సీలకు రెండు లక్షల ఆదాయం, ఎస్టీలకు రెండు లక్షల ఆదాయం, బీసీలకు 3 లక్షల ఆదాయం ఉండేట్లు మాత్రమే ఆదాయం సర్టిఫికెట్స్ ఉండాలంటారు. అప్పుడే ఆయా సర్టిఫికెట్లు చెల్లుబాటు అవుతాయంటారు. అగ్రవర్ణ కులాలకు మాత్రం ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్స్ కోసం ఎనిమిది లక్షల ఆదాయం వరకు ఎందుకు అనుమతించారు. ఇది ఏ న్యాయ సూత్రాల ప్రకారం సమంజసం. ఇది ఆర్టికల్ 14కు విరుద్ధం కాదా? ఈ రిజర్వేషన్లను ఉపయోగించుకొని నేటి వరకు ఎంతమందికి ఉద్యోగాలు వచ్చాయో వారందరి ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్లను వెరిఫై చేయాలి. ప్రభుత్వ నియమ నిబంధనల ప్రకారం ఈడబ్ల్యూఎస్ టికెట్లు జారీ చేశారా లేదా? అని నిగ్గు తేల్చాలి. అక్రమంగా సర్టిఫికెట్ పొందిన వారిని ఉద్యోగం నుంచి తొలగించి క్రిమినల్ చర్యలు చేపట్టాలి. ఆ సర్టిఫికెట్ జారీ చేసిన వారిపై కూడా క్రిమినల్ చర్యలు తీసుకోవాలి. నేటి వరకు వారు పొందిన జీతభత్యాలను రికవరీ చేయాలి. ఆయా స్థానాల్లో ఉద్యోగాలు కోల్పోయిన ఎస్సీ, ఎస్టీ, బీసీ యువతకు ఉద్యోగాలు ఇవ్వాలి. బీసీ బిడ్డలకు జరుగుతున్న నష్టాన్ని నివారించాలంటే ఒకటి ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు రద్దు చేయాలి లేదా ఈ రిజర్వేషన్లను 1 శాతానికి తగ్గించాలి. లేదా బీసీ రిజర్వేషన్లను పెంచాలి. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు ఉన్నప్పటికీ బీసీ రిజర్వేషన్లను పెంచడం ద్వారా రిజర్వేషన్ల ద్వారా అన్ని వర్గాల వారికి న్యాయం చేసినట్లు అవుతుంది. అప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల అమలును నిలిపివేసి పాత విధానాన్ని కొనసాగిస్తూ నియామకాలు చేపట్టాలి.

# బైరెడ్డి సిద్ధార్థరెడ్డి...గాయబ్

కర్నూలు, అక్టోబరు 17, వైసీపీ ప్రభుత్వంలో అధికారాన్ని అడ్డం పెట్టుకుని మంత్రులు, నామినేటెడ్ పదవులలో ఉన్న నాయకులు ఇష్టారీతిన వ్యవహరించారు. అలాంటి జాబితాలో మాజీ మంత్రులు ఉన్న కొడాలి నాని, పేర్ని నాని, అంబటి రాంబాబు, రోజా ఇలా చెప్పుకుంటూ వస్తే ఉమ్మడి కర్నూలు జిల్లా కు చెందిన మాజీ శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి తమదైన స్టైల్‌లో నోరు పారేసుకున్నారు. అలాంటి బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అడ్రస్ లేకుండా పోవడం హాట్‌టాపిక్‌గా మారింది. నందికొట్కూరు నియోజకవర్గ యువ నాయకుడు బైరెడ్డి సిద్ధార్థరెడ్డి కనపడుట లేదని అని నెటిజెన్లు పోస్టులు పెడుతున్నా అతని అడ్రస్ దొరకడం లేదంట.బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి తెలుగు రాష్ట్రాల్లో పెద్దగా పరిచయం అక్కర్లేని పేరు. సోషల్ మీడియాలో నిత్యం యాక్టివ్ గా ఉంటూ యువతను సైతం తన ప్రసంగాలు, పోస్టులతో యూత్‌తో మంచి ఫాలోయింగ్ సంపాదించుకున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో బైరెడ్డి కుటుంబానికి మంచి రాజకీయ నేపథ్యముంది. బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి తాత బైరెడ్డి శేషసేనారెడ్డి మాజీ మంత్రిగా నందికొట్కూరు నియోజకవర్గంలో బైరెడ్డి బ్రాండ్‌ను అప్పట్లోనే క్రియేట్ చేశారు? తండ్రి జాడలోనే ముగ్గురు సంతానంలో ఒకరైన బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి టీడీపీలో ఫైర్‌బ్రాండ్‌గా ఫోకస్ అయ్యారు. ప్రత్యేక రాయలసీమ నినాదంతో కొంత కాలం హడావుడి చేసిన బైరెడ్డి రాజశేఖర్ తిరిగి టీడీపీలో చేరి తన కుమార్తెను ఎంపీగా గెలిపించుకుని మళ్లీ లైమ్‌లైట్‌లోకి వచ్చారు.తన పెద్ద నాన్న బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డితో తిరిగి రాజకీయం నేర్చుకున్న బైరెడ్డి సిద్ధార్థరెడ్డి.. తర్వాత ఆయన్ని చులకన చేస్తూ మాట్లాడి వైసీపీలో చేరి బైరెడ్డి ఫ్యామిలీలో మరో యూత్ లీడర్ అనిపించుకున్నారు. 2019 ఎన్నికల్లో వైసీపీ పార్టీ నుంచి ఆర్థర్ ఎమ్మెల్యే గా గెలిచారు. ఆ ఎన్నికల్లో ప్రచారానికి వచ్చిన జగన్ బైరెడ్డిని గుండెల్లో పెట్టుకుని చూసుకుంటానని చేసిన వ్యాఖ్యలతో ఒక్క సారిగా అతనికి హైప్ వచ్చింది. ఇక అప్పటి నుంచి సోషల్ మీడియాలో ప్రత్యర్థులను టార్గెట్ చేస్తూ ఫాలోయర్స్‌ను పెంచుకున్నారు. అలాగే నందికొట్కూరులో ఆర్థర్ ఎమ్మెల్యేగా ఉన్నా తానే ఎమ్మెల్యే అయినట్లు పెత్తనం చేశారు.నందికొట్కూరు నియోజకవర్గం ప్రస్తుతం ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గ కావడంతో నందికొట్కూరు నుంచి పోటీ చేయడానికి వీలు లేక ఈసారి ఎలాగైనా తాను ఎమ్మెల్యేగా లేదా ఎంపీగా నైనా పోటీ చేయాలని సిద్ధార్థ కలలు కన్నారు. అయితే ఆయన్ని గుండెల్లో పెట్టుకుని చూసుకుంటానన్న జగన్ టికెట్ కూడా ఇవ్వలేదు. దాంతో నిరాశ చెందిన జూనియర్ బైరెడ్డి నందికొట్కూరు సెగ్మెంట్‌లోనే రాజకీయం చేశారు. సిట్టింగ్ ఎమ్మెల్యే ఆర్థర్ తన మాట వినడం లేదని.. ఆయనకు టికెట్ రాకుండా చేసి తన అనుచరుడైన ధారా సుధీర్‌కు టికెట్ ఇప్పించుకున్నారు. తీరా చూస్తే అటు ఆర్థర్, ఇటు సుధీర్ ఇద్దరికి పొలిటికల్ సినిమా కనపడింది. ఇక అప్పటి నుంచి ఆ సోషల్ మీడియా పులి కనిపించకుండా పోయింది.ఎన్నికల ఫలితాల తర్వాత సిద్ధార్థరెడ్డి నియోజకవర్గంలో ఎక్కడా కనిపించలేదు. మాజీ మంత్రి రోజాతో కలిసి ఆయన శాప్ చైర్మన్‌గా క్రీడా నిధులు పెద్ద ఎత్తున్న దుర్వినియోగం చేసారన్న ఆరోపణలు ఉన్నాయి. దానిపై రేపోమాపో ఆ ఇద్దరిపై కేసు నమోదు చేస్తారంటున్నారు. ఆ భయంతోనే సిద్దార్థ హైదరాబాద్‌కు మకాం మార్చేసారంట. పార్టీ అధికారంలో ఉన్నప్పుడు సిద్ధార్థ రెడ్డి ఏ కార్యక్రమానికి వెళ్లినా అ ఫోటోలు దిగడం కోసం కుర్ర కారు ఎగబడే వారు. సోషల్ మీడియాలో అంత క్రేజ్ ఉంది ఆయనకి.. అయితే పార్టీ ఓటమి తర్వాత ఆయన సోషల్ మీడియాలో కూడా యాక్టివ్‌గా కనిపించకపోవడం చర్చనీయాంశంగా మారింది.బైరెడ్డి సిద్ధార్థ రెడ్డికి సోషల్‌మీడియాలో ఉన్న క్రేజ్ చూసే జగన్ అంత ప్రాధాన్యత ఇచ్చారంటారు.. అది చూసుకుని ఆయన తన పెదనాన్న బైరెడ్డి రాజశేఖరరెడ్డిని చిన్న చూపు చూస్తూ.. వయసైపోయిన ఎక్స్‌పైర్ నేతని విమర్శలు గుప్పించేవారు. ఇప్పుడు చూస్తే సీన్ పూర్తిగా రివర్స్ అయింది. గత అయిదేళ్లు అంత చెలరేగిపోయిన సిద్దార్థ పొలిటికల్ సీన్ మీద నుంచి మాయమయ్యారు. అయన ఎక్స్‌పైర్ అయిపోయారని విమర్శించిన బైరెడ్డి రాజశేఖరరెడ్డి తిరిగి ఫామ్‌లోకి వచ్చేశారు. ఆయన కుమార్తె శబరి నంద్యాల ఎంపీగా ఘనవిజయం సాధిస్తే.. ఆయన నందికొట్కూరు సహా జిల్లా రాజకీయాల్లో చక్రం తిప్పుతూ యాక్టివ్ అవుతున్నారు. బళ్లు ఓడలు.. ఓడలు బళ్లు అవ్వడం అంటే ఇదేనేమో

# కయ్యానికి కాలుదువ్వుతున్న కెనడా

కెనడా ప్రధాని ఓవరాక్షన్ రాను రానూ మితిమీరుతోంది. భారత్‌తో కయ్యం కోసం కాచుక్కుచ్చున్నట్లు కనిపిస్తుంది. తమ దేశానికి వలసొచ్చిన తీవ్రవాది కోసం దేశ భవిష్యత్తునే పణంగా పెడుతున్నాడు. కెనడాలోని సిక్కుల ఓట్ల కోసం సిగ్గు లేకుండా భారత్‌తో దౌత్య సంబంధాలను దెబ్బతీస్తున్నాడు. తమ దేశంలో జరిగిన ఓ తీవ్రవాది హత్యకు ఇటీవల భారత్‌ను నిందించిన ట్రూడో.. ఇప్పుడు, భారత్‌లో జరిగిన హత్యకు కారణమైన బిష్ణోయ్ ముఠాతో కలిసి భారత్ ఏజెంట్లు పనిచేస్తున్నాయని ఆరోపించాడు. ఈ ముఠాతో కెనడాలో హత్యలు చేయిస్తున్నారంటూ నోరు పారేసుకున్నాడు. ఏ దేశమైనా మరో దేశ అంతర్గత వ్యవహారాల్లో తలదూర్చాలంటే ఒక అంతర్జాతీయ కారణం ఉండాలి. లేదంటే, అది తమ దేశంపై ఏదైనా ప్రభావం చూపుతుండాలి. అదీకాదూ అంటే, మానవహక్కుల ఉల్లంఘన వంటి వ్యవహారాల్లో కలుగుజేసుకోవచ్చు.. ఓ సలహా ఇవ్వొచ్చు, అభిప్రాయం వ్యక్తీకరించొచ్చు. అలాకాదని, కేవలం వారి రాజకీయ లాభాల కోసం మరో దేశంపై బురద చల్లాలనుకోవడం అవివేకమే అవుతుంది. కెనడా ప్రధానమంత్రి జస్టిన్ ట్రూడో ఇదే చేస్తున్నాడు. అమెరికా, చైనాలు సైతం భారత్ విషయంలో చాలా జాగ్రత్తగా వ్యవహరిస్తుంటారు. అలాంటిది కెనడా లాంటి కంట్రీలకు అంత తలపొగరు ఉండటం కాస్త ఆశ్చర్యం కలుగజేస్తుంది. అయినా, కెనడా కయ్యం కావలి అనేటట్లే వ్యవహరిస్తోంది. భారత ప్రభుత్వంపై కెనడా తాజాగా మరోసారి ఆరోపణలు చేసింది. కెనడా గడ్డపై జరుగుతున్న తీవ్రమైన నేరపూరిత చర్యల్లో భారత్‌కు ప్రత్యక్ష ప్రమేయం ఉందని ఆరోపించింది. అయితే, కెనడా అధికారులు, తాము చేసిన ఆరోపణలకు సంబంధించి ఎలాంటి సాక్ష్యాలను చూపించలేదు. కెనడాలో ఖలిస్థాన్ అనుకూల అంశాలను లక్ష్యంగా చేసుకోవడానికి, లారెన్స్ బిష్ణోయ్ ముఠాతో కలిసి భారత్ ఏజెంట్లు పనిచేస్తున్నారని కెనడా ఆరోపించింది.యాదృచ్ఛికంగా.. అక్టోబర్ 12న ముంబైలో జరిగిన ఎన్సీపీ నేత బాబా సిద్ధిక్ హత్యలో లారెన్స్ బిష్ణోయ్‌కు ప్రమేయం ఉన్నట్లు ఆరోపణలు ఉన్న సమయంలో.. కెనడా వ్యాఖ్యలు ఇరు దేశాల మధ్య గ్యాప్ మరింత పెరగడానికి కారణం అయ్యాయి. అక్టోబర్ 14 అర్ధరాత్రి ప్రెస్‌తో మాట్లాడిన రాయల్ కెనడియన్ మౌంటెడ్ పోలీస్ అధికారులు భారత్‌ను నిందిస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు. గత ఏడాది కెనడాలో హత్యకు గురైన ఖలిస్తానీ ఉగ్రవాది హర్దీప్ సింగ్ నిజ్జార్ హత్యకు సంబంధించిన దర్యాప్తు వివరాలను ఈ ప్రెస్‌మీట్‌లో పంచుకున్నారు. దీనితో, పాటు ఇతర సంబంధిత కేసుల్లోనూ భారత ఏజెంట్లు ప్రమేయం ఉందని వెల్లడించారు. కెనడాలో హత్యలు, హింసాత్మక చర్యలకు భారత ప్రభుత్వం హస్తం ఉందని అన్నారు. నిజ్జర్ హత్యలో అనుమానితుల జాబితాలో కెనడాలోని భారత్ హైకమిషనర్ సంజయ్ వర్మ, ఇతర దౌత్యవేత్తల పేర్లను చేర్చారు. అలాగే, కెనడాతో పాటు విదేశాల్లోని పలు సంస్థలను భారత ప్రభుత్వ ఏజెంట్లు సమాచార సేకరణకు ఉపయోగించుకుంటున్నారని కెనడా ఆరోపించింది. కొందరు వ్యక్తులు, సంస్థలను భారత ప్రభుత్వంతో కలిసి పని చేయమని ఒత్తిడి చేసి, బెదిరిస్తున్నారనీ.. ఇక, సేకరించిన సమాచారం ఆధారంగా కెనడాలోని సౌత్ ఏషియా కమ్యూనిటీ సభ్యులను లక్ష్యంగా చేసుకోవడానికి భారత ప్రభుత్వం ఉపయోగించుకుంటుందని రాయల్ కెనడియన్ మౌంటెడ్ పోలీస్ ప్రకటించింది. 2022 జూన్ నెలలో, సింగర్ సిద్ధూ మూస్ వాలా హత్య తర్వాత పంజాబ్‌లో హింసాత్మక నేరాలకు పాల్పడుతున్న గ్యాంగ్‌స్టర్ల ప్రమేయంపై కెనడాను భారత హైకమిషన్ అప్రమత్తం చేసింది. మూస్ వాలా హత్యకు లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ బాధ్యత వహించగా? ఉత్తర భారతదేశంలో క్రైమ్ చేస్తున్న బిష్ణోయ్ ముఠా, ప్రధానంగా కెనడాలో దాని ఉనికికి సంబంధించి భారత్ కెనడాను అప్రమత్తం చేసింది. ఈ నేపథ్యంలో.. తాజా ప్రెస్‌మీట్‌లో దీనిపై ప్రశ్నోత్తరాలు నడిచాయి. సిక్కు సంఘంలోని సభ్యులను భారతీయ ఏజెంట్లు లక్ష్యంగా చేసుకుంటున్నారా అని కెనడా పోలీస్ అధికారులను జర్నలిస్ట్‌లు అడిగారు. దీనికి, రాయల్ కెనడియన్ మౌంటెడ్ పోలీస్ అసిస్టెంట్ కమిషనర్ బ్రిగిట్టే గౌవిన్ మాట్లాడుతూ, దక్షిణాసియా సమాజాన్ని ఈ భారత్ ఏజెంట్లు లక్ష్యంగా చేసుకుంటున్నాయని.. ప్రత్యేకంగా కెనడాలోని ఖలిస్తానీ అనుకూల అంశాలను లక్ష్యంగా చేసుకుంటున్నారని వ్యాఖ్యానించారు. వ్యవస్థీకృత నేరాలు చేస్తున్న బిష్ణోయ్ గ్రూప్‌కు భారత ప్రభుత్వ ఏజెంట్లతో లింక్ ఉందని మేము నమ్ముతున్నామంటూ గౌవిన్ వెల్లడించారు. కెనడాలో అతిపెద్ద తీవ్రవాద దాడికి కారణమైన ఖలిస్తానీ ఉగ్రవాదులకు కెనడా ప్రభుత్వం ఆశ్రయం కల్పిస్తోందని భారత్ కూడా ఆరోపిస్తోంది. 1985లో ఎయిర్ ఇండియా ఫ్లైట్-182పై బాంబు దాడిలో 329 మంది మరణించారు. అప్పటి నుండీ భారతదేశాన్ని నిందించడానికి, కెనడాలో భారత్ ప్రతిష్టకు భగం కలిగించడానికి ఖలిస్తానీలు పదేపదే ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు. సిక్కు వేర్పాటు వాదులైన ఖలిస్థానీ తీవ్రవాదులు చేసే వ్యవస్థీకృత నేరాలతో సంబంధాలున్న వ్యక్తులకు కెనడా రక్షణ కల్పించడపై భారత్ దశాబ్దాలుగా ఆందోళన వ్యక్తం చేస్తోంది. ఈ క్రమంలోనే, ఈ ఏడాది మేలో భారత విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్.. నిజ్జర్ హత్యతో సంబంధం ఉన్న ముగ్గురు భారతీయులను అరెస్టు చేసిన తర్వాత కెనడా ఇమ్మిగ్రేషన్ విధానాన్ని విమర్శించారు. పంజాబ్ నుండి వ్యవస్థీకృత నేరాలతో లింక్‌లు ఉన్న చాలా మంది ఖలిస్థానీ తీవ్రవాదులను కెనడా స్వాగతిస్తుందనీ ఆరోపించారు. వీళ్లు భారతదేశంలో వాంటెడ్ క్రిమినల్స్ అనీ.. మీరు వారికి వీసాలు ఇచ్చారని కెనడా ప్రభుత్వాన్ని విమర్శించారు. కాగా, మహారాష్ట్ర మాజీ మంత్రి బాబా సిద్ధిక్ హత్య జరిగిన రెండు రోజులకే బిష్ణోయ్ ముఠా సభ్యులతో భారతీయ ఏజెంట్లు కుమ్మక్కయ్యారని కెనడా ఆరోపించింది.ఇక, రాయల్ కెనడియన్ మౌంటెడ్ పోలీస్ వ్యాఖ్యల తర్వాత, కెనడా ప్రధాన మంత్రి జస్టిన్ ట్రూడో మీడియాను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ కేసుపై భారత ప్రభుత్వంతో కలిసి పనిచేయడానికి ఎన్నిసార్లు అభ్యర్థించినప్పటికీ భారత్ సహకరించట్లేదని పేర్కొన్నారు. అయితే, ఎలాంటి ఆధారాలు చూపకుండా నిరాధార ఆరోపణలు చేసినందుకు భారత ప్రభుత్వం కెనడాపై తీవ్రంగా మండిపడుతోంది. అక్టోబర్ 14న భారత హైకమిషనర్‌పై కెనడా అధికారులు ఆరోపణలు చేసిన తర్వాత, భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ ఘాటైన ప్రకటనను విడుదల చేసింది. కెనడా ప్రధాని ట్రూడో ఓటు బ్యాంక్ రాజకీయాలు చేస్తున్నట్లు పేర్కొంది. దీనికి నిరసనగా, ఆరుగురు కెనడియన్ దౌత్యవేత్తలను బహిష్కరించాలని భారత ప్రభుత్వం నిర్ణయించింది. అలాగే, కెనడాలోని తమ హైకమిషనర్ సంజయ్ వర్మతో పాటు, మరికొందరు దౌత్యవేత్తలను కాల్ బ్యాక్ చేస్తున్నట్లు భారత్ ప్రకటించింది. అయితే, భారత్ ఈ ప్రకటన చేసిన కొన్ని గంటల తర్వాత కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో స్పందించారు. ఆరుగురు భారత దౌత్యవేత్తలను తామే బహిష్కరించామని ఆయన చెప్పారు. నిజ్జర్ హత్య కేసులో భారత ప్రభుత్వం సహకరించకపోవడమే ఇందుకు కారణమని ట్రూడో అన్నారు.

# తుఫాన్ భయం...భయం..

నెల్లూరు, అక్టోబరు 17,తుపాను హెచ్చరికలతో అధికారులు అప్రమత్తమయ్యారు. ముఖ్యంగా నెల్లూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లాలకు ఈ తుపాను కారణంగా బాగా ఎఫెక్ట్ అవుతుందని వాతావరణ శాఖ తెలిపింది. బలమైన ఈదురుగాలులతో పాటు భారీ వర్షాలు.. అంటే కుండపోత వర్షాలు కురిసే అవకాశముందని తెలిపింది. పదిహేను రోజుల్లో కురవాల్సిన వర్షం ఒక్క గంటలో కురిసే అవకాశముందని తెలిపింది. దీంతో అధికారులు అప్రమత్తమయ్యారు. నెల్లూరు - చెన్నై మధ్య తుపాను తీరం దాటనుండటంతో బలమైన ఈదురుగాలులతో పాటు భారీ వర్షం కురుస్తుందని తెలపడంతో అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నారు.ముఖ్యంగా తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు ముందస్తు చర్యలు ప్రారంభించారు. శ్రీవారి మెట్లను ఈరోజు రాత్రి నుంచి మూసివేస్తున్నారు. నడక మార్గం నుంచి భక్తులు ఎవరూ ఈరోజు రాత్రి నుంచి భక్తులు ఎవరూ రాకుండా నిషేధం విధించారు. అలాగే శిలాతోరణం, పాపవినాశనం వంటి ప్రాంతాల్లో కూడా ఎవరినీ అనుమతించడం లేదు. వాటిని మూసివేస్తూ తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు నిర్ణయం తీసుకున్నారు. భారీ వర్షాలకు భక్తులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు టీటీడీ ఈవో శ్యామల రావు ప్రకటించారు. తిరుమలకు వచ్చే భక్తులు అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా ఘాట్ రోడ్డులో కొండచరియలు విరిగిపడే అవకాశముందని వాటినుంచి భక్తులు తమకు తామే కాపాడుకోవాలని ఆయన కోరారు.నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య జిల్లాలకు రెడ్ అలెర్ట్‌ను అధికారులు ప్రకటించారు. అధికారులు ఈరోజు రాత్రి గడిస్తే చాలు అన్న భయం గుప్పిట్లో బతుకుతున్నారు. ఈరోజు తెల్లవారు జామున తీరం దాటే అవకాశాలున్నాయని వాతావరణ శాఖ చెబుతున్నారు.

కొన్ని రైళ్లను రద్దు చేశారు. ఆర్టీసీ బస్సులను కూడా కొన్ని ప్రాంతాలకు వెళ్లకుండా నిలిపివేశారు. వాగులు, వంకల్లో దాటాల్సిన ప్రాంతాలకు బస్సులను పంపడం లేదని ఆర్టీసీ అధికారులు తెలిపారు. ఇక లోతట్టు ప్రాంత ప్రజలు ఈ రాత్రికి అప్రమత్తంగా ఉండాలని మైకుల్లో హెచ్చరికలు జారీ చేస్తున్నారు. అదే సమయంలో తీర ప్రాంత ప్రజలను ఇప్పటికే పునరావాస కేంద్రాలకు తరలించారు.

# ఇక గాంధీలో ఐవీఎఫ్ సేవలు ఉచితం

హైద్రాబాద్, అక్టోబరు 17,తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ దవాఖానలో తొలిసారి ఐవీఎఫ్ (ఇన్విట్రో ఫెర్టిలైజేషన్) సేవలు అందుబాటులోకి వచ్చాయి. గాంధీ హాస్పిటల్ ఎంసీహెచ్ బిల్డింగ్‌లోని ఐదో ఫ్లోర్‌లో ఉన్న ఫెర్టిలిటీ సెంటర్‌లో ఈ సేవలు ప్రారంభం అయ్యాయి. ఈ కృత్రిమ గర్భధారణ సేవలను వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, మంత్రి పొన్నం ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు. ఐవీఎఫ్ చేసే విధానాన్ని మంత్రులకు డాక్టర్లు వివరించారు. అనంతరం గాంధీ మెడికల్ కాలేజీ విద్యార్థుల కోసం కొత్త హాస్టల్ బిల్డింగుల నిర్మాణానికి మంత్రులు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ.. సంతానలేమి సమస్య వల్ల ఎంతో మంది దంపతులు ఇబ్బంది పడుతున్నారని, అలాంటి వారికి గాంధీలో పూర్తి ఉచితంగా ఐవీఎఫ్ సేవలు అందిస్తామని చెప్పారు. గత ప్రభుత్వం పేపర్ల మీద ఫెర్టిలిటీ సెంటర్లను ప్రకటించిందని.. కానీ ఆచరణలో మాత్రం పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని తెలిపారు. ఐవీఎఫ్ సేవలను అందుబాటులోకి తీసుకొస్తామని 2017లో చెప్పి, 2023లో అధికారం కోల్పోయేవరకు కూడా అందుబాటులోకి తీసుకు రాలేదని మంత్రి గుర్తు చేశారు.ఈ విషయంలో తమ ప్రభుత్వం కమిట్‌మెంట్‌తో ఉందని.. అందుకే ప్రకటించిన నెల రోజుల్లోనే ఐవీఎఫ్ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చామని తెలిపారు. ఎంబ్రియాలజిస్ట్ సహా అవసరమైన స్టాఫ్‌ను నియమించామని, ఎక్విప్‌మెంట్, రీఏజెంట్స్, మెడిసిన్ కొనుగోలు కోసం నిధులు కేటాయించామని చెప్పారు. ఆధునిక జీవన విధానంతో ఎంతో మంది ఇన్‌ఫెర్టిలిటీ సమస్య బారిన పడుతున్నారని, చికిత్స కోసం ప్రైవేటు హాస్పిటళ్లకు వెళ్లి లక్షలు ఖర్చు చేసుకుంటున్నారని మంత్రి తెలిపారు. మానసికంగా, శారీరకంగా, ఆర్థికంగా ఎంతో ఇబ్బంది పడుతున్నారని అన్నారు. ఈ నేపథ్యంలో ఒక్క గాంధీకే ఫెర్టిలిటీ సేవలను పరిమితం చేయకుండా, రాష్ట్రవ్యాప్తంగా విస్తరించాలని నిర్ణయించామని తెలిపారు. మరో 15 రోజుల్లోనే పేట్లబుర్జు దవాఖానలో ఐవీఎఫ్ సేవలను అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. వరంగల్, నిజామాబాద్, కరీంనగర్, ఖమ్మం వంటి ఉమ్మడి జిల్లా కేంద్రాల్లోనూ ఫెర్టిలిటీ సెంటర్లను, ఐవీఎఫ్ సేవలను విస్తరిస్తామని చెప్పారు. లక్షలు ఖర్చయ్యే చికిత్సను, పూర్తిగా ఉచితంగా అందజేస్తామన్నారు. ఐవీఎఫ్‌ను ఆరోగ్య శ్రీ కింద చేర్చామని ప్రకటించారు. తద్వారా మెడిసిన్స్ ను కూడా ఉచితంగా అందజేస్తామని మంత్రి అన్నారు.గాంధీ మెడికల్ కాలేజీలో చదువుతున్న అమ్మాయిల హాస్టల్ కోసం 7 అంతస్తుల బిల్డింగ్, బాయ్స్ హాస్టల్ కోసం 3 అంతస్తుల బిల్డింగ్, సీనియర్ రెసిడెంట్స్ హాస్టల్ కోసం 6 ఫ్లోర్ల బిల్డింగ్ నిర్మిస్తున్నామని మంత్రి దామోదర తెలిపారు. ఇందుకోసం రూ.80 కోట్లు కేటాయించామని చెప్పారు. ఇప్పటికే సుమారు రూ.120 కోట్లతో ఉస్మానియా మెడికల్ కాలేజీలో హాస్టల్ బిల్డింగ్స్ నిర్మిస్తున్నామని మంత్రి గుర్తు చేశారు. హాస్టల్ బిల్డింగుల సమస్యను జూనియర్ డాక్టర్లు తమ దృష్టికి తీసుకొచ్చారని.. వారు తెలిపిన రెండ్రోజుల్లోనే సుమారు రూ.200 కోట్లు కేటాయించామని ఆనందం వ్యక్తం చేశారు.. పది సంవత్సరాల నుంచి ఉస్మానియా హాస్పిటల్ పెండింగ్ లో ఉందని..పెండింగ్ లో ఉన్న కొత్త బిల్డింగ్‌కు కూడా త్వరలోనే శంకుస్థాపన చేస్తామని వెల్లడించారు.

రోడ్డు యాక్సిడెంట్లు, ఇతర ఎమర్జెన్సీ ఘటనల్లో బాధితుల ప్రాణాలు కాపాడేందుకు 74 ట్రామాకేర్ సెంటర్లను ఏర్పాటు చేయబోతున్నామని తెలిపారు. గోషామహల్‌లో సుమారు 32 ఎకరాల విస్తీర్ణంలో కొత్త హాస్పిటల్‌ను ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని చెప్పారు. క్యాన్సర్ పేషెంట్లను ఆదుకోవడానికి 6 రీజినల్ క్యాన్సర్ సెంటర్లను ఏర్పాటు చేయబోతున్నట్టు మంత్రి వెల్లడించారు.

# భారత్ అమ్ములపొదిలోకి... ప్రిడేటర్ డ్రోన్లు

న్యూఢిల్లీ, అక్టోబరు 17, (న్యూస్ పల్స్)ప్రిడేటర్ డ్రోన్లు చాలా సామర్థ్యం కలిగినవి. అటు ఇంటెలిజెన్స్ సమాచార సేకరణతో పాటు ఈ ప్రెడేటర్ డ్రోన్లు శత్రువును గుర్తించి దాడి చేయగలవు. వాస్తవానికి యుద్ధ భూమిలో సమాచారం ప్రాణవాయువు లాంటిది. కచ్చితమైన టార్గెట్ ను ఎంచుకుని దాడి చేయడానికి సహకరించడంతోపాటు.. ఆయుధాల వృథాను అరికడుతాయి. తాజాగా కొనుగోలు చేసిన ప్రిడేటర్లు దేశ సరిహద్దుల్లో భారత్‌కు ఆధిపత్యాన్ని అందించనున్నాయి. సముద్ర తీరాల్లోనే కాదు.. హిమాలయ శిఖరాల్లో మన సైన్యానికి కొత్త బలాన్ని తీసుకురానున్నాయి. ఇప్పటికే చైనా వద్ద చియాహాంగ్-4, వింగ్‌లంగ్-2.. దాయాది దేశం పాకిస్థాన్ వద్ద షహపర్-2, వింగ్‌లంగ్-2, బైరక్తర్ టీబీ2 వంటి డ్రోన్‌లు ఉన్నాయి. భారత్ వద్ద ఇప్పటి వరకు ఈ స్థాయి యూఏవీలులేవు. కానీ, ప్రస్తుత ప్రెడేటర్ల రాకతో, వద్ద పరిస్థితి మారుతుంది. ఈ డ్రోన్‌లకు అనేక ప్రత్యేక సామర్థ్యాలు ఉన్నాయి. ముఖ్యంగా చైనాతో వాస్తవ నియంత్రణ రేఖ వెంబడి, పాకిస్థాన్‌తో నియంత్రణ రేఖ వెంబడి కదలికలను వారు స్పష్టంగా గుర్తించగలుగుతాయి. ఈ ప్రెడేటర్లు శత్రువుల బంకర్లు, రాకెట్లు, క్షిపణి వ్యవస్థలను పసిగడతాయి. వీటి సాయంతో అత్యవసర సమయాల్లో ప్రత్యర్థులపై కూడా దాడి చేసి పట్టుకోగలుగుతాయి. భారత్ ఇప్పటికే ఈ రెండు స్కైగార్డియన్ డ్రోన్‌లను అమెరికాలోని జనరల్ అటామిక్స్ నుంచి లీజుకు తీసుకుంది. చైనా ఉగ్రవాద కార్యకలాపాలకు పాల్పడినప్పుడు తూర్పు లడఖ్‌లో వీటిని మోహరించారు. ఎల్ఏసీ వెంట ఉన్న ఈ మానవరహిత వైమానిక వాహనాలు దళాలకు చాలా స్పష్టమైన చిత్రాలను అందించాయి.ఇటీవల హంటర్ కిల్లర్ గా పిలిచే ఎంక్యూ 9 బీ డ్రోన్ కొనుగోలుకు ప్రభుత్వం తుది ఆమోదం తెలిపింది. భారత సైనిక శక్తిని పెంచే లక్ష్యంతో భద్రతా వ్యవహారాలకు సంబంధించిన క్యాబినెట్ కమిటీ సీసీఎస్ ఈ ఆమోదం తెలిపింది. ఇందులో అమెరికా నుంచి 31 ప్రిడేటర్ లాంగ్ ఎండ్యూరెన్స్ డ్రోన్‌ల కొనుగోలు, అణుశక్తితో నడిచే రెండు జలాంతర్గాముల స్వదేశీ నిర్మాణానికి సంబంధించిన డీల్‌కు బుధవారం గ్రీన్ సిగ్నల్ లభించింది. ఎంక్యూ 9 బీ 'హంటర్ కిల్లర్' డ్రోన్‌లను అమెరికా జనరల్ అటామిక్స్ నుండి ఫారిన్ మిలిటరీ సేల్స్ ఛానెల్ కింద సుమారు 3.1 బిలియన్ అమెరికన్ డాలర్ల వ్యయంతో కొనుగోలు చేస్తారు. దాదాపు రూ.40,000 కోట్లతో అణుశక్తితో నడిచే రెండు జలాంతర్గాములను నిర్మించనున్నట్లు అధికారులు తెలిపారు. ప్రధాని మోదీ నేతృత్వంలోని సీసీఎస్ రెండు ప్రధాన సేకరణ ప్రాజెక్టులకు ఆమోదం తెలిపింది.ఈ రక్షణ ఒప్పందం అర్థం ఏమిటో మనం అర్థం చేసుకుందాం.. ఎందుకంటే ఇటీవల, తన అమెరికా పర్యటనలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అమెరికా అధ్యక్షుడు జో బిడెన్‌తో తన సమావేశంలో కూడా ఈ ఒప్పందాన్ని చర్చించారు. ఇదే ఎంక్యూ 9 బీ కిల్లర్ డ్రోన్, దీని ఒప్పందం చాలా కాలంగా చర్చించబడింది. త్వరలోనే ఈ ఒప్పందం తుది రూపుదిద్దుకోవచ్చని మోదీ అమెరికా పర్యటనలో వెల్లడైంది. చివరికి అదే జరిగింది.ఎంక్యూ 9 బీ ప్రిడేటర్ డ్రోన్ అనేది సుదూర శ్రేణి డ్రోన్, ఇది అధిక ఎత్తులో నిరంతర నిఘా సామర్థ్యం కలిగి ఉంటుంది. ఈ కిల్లర్ డ్రోన్ లలో సీ గార్డియన్, స్కై గార్డియన్ రెండు ప్రధాన రకాలు. ఎంక్యూ 9 బీ ప్రిడేటర్ డ్రోన్‌లు హై ఆల్టిట్యూడ్ లాంగ్ ఎండ్యూరెన్స్ (ఊంఒఇ) విభాగంలోకి వస్తాయి. ఈ డ్రోన్‌లు అత్యాధునిక నిఘా పరికరాలతో గగనతలంలో ఎక్కువసేపు గడపగలవు. ప్రిడేటర్ డ్రోన్లు 50,000 అడుగుల ఎత్తులో 35 గంటల పాటు నిరంతరంగా ఎగురుతాయి. ఇది గంటకు 442 కిలోమీటర్ల గరిష్ట వేగంతో ప్రయాణిస్తుంది. వీటి పేలోడ్ కెపాసిటీ 1,700 కిలోలు. 450 కిలోల బరువున్న బాంబులను మోసుకెళ్లగలదు. వేరియంట్‌లను బట్టి ఈ డ్రోన్‌లలో స్వల్ప మార్పులు ఉన్నాయి. ఎంక్యూ 9 బీ ప్రిడేటర్ డ్రోన్లు చాలా దూరం నుండి లక్ష్యాలను ఛేదించగల సామర్థ్యాన్ని కలిగి ఉంటాయి. ఇవి 1850 కిలోమీటర్ల దూరంలో ఉన్న శత్రువులను లక్ష్యంగా చేసుకోగలిగేంత శక్తివంతమైనవి. భారతదేశం ఈ డ్రోన్‌లను కలిగి ఉండటంతో, పాకిస్తాన్‌లోని అనేక నగరాలను పర్యవేక్షించవచ్చు. ఇదొక్కటే కాదు. వాటికి చైనాపై కూడా కన్నేసి ఉంచొచ్చు. ఈ డ్రోన్‌లలో అనేక రకాల క్షిపణులు అమర్చబడి ఉంటాయి, ఇవి ట్యాంకులు, నౌకలు లేదా భూమిపై ఉన్న దేనినైనా నాశనం చేయగలవు. ఈ డ్రోన్‌ను అమెరికాకు చెందిన ప్రముఖ రక్షణ పరికరాల కంపెనీ 'జనరల్ అటామిక్స్' తయారు చేసింది.

# యువతి అత్యాచారాన్ని ఛేధించిన గచ్చిబౌలి పోలీసులు

హైదరాబాద్ గచ్చిబౌలి పోలీసులు యువతి అత్యాచారం కేసులో నిందితుడిని అరెస్టు చేసారు. ఘటన జరిగిన రోజు తెల్లవారుజామున రెండు గంటల 15 నిమిషాల ప్రాంతంలో బాధితురాలిని నిందితుడు ఆటోలో ఎక్కించుకొని గచ్చిబౌలికి తీసుకెళ్తూ మార్గమధ్యలో అత్యాచారానికి పాల్పడ్డాడు. అదే సమయంలో రాపిడో వ్యక్తి ద్వారా బాధితురాలు పోలీసులకు సమాచారం ఇవ్వగా ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేశారు.

వివిధ బృందాలుగా ఏర్పడి సీసీ కెమెరాలు ప్రత్యక్ష సాక్షుల ఆధారంగా నేరస్థున్ని అదుపులోకి తీసుకున్నారు. జంగం ప్రవీణ్ అనే వ్యక్తిని ఆల్విన్ కాలనీలో అదుపులోకి తీసుకున్నారు.

# రెంట్ ఏ బాయ్...ఆర్ గాళ్...

న్యూఢిల్లీ, అక్టోబరు 17, (న్యూస్ పల్స్) ఎన్నో సంస్కృతులు, సంప్రదాయాలు, వింతలు ఈ ప్రపంచంలో ఉన్నాయి. ప్రదేశాలను బట్టి వాటి సంప్రదాయాలు మారిపోతుంటాయి. ఇండియాతో పోలిస్తే మిగతా దేశాలు సంప్రదాయాలు వేర్వేరుగా ఉంటాయి. పాశ్చాత్య దేశాలు మన కంటే ఓ 20 ఏళ్లు ముందుగానే ఉంటాయని చెప్పవచ్చు. ఇండియాలో చూసుకుంటే ఎప్పుడో పాశ్చాత్య దేశాల్లో ఉండే కల్చర్ ఇప్పుడు ఇక్కడ ట్రెండ్ అవుతోంది. ముఖ్యంగా ఈ మధ్య కాలంలో బాయ్ ఫ్రెండ్, గర్ల్ ఫ్రెండ్ ఉండటం ఒక ట్రెండ్ అయిపోయింది. అసలు లవర్ ఉన్నవారిని కంటే లేని వారిని చూసే షాక్ అవుతున్నారు. అలా ట్రెండ్ మారింది. సాధారణంగా గదులు, దుస్తులు, సామానులు వంటివి అద్దెకి ఇస్తారు. కానీ బాయ్ ఫ్రెండ్ లేదా గర్ల్ ఫ్రెండ్‌ను అద్దెకు ఇస్తారనే విషయం మీకు తెలుసా? అయితే ఇది మన దేశంలో కాదు. అభివృద్ధిలో దూసుకుపోతున్న జపాన్‌లో గర్ల్ ఫ్రెండ్ లేదా బాయ్ ఫ్రెండ్‌ను రెంట్‌కి ఇస్తారు. పూర్తి వివరాల్లో తెలుసుకుందాం.ప్రతి ఒక్కరికి లైఫ్‌లో అన్ని విషయాలు షేర్ చేసుకునే ఒక వ్యక్తి ఉండాలని కోరుకుంటారు. వాళ్ల బాధలను ఎవరితో షేర్ చేసుకోకుండా మనస్సులోనే నలిగిపోతుంటారు. ఇలాంటి వారి బాధలను చూడలేక జపాన్ ప్రభుత్వం రెంట్ ఏ గర్ల్ ఫ్రెండ్ లేదా బాయ్ ఫ్రెండ్ విధానాన్ని తీసుకొచ్చింది. బాధలు షేర్ చేసుకోకపోవడం వల్ల ఒంటరితనానికి ఎక్కువగా బానిస అవుతున్నారు. దీని నుంచి విముక్తి కల్పించడానికి జపాన్ ప్రభుత్వం అద్దె పార్ట్‌నర్ పథకాన్ని ప్రారంభించింది. గంటలు లేదా రోజులు ఇలా పార్ట్‌నర్‌ను అద్దెకు తీసుకోవచ్చు. దీనికోసం ప్రభుత్వం కొన్ని వైబ్‌సైట్‌లను కూడా ప్రవేశపెట్టింది. అయితే ప్రభుత్వం అనుమతి ఉన్న వెబ్‌సైట్‌లలో మాత్రమే అద్దె తీసుకోవాలి. అయితే ఈ స్కీమ్‌లో ఎక్కువ ఖరీదుకే పార్ట్‌నర్‌లను అద్దెకు తీసుకోవాలి. కనీసం గంటకు రూ.3 వేల రూపాయిలు అద్దె కట్టాలి. అయితే కేవలం గంటకు బుక్ చేసుకోవడం కుదరదు. రెండు గంటల పాటు తప్పకుండా బుక్ చేసుకోవాలిఈ స్కీమ్‌లో మొదటిసారి ఉచితమే. తర్వాత నుంచి మనమే బుక్ చేసుకోవాలి. అయితే మీకు నచ్చిన అమ్మాయి రాదు. నచ్చిన అమ్మాయి కావాలంటే మళ్లీ రూ. 1200 కట్టాలి. అప్పుడే మీరు కోరిన పార్ట్‌నర్‌ను అద్దెకు ఇస్తారు. అయితే ఇందులో కొన్ని రూల్స్ ఉన్నాయి. అమ్మాయి లేదా అబ్బాయిని రెంట్ తీసుకుంటే డైరెక్ట్‌గా వాళ్లతో కాంటాక్ట్ కాకూడదు. అలాగే ఇంప్రెస్ చేయాలని బహుమతులు వంటివి ఇవ్వకూడదు. ఈ రూల్ ఇద్దరికీ వర్తిస్తుంది. ఈ పద్ధతి జపాన్‌లో ఎప్పటి నుంచో ఉందని సమాచారం. 1990 నుంచే ఈ కల్చర్ ఉందని, ప్రస్తుతం ఇంకా పెరిగిందని తెలుస్తోంది. ఇండియాలో ఇదే స్కీమ్ వస్తుందో? రాదో? ఒకవేళ వస్తే కనీసం 20 ఏళ్లు అయిన పట్టొచ్చు. మరి ఈ స్కీమ్ మీద మీ అభిప్రాయం ఏంటో కామెంట్ చేయండి.

# హైడ్రాకు సూపర్ పవర్స్

హైద్రాబాద్, అక్టోబరు 17, హైడ్రాకు మరిన్ని అధికారాలు కట్టబెడుతూ తెలంగాణ ప్రభుత్వం బుధవారం ప్రత్యేక జీవోను జారీచేసింది. పలు శాఖల అధికారాలను హైడ్రాకు బదిలీ చేయటంతో బాటు హైడ్రా కమిషనర్ తీసుకునే నిర్ణయాలపై న్యాయపరమైన వివాదాలు రాకుండా చూసేందుకే ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ దానకిషోర్ ఉత్తర్వులు జారీ చేశారు.హైదరాబాద్ నగర పరిధిలోని చెరువులు, కుంటలు, నాలాలు, పార్కులు, ప్రభుత్వ స్థలాలు, ఆటస్థలాలు సహా ప్రభుత్వ ఆస్తులను సంరక్షించడం, ప్రకృతి వైపరీత్యాల సమయంలో రక్షణ చర్యలు, ట్రాఫిక్ సమన్వయం, అగ్నిమాపక సేవలు తదితరాలతో కూడిన బాధ్యతలన్నింటినీ హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్స్ ప్రొటెక్షన్ ఏజెన్సీ(హైడ్రా)కు అప్పగిస్తూ, ఒక ప్రత్యేక సంస్థను తెలంగాణ ప్రభుత్వం ముందుకొచ్చింది. అయితే హైడ్రా చట్టబద్ధతపై పదేపదే కోర్టులకెక్కటంతో ఈ సమస్యలకు విరుగుడుగా ప్రభుత్వం తగిన క్లారిటీతో ఈ జీవోను జారీ చేసింది.జీహెచ్ఎంసీ చట్టం-1955లో గతంలో కేవలం 374, 374-ఎ సెక్షన్లు ఉండేవి. కానీ, తాజాగా సెక్షన్ 374-బి చేర్చుతూ ఆర్డినెన్స్ ద్వారా ప్రభుత్వం ఆ చట్టాన్ని సవరించింది. దీంతో రోడ్లు, నాలాలు, వీధులు, జలవనరులు, ప్రభుత్వ ఖాళీ స్థలాలు, పార్కులు, ఇతరత్రా ఆస్తుల ఆక్రమణలకు సంబంధించి నోటీసులు ఇవ్వడం, బాధ్యుల నుంచి పత్రాలు కోరడం, ఆక్రమణ నిజమని తేలాక నిర్మాణాలను కూల్చడం, విపత్తులు సంభవించకుండా తగు చర్యలు తీసుకోవడం వంటి అధికారాలన్నీ జీహెచ్ఎంసీ కమిషనర్ నుంచి నేరుగా హైడ్రాకు బదలాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వు జారీ చేసింది. దీంతో హైడ్రాకు అదనపు బలం సమకూరినట్లయింది.రాష్ట్ర ప్రభుత్వం జులై 19న జీవో 99 ద్వారా హైడ్రాను ఏర్పాటు చేసింది. దీనికి ఐజీ ర్యాంకు అధికారి ఎ.వి.రంగనాథ్‌ను కమిషనర్‌గా నియమించింది. అప్పట్నుంచి ఆయన ఆధ్వర్యంలో హైడ్రా దూకుడుగా వెళ్తోంది. అనేక అక్రమ కట్టడాలను తొలగించింది. ఈ క్రమంలో.. చట్టపరమైన అవాంతరాల వల్ల కమిషనర్ రంగనాథ్ ఇతర శాఖలపై ఆధారపడాల్సి వస్తోంది. ఆక్రమణలను తొలగించేందుకు.. జీహెచ్ఎంసీ, శివారు మున్సిపాలిటీలు, నగరపాలక సంస్థల ద్వారా నోటీసులు ఇప్పిస్తూ, అనుమతులు రద్దు చేయిస్తూ ముందుకెళ్తున్నారు. ఇప్పుడు 374-బి సెక్షన్‌లోని అధికారాలను హైడ్రాకు బదిలీ చేయటంతో.. జీహెచ్ఎంసీ పరిధిలో హైడ్రా కమిషనర్‌కు నేరుగా చర్యలు తీసుకునే వెసులుబాటు ఏర్పడింది.

# నెలాఖరుకు రుణమాఫీ పూర్తయ్యేనా..

నిజామాబాద్, అక్టోబరు 17, తెలంగాణ ప్రభుత్వం రూ.2 లక్షల వరకు రైతు రుణమాఫీ చేస్తుంది. ఈ ప్రక్రియలో ఇప్పటికే రైతులకు రుణమాఫీ కాగా...పలు సాంకేతిక కారణాలతో పలువురికి రుణమాఫీ నిలిచిపోయింది. రుణమాఫీ కాని వారి సమస్యలు పరిష్కరించి...అర్హులందరికీ రూ.2 లక్షల రుణమాఫీ అయ్యేలా చేస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. ఈ మేరకు అధికారులు సాంకేతిక అడ్డంకులు తొలగించే పనిలో ఉన్నారు. మరో 15 రోజుల్లో ఈ ప్రక్రియ పూర్తి చేస్తామని మంత్రులు అంటున్నారు.రుణమాఫీపై వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కీలక ప్రకటన చేశారు. అక్టోబర్ 31 నాటికి రూ.2 లక్షలలోపు రుణాలు ఉన్న, అర్హులైన వారందరికీ రుణమాఫీ పూర్తి చేస్తామని స్పష్టమైన ప్రకటన చేశారు. నవంబర్ 1 నుంచి రూ.2 లక్షల కంటే ఎక్కువ రుణాలున్న రైతుల రుణమాఫీపై ప్రక్రియ చేపడతామన్నారు. దీంతో రూ.2 లక్షల కంటే ఎక్కువ రుణాలు ఉన్న రైతులు... ముందుగా పైన ఉన్న రుణాన్ని అక్టోబర్ 31లోపు క్లియర్ చేసుకోవాల్సి ఉంటుంది.కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం మొదటి పంట కాలంలోనే రూ.31 వేల కోట్ల రైతుల పంట రుణాలు మాఫీ చేస్తామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. బుధవారం నల్లగొండ ఎస్ఎల్‌బీసీ బత్తాయి మార్కెట్ యార్డులో ధాన్యం, పత్తి కొనుగోలు కేంద్రాన్ని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డితో కలిసి తుమ్మల నాగేశ్వరరావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మంత్రి తుమ్మల మాట్లాడుతూ....గత 5 ఏళ్లలో రైతులు ఏ బ్యాంకులో ఎంత రుణం తీసుకున్నా రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేయాలని ప్రభుత్వం కేబినెట్ నిర్ణయించిందన్నారు.ఇప్పటి వరకూ 22 లక్షల రేషన్ కార్డులు కలిగిన రైతులకు రూ.18 వేల కోట్ల రుణమాఫీ నగదు ఖాతాల్లో జమ చేశామన్నారు. ఈ నెలాఖరు నాటికి రేషన్ కార్డులు మిగిలిన 4 లక్షల మంది రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ పూర్తి చేస్తామన్నారు. రూ.2 లక్షల పైన రుణాల మాఫీపై షెడ్యూల్ ప్రకటిస్తామన్నారు. ఎట్టి పరిస్థితులలో ఈ పంట కాలంలోనే రూ.31 వేల కోట్లు రుణమాఫీ చేసి తీరుతామని మంత్రి తుమ్మల స్పష్టం చేశారు.రైతు భరోసాపై కూడా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రకటన చేశారు. త్వరలోనే రైతు భరోసా కింద ఎకరానికి రూ.7,500 అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.15,000 రైతు భరోసా ఇస్తామన్నారు. 2025 మార్చి 31 లోపు రైతులందరికీ రైతు భరోసా కింద 2 విడతల్లో ఎకరానికి రూ.7,500 చొప్పున ఆర్థిక సాయం అందిస్తామన్నారు.అర్హులైన రైతులకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం గత పదేళ్లలో రూ.13,500 కోట్లు రెండు విడతలుగా మాఫీ చేస్తే కాంగ్రెస్ ప్రభుత్వం 26 రోజుల్లో రూ.18 వేల కోట్లు రుణమాఫీ చేసిందన్నారు. మరో రూ.13 వేల కోట్లు రుణమాఫీ చేయాల్సి ఉందన్నారు. త్వరలోనే రూ.13 వేల కోట్ల రుణమాఫీ పూర్తిచేస్తామని మంత్రి పొంగులేటి చెప్పారు.

# 2025 ఎన్నికల నామ సంవత్సరమే...

హైదరాబాద్, అక్టోబరు 17,గ్రామాల్లో పాలన పడకేసి పది నెలలు తొమ్మిది నెలలు కావొస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ పంచాయతీలకు 2019 జనవరిలో ఎన్నికలు జరిగాయి. కొత్త పంచాయతీల పాలకవర్గాలన్నీ అదే ఏడాది ఫిబ్రవరిలో కొలువు దీరాయి. ఈ ఏడాది ఫిబవరిలో గ్రామ పంచాయతీల పాలక వర్గాలు పదవుల నుంచి దిగిపోగా పంచాయతీల బాగోగులు పట్టించుకునేందుకు ప్రత్యేక అధికారులను నియమించారు.పాత పాలక వర్గాల పదవీ కాలం పూర్తయ్యాక ఎన్నికలు నిర్విహించాల్సిన స్థానే వివిధ కారణాలతో ప్రభుత్వం ఎన్నికలను వాయిదా వేస్తూ వచ్చింది. ఈ కారణంగానే గ్రామాలను స్పెషల్ అధికారుల చేతిలో పెట్టింది. వాస్తవానికి ఈ పాటికే ఎన్నికలు జరుగుతాయని అంతా భావించారు, రిజర్వేషన్ల ఖరారు విషయంలో నెలకొన్న సందిగ్ధం వల్ల విషయం కొలిక్కి రావడం లేదు.రిజర్వేషన్లు ఖరారు చేయాలంటే కుల గణన పూర్తి కావాల్సి ఉంది. కులాల జనాభా లెక్కలు తేలితే కానీ రిజర్వేషన్ల ఖరారు, ఎన్నికల నిర్వహణపై ఓ నిర్ణయానికి వచ్చే అవకాశం కనిపించడం లేదు. దీంతో ఈ ఏడాది మరో రెండున్నర నెలలే మిగిలి ఉన్న నేపథ్యంలో ఇక, ఈ ఏడాది స్థానిక సమరం లేనట్లేనన్న అభిప్రాయం వ్యక్తం అవుతోంది.కులాల వారీ జనాభా లెక్క తేల్చేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. శాసనసభ ఎన్నికల సయమంలో కాంగ్రెస్ ఇచ్చిన ఎన్నికల ప్రధాన హామీల్లో కుల గణన ఒకటి. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారం చేపట్టి పది నెలలు గడిచిపోయింది. కేవలం మరో రెండు నెలల్లోపు సమయంలోనే ఏడాది పాలనను పూర్తి చేసుకోబోతున్న నేపథ్యంలో కుల గణన, ఆర్థిక, సామాజిక, రాజకీయ సర్వే కోసం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు జీవో 13ను విడుదల చేసింది.ఈ జీవో ప్రకారం సర్వే పూర్తి చేయడానికి రెండు నెలల గడువు విధించింది. ఫలితంగా స్థానిక సంస్థల అయిన గ్రామ పంచాయతీలతో పాటు, మండల పరిషత్, జిల్లా పరిషత్ లకు కూడా ఎన్నికలు ఈ ఏడాది జరగనట్టేనేని అభిప్రాయం పడుతున్నారు. కుల గణన, సర్వే డిసెంబరు 15వ తేదీలోగా పూర్తి చేయాలని గడువు విధించిన నేపథ్యంలో.. సర్వే ఫలితాలపై చర్చలు జరిపిన, తుది నివేదిక రూపొందాకే రిజర్వేషన్లు ఖరారు అవుతాయని, ఆ తర్వాతే కొత్త రిజర్వేషన్ల మేరకు ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయాల్సి ఉంటుందని చెబుతున్నారు.రాష్ట్ర వ్యాప్తంగా వచ్చే ఏడాది దాదాపు సాంతం స్థానిక సంస్థలకు ఎన్నికలు జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. ముందుగా ఇప్పటికే పదవీ కాలాలు పూర్తయ్యి స్పెషల్ ఆఫీసర్ల పాలనలో పదినెలలుగా మగ్గుతున్న గ్రామ పంచాయతీలకు ఎన్నికల జరగాల్సి ఉంది. ఆ తర్వాత ఇటీవల మూడు నెల్ల కిందట పదవీ కాలం పూర్తయిన మండల పరిషత్ లకు, జిల్లా పరిషత్ లకు ఎన్నికలు నిర్వహించాల్సి ఉంటుంది. దీనికోసం మండల ప్రాదేశిక నియోజకవర్గ సభ్యులు ( ఎంపీటీసీ సభ్యులు), జిల్లా ప్రాదేశిక నియోజజకవర్గ సభ్యులు (జెడ్పీటీసీ సభ్యులు) ఎన్నికలు జరిపి, పరోక్ష పద్దతిలో తిరిగి మండల పరిషత్ అధ్యక్షులు (ఎంపీపీలు), జిల్లా పరిషత్ చైర్మన్ల ఎన్నికలు జరపాల్సి ఉంటుంది.వచ్చే ఏడాది జనవరితో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న నగర పంచాయతీలు, మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్ల పాలక వర్గాల పదవీ కాలం కూడా పూర్తవుతుంది. దీంతో వీటికి కొత్త పాలకవర్గాలను ఎన్నుకోవాల్సి ఉంటుంది. అటు రూరల్, ఇటు అర్బన్ లోకల్ బాడీలకు ఎన్నికలు పూర్తి చేయాల్సి ఉన్నందున వచ్చే ఏడాదిలో దాదాపు సాంతం ఎన్నికలే ఉండే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి.

# గులాబీకి రాంగ్ ఫైర్....
# కౌంటర్లకు ప్రతి కౌంటర్లతో డైలమా

హైదరాబాద్, అక్టోబరు 16, బీఆర్ఎస్‌కు అన్ని బ్యాక్ ఫైర్ అవుతున్నాయి. ఏ అంశంతో ముందుకు వెళ్దామనుకున్న సక్సెస్ కావడం లేదనే అభిప్రాయం పార్టీ నేతల్లో ఉంది. అమృత్ స్కీంలో స్కాం ఆరోపణలు.. మూసీ లూటిఫికేషన్ కామెంట్.. హైడ్రా విషయంలో ఆర్డినెన్స్‌తో బ్రేక్.. ఇప్పుడు నేవీ రాడార్ స్టేషన్‌లోనూ చేసిన వ్యాఖ్యలన్నీ రివర్స్ అవుతున్నాయి. అన్నీ గత ప్రభుత్వ నిర్ణయాలేనని ప్రస్తుత సర్కారు క్లారిటీ ఇవ్వడంతో పాటు సీఎం వేదికలపై స్పష్టంగా చెబుతుండటంతో కక్కలేక మింగలేని పరిస్థితి బీఆర్ఎస్‌కు నెలకొంప్రభుత్వ వైఫల్యాలను ప్రజాక్షేత్రంలో ఎండగట్టాలని బీఆర్ఎస్ భావించింది. ప్రస్తుతం చేసే పనులన్నీ ప్రజాభిష్టానికి వ్యతిరేకంగా చేస్తున్నారని పార్టీ వర్కింగ్ కేటీఆర్ తన విమర్శలతో స్పీడ్ పెంచారు. కానీ ఆయన వ్యూహాలన్నీ బెడిసి కొడుతున్నాయి. ప్రతి అంశం ఫెయిల్ అవుతోందని పార్టీలోనే చర్చకు దారితీసింది. అమృత్ స్కీం టెండర్లలో అవినీతి జరిందని.. ఏకంగా రూ.8,888 కోట్ల స్కాం జరిగిందంటూ కేటీఆర్ ఆరోపించారు. అందులో సీఎం రేవంత్‌రెడ్డి బావమరిది అయిన సృజన్‌రెడ్డికి సంబంధించిన కంపెనీకి రూ.1,137 కోట్ల టెండర్లు కట్టబెడ్డారంటూ ఆరోపణలు చేశారు. ఈ ఆరోపణలపై సృజన్‌రెడ్డి స్పందించి కేటీఆర్‌కు లీగల్ నోటీసులు ఇచ్చారు. తన పరువుకు భంగం కలిగించేలా ఉన్నాయంటూ నోటీసులో తెలిపారు. తప్పుడు వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలంటూ డిమాండ్ చేశారు.ప్రతిసారి తనపై ఆరోపణలు చేసే ప్రత్యర్థి పార్టీల లీడర్లకు లీగల్ నోటీసులు పంపే కేటీఆర్‌కు.. సృజన్‌రెడ్డి లీగల్ నోటీసులు పంపించడం ఇప్పుడు పార్టీతో పాటు రాజకీయ వర్గాల్లోనూ చర్చనీయాంశంగా మారింది. బీఆర్ఎస్ నేత, మాజీ ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి కూడా కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను ఖండించారు. అమృత్ టెండర్లపై కేటీఆర్‌కు ఎవరో తప్పుడు సమాచారం ఇచ్చారని అభిప్రాయపడ్డారు. సృజన్‌రెడ్డి అనే వ్యక్తి రేవంత్‌రెడ్డికి సొంత బావమరిది కాదని.. తనకు అల్లుడు అవుతారని చెప్పుకొచ్చారు. సృజన్‌రెడ్డికి రాజకీయాలతో ఎలాంటి సంబంధం లేదని చెప్పారు.మూసీ ప్రక్షాళనపై కేటీఆర్ తీవ్రవిమర్శలు చేశారు. హామీలను అమలు చేసేందుకు పైసలు లేవంట.. కానీ మూసీ ప్రక్షాళన కోసం రూ. లక్షా 50 వేల కోట్లు ఖర్చు చేస్తాడంట అని మండిపడ్డారు. సంక్షేమ పథకాల కోసం పైసలు ఇస్తే మీరు కమిషన్‌లు ఇవ్వరు కదా? అదే మూసీ ప్రాజెక్ట్ అయితే లక్షా కోట్లు మింగొచ్చు అని ఫైర్ అయ్యారు. రాహుల్ గాంధీ, వాళ్ల బావకు కోట్ల రూపాయలు దోచి పెట్టొచ్చు.. మనం గల్లా పట్టి అడిగే వరకు ఈ కాంగ్రెస్ పార్టీ మోసం కొనసాగుతూనే ఉంటది. మనం ఏదైనా సమస్య వస్తే కలెక్టర్లకు చెప్పాలంట. ఇంటింటికి ఓట్ల కోసం వచ్చిన వాళ్లను మాత్రం అడగవద్దంట... ప్రజలకు ఏం ఖర్మ. ఎవరైతే మనకు తప్పుడు హామీలు ఇచ్చారో వాళ్లనే పట్టుకోవాలే అని పిలుపు నిచ్చారు. కాంగ్రెస్ ఎంపీలు, ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ నాయకులను పట్టుకొని మనం అడగాలె అని కేటీఆర్ సూచించారు. మూడ్రోజులపాటు మూసీ పరివాహక ప్రాంతాల్లో పర్యటించారు. బాధితులకు భరోసా కల్పించే ప్రయత్నం చేశారు. ఈ తరుణంలో సీఎం రేవంత్‌రెడ్డి మూసీ పరివాహక ప్రాంతాల్లో ఇండ్లు కోల్పోతున్నవారికి 'డబుల్' ఇండ్లు, రూ.25 వేలు, విద్యార్థులకు నాణ్యమైన విద్య కల్పిస్తామనే భరోసా ఇచ్చారు. 2017లో బీఆర్ఎస్ మూసీ సుందరీకరణకు రూపకల్పన చేసిందని దానినే కొనసాగిస్తున్నామని సీఎం వెల్లడించారు. దీంతో బీఆర్ఎస్ ఒక్కసారిగా డైలమాలో పడింది.హైడ్రా విషయంలోనూ బీఆర్ఎస్‌కు బ్యాక్ ఫైర్ అయింది. ఎఫ్టీఎల్, బఫర్ జోన్లలో ఉన్న ఇండ్లను కూల్చివేతకు శ్రీకారం చుట్టింది. అయితే దీనిపై కేటీఆర్ తీవ్ర విమర్శలు చేశారు. 'మేము నిర్మిస్తే - మీరు కూల్చేస్తున్నారు.. మాది నిర్మాణం - మీది విధ్వంసం.. లక్షల నిర్మాణాలు మావి - లక్షల కూల్చివేతలు మీవి' అని మండిపడ్డారు. హైడ్రా పేరుతో బుల్డోజర్ రాజ్యం నడుపుతున్నారని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. అయితే దీనిపై ప్రభుత్వం ఆర్డినెన్స్ తీసుకొచ్చింది. అధికారాలు సైతం కల్పించింది. భవిష్యత్ తరాలకు ఇబ్బందులు కలగకుండా హైదరాబాద్ నగర పరిధిలో నీటి వనరులు, ప్రభుత్వ ఆస్తులు, స్థలాలను కాపాడే ఉద్దేశంతో హైడ్రాను ఏర్పాటు చేసినట్టు పేర్కొన్నారు. హైడ్రాకు ప్రత్యేక అధికారాలతో పాటు సిబ్బందిని కూడా పెద్ద ఎత్తున నియమించడంతో అక్రమ నిర్మాణాలపై మరింత దూకుడును పెంచనుంది. దీంతో కేటీఆర్ ఒకటి తలిస్తే.. మరొకటి అయింది.ఇప్పుడు నేవీ రాడార్ స్టేషన్‌ను బీఆర్ఎస్ వ్యతిరేకిస్తోంది. వికారాబాద్ జిల్లా దామగుండం అటవీ ప్రాంతంలో నేవీకి సంబంధించిన వీఎల్ఎఫ్ రాడార్ స్టేషన్‌ను నిర్మించొద్దని పర్యావరణవేత్తలతో కలిసి పోరాటం చేస్తామని కేటీఆర్ ప్రకటించారు. దామగుండంలో రాడార్ ఏర్పాటు కారణంగా పర్యావరణానికి తీవ్రంగా నష్టం వాటిల్లుతుందన్నారు. దాదాపు 2,900 ఎకరాల అటవీ భూభాగంతో పాటు 12 లక్షల చెట్లను నరికి వేసి ఈ ప్రాజెక్ట్ నిర్మాణం చేపట్టనున్నారన్నారు. జనవాసాలు లేని చోట ఏర్పాటు చేయాల్సిన రాడార్ కేంద్రాన్ని తెలంగాణలో ఎందుకు నిర్మిస్తున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. మూసీ నదిని పూర్తిగా ప్రమాదంలో పడేసే రాడార్ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం అంగీకారం తెలపటమేమిటనీ ప్రశ్నించారుఇదెక్కడి ద్వంద్వ వైఖరంటూ సీఎం రేవంత్‌రెడ్డిని నిలదీశారు. దీనికి సీఎం ఘాటుగా స్పందించారు. 2017లోనే నేవీ రాడర్ స్టేషన్‌కు భూ బదలాయింపు జరిగిందని, అప్పుడు అంగీకరించి ఇప్పుడు ఎందుకు వ్యతిరేకిస్తున్నారని.. వివాదాలకు తెరలేపేవారు దేశ రక్షణ, భద్రతపై ఆలోచించాలని సూచించారు. దేశ భద్రతకు ముప్పు ఏర్పడే పరిస్థితుల నుంచి కాపాడటానికి ఏర్పాటు చేస్తున్న ప్రాజెక్టును వివాదాస్పదం చేయడం సరికాదని సూచించారు. కేటీఆర్.. ప్రభుత్వాన్ని ఇరుకునబెట్టేందుకు చేస్తున్న ప్రయత్నాలన్నీ తుస్ మంటున్నాయనే ప్రచారం జరుగుతోంది. ఏదీ కలిసి రావడం లేదని, పార్టీ పటిష్టం ఎలా అనేదానిపైనా అధిష్టానం మల్లగుల్లాలు పడుతున్నట్టు సమాచారం. ప్రజల్లోకి ఏ అంశంతో ముందుకెళ్లాలి.. ఎలా వారి మద్దతు పొందాలనే దానిపై మల్లగుల్లాలు పడుతున్నారు.

## మహారాష్ట్రలో పీచేమూడ్...

హైదరాబాద్, అక్టోబరు 17,వచ్చే నెలలో జరుగబోయే మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో పోటి చేయడంపై బీఆర్ఎస్ పార్టీ మౌనం పాటిస్తుంది. జాతీయస్థాయిలో ఎదగడం కోసమే పేరు మార్చుకున్న బీఆర్ఎస్ పార్టీ, సొంత రాష్ట్రంలో అధికారం కొల్పోపోవడంతో అంతర్ రాష్ట్ర రాజకీయాలకు దూరంగా ఉండనున్నట్లు తెలుస్తుంది. 2023లో అసెంబ్లీ ఎన్నికలకు ముందు తెలంగాణ రాష్ట్ర సమితి నుంచి భారత రాష్ట్ర సమితిగా పార్టీగా పేరు మారింది. ఆ తర్వాత జాతీయ స్థాయిలో సత్తాచాటాలని మహారాష్ట్ర, కర్ణాటక, మధ్యప్రదేశ్, ఒడిస్సా, బీహార్ రాష్ట్రాలలో బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కేసీఆర్ పర్యటించి అక్కడ కూడా పార్టీ శాఖలను ఏర్పాటు చేశారు. ముఖ్యంగా ఆయన మహారాష్ట్రపై ఎక్కువ దృష్టి పెట్టారు. నాగపూర్, సోలాపూర్, నాందేడ్ ప్రాంతాలలో పార్టీ కార్యాలయం కూడా ప్రారంభించారు. కొన్ని ప్రాంతాల్లో ఎన్సీపీ, కాంగ్రెస్, శివసేనల నుంచి పలువురు నాయకులు బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నారు.బీఆర్ఎస్ మహారాష్ట్రలో 4 భారీ బహిరంగ సభలు నిర్వహించింది. మహారాష్ట్రలో బీఆర్ఎస్ అధికారంలోకి రాకపోయిన కానీ ప్రధాన పార్టీలకు ఎంతో కొంత పోటి ఇస్తుందని అంతా భావించారు. అప్పట్లో మహారాష్ట్ర నుంచి కొంతమందికి రాష్ట్ర ప్రభుత్వంలో పోర్ట్‌ఫోలియో ఉన్న బాధ్యతలు కూడా అప్పజెప్పారు. అదిలాబాద్ నిజామాబాద్ ఎమ్మెల్యేలకు నాందేడ్‌తో పాటు తెలంగాణకు ఆనుకొని ఉన్న మహారాష్ట్ర ప్రాంతాలకు ఇంఛార్జులుగా నియమించారు. ఇక అన్ని సిద్ధం చేసుకున్నా తర్వాత ఎన్నికల రంగంలోకి దూకడమే ఆలస్యం అనుకున్న సమయంలో తెలంగాణలో బీఆర్ఎస్ దెబ్బతినడంతో కేసిఆర్ వ్యూహాలు తలకిందులయ్యాయి. అప్పటి నుంచి ఆయా రాష్ట్రాల్లో ఉన్న శాఖల బాధ్యులు, నాయకులు ఒక్కొక్కరిగా రాజీనామా చేయడం మొదలుపెట్టారు. పార్టీ కార్యాలయాలకు కూడా రావడం లేదు. కేసీఆర్ కూడా ఇతర రాష్ట్రాల్లో రాజకీయాలపై దృష్టిపెట్టడం తాత్కాలికంగా ఆపివేసినట్లు చర్చ జరుగుతుంది.తాజాగా మహారాష్ట్రలో అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో అందరి దృష్టి మళ్లీ బీఆర్ఎస్‌పై పడింది. గతంలో హడావుడి చేసిన పార్టీ ఇప్పుడు ఎవరికైనా మద్దతిస్తుందా? లేక తెలంగాణ బోర్డర్‌లో ఉన్న నియోజకవర్గాల్లో పోటీ చేస్తుందా? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. కానీ బీఆర్ఎస్ పార్టీ వైపు నుంచి మాత్రం ఎలాంటి సమాధానం రావడం లేదు. పూర్తిగా తెలంగాణపై దృష్టి పెట్టినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. మహారాష్ట్ర ఎన్నికల్లో బీఆర్ఎస్ పోటీచేస్తుందా? లేదా అనేది రాజకీయ వర్గాల్లో ఉత్కంఠ రేపుతోంది. జాతీయ రాజకీయాల్లో క్రియాశీలంగా రాణించాలని అనుకున్నా బీఆర్ఎస్ పార్టీకి ప్రస్తుతానికి బ్రేక్ పడ్డట్లే అని పలువురు అభిప్రాయపడుతున్నారు.

# ఫుల్ ఫైట్ కు రెడీ అవుతున్న ప్రతిపక్షాలు

హైదరాబాద్, అక్టోబరు 17, అధికార కాంగ్రెస్‌పై పవర్ ఫుల్ ఫైట్‌కి సిద్ధమవుతున్నాయి ప్రతిపక్షాలు.. పక్కా ప్లాన్‌తో ప్రజాల్లోకి వెళ్లాలని డిసైడ్ అయ్యాయి. ఎన్నికల హామీలపై కాంగ్రెస్ తీరును ఎండగడుతూ నవంబర్‌లో ఉద్యమానికి కాషాయం పార్టీ సై అంటుంటే.. కాంగ్రెస్ వన్ ఇయర్ పాలనపై పోరాడుతామంటూ డిసెంబర్‌ను ఫిక్స్ చేసుకుంది బీఆర్ఎస్. మరోవైపు ఎవరెలా వచ్చినా ఏం చేయలేరంటోంది అధికార కాంగ్రెస్. దీంతో తెలంగాణ పాలిటిక్స్ మరింత ఇంట్రెస్టింగ్‌గా మారాయి.రాష్ట్రవ్యాప్తంగా నవంబర్ నుంచి ప్రజాసమస్యలపై ఉద్యమిస్తామని క్లారిటీ ఇచ్చారు కేంద్రమంత్రి కిషన్ రెడ్డి. ఒక్క ఇళ్లు కట్టలేదు. పేదలకు ఒక్క ఇళ్లు పంచలేదు? గ్యారంటీలు రోడ్డున పడ్డాయన్నారు. హామీల పేరుతో రాష్ట్రాన్ని దివాలా తీసేలా చేస్తున్నారంటూ ఫైర్ అయ్యారు. ఎన్నికలప్పుడు ఇచ్చిన ప్రతి హామీపైనా ప్రభుత్వాన్ని నిలదీస్తామన్నారు.ఇక డిసెంబర్‌తో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తవుతుంది. ఏడాదిలో కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణకు ఏం చేసింది?? ఎన్ని గ్యారంటీలు అమలు చేసింది?? ఎన్ని హామీలు నెరవేర్చింది?? అంటూ బీఆర్ఎస్ సైతం ప్రభుత్వంపై ఫైట్‌కి సిద్ధమవుతోంది. డిసెంబర్‌లోనే గులాబీ దళపతి రంగంలోకి దిగుతారన్న ప్రచారం పెద్ద ఎత్తున జరుగుతోంది.రాష్ట్రంలో రాజకీయం రగులుతున్నా బయటకు రాలేదు కేసీఆర్. ఓవైపు రుణమాఫీ పాలిటిక్స్? మరోవైపు హైడ్రా మంటలు.. ఇంకోవైపు మూసీ ప్రక్షాళనపై రాజకీయం ఓ రేంజ్‌లో నడుస్తున్నా?కేసీఆర్ బయటకు రావడం లేదు. ప్రభుత్వం వైఫల్యాలపై ఎలా ముందుకెళ్లాలో కూడా కేడర్‌కు దిశానిర్దేశం చేయలేదు. అంతేకాదు ఆ మధ్య తెలంగాణలో భారీ వరదలు ముంచేత్తిన సమయంలోనూ కేసీఆర్ జనం మధ్యకు రాలేదు. కౌశిక్‌రెడ్డి ఇష్యూ జరిగినా కేసీఆర్ మౌనం వీడలేదు. ఈవన్నీ అంశాలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావే మాట్లాడుతున్నారు. మాజీమంత్రులు, ఎమ్మెల్యేలు జనంలోనే ఉంటున్నారు. కేసీఆర్ మాత్రం ఎక్కడా కనిపించడం లేదు. ప్రెస్‌నోట్లు కూడా ఇవ్వలేదు. దీంతో కేసీఆర్ ఎందుకు ప్రజల్లోకి రావట్లేదని రాజకీయాల్లో పెద్ద ఎత్తున చర్చ నడుస్తోంది. అయితే ఇదే అంశాన్ని క్యాష్ చేసుకుంటోంది అధికార కాంగ్రెస్ పార్టీ. కేసీఆర్ ఫాంహౌస్‌కే పరిమితం కావడంపై మంత్రులు విమర్శలు గుప్పిస్తున్నారు. దీంతో అధికార పార్టీ విమర్శలకు అదే స్థాయిలో కౌంటర్ ఇస్తూ వస్తోంది బీఆర్ఎస్. కేసీఆర్‌కి ఎప్పుడు ప్రజల్లోకి రావాలో తెలుసంటున్నారు గులాబీ నేతలు.ఇక ఇన్ని ఇష్యూస్ ఉన్నా కేసీఆర్ రియాక్ట్ కాకపోవడానికి చాలా కారణాలు ఉన్నాయంటున్నారు కొందరు బీఆర్ఎస్ నేతలు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ఏడాది సమయం ఇచ్చే ఆలోచనలో గులాబీ బాస్ ఉన్నట్లు బీఆర్ఎస్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. అప్పటివరకు కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో జరిగిన మేలేంటో..నష్టమేంటో ప్రజలకే అర్థం అవుతుందని కేసీఆర్ భావిస్తున్నారట. ఏడాది సమయం ఇచ్చి? ఇప్పుడు విమర్శించినా ప్రజలు రిసీవ్ చేసుకునే పరిస్థితి ఉండదని.. ఆలోపే ప్రభుత్వాన్ని టార్గెట్ చేయొద్దని గులాబీ బాస్ అనుకుంటున్నారట. మరి కాంగ్రెస్ పాలనకు ఏడాది పూర్తైన తర్వాతైనా గులాబీ దళపతి ఫీల్డ్‌లోకి దిగుతారా..? లేదా అన్నది చర్చనీయాంశమైంది.మొత్తంగా? అటు బీజేపీ ఇటు బీఆర్ఎస్ రెండు పార్టీలు పక్కా ప్లాన్‌తో ముందుకెళ్తున్నారు.

## నియోజకవర్గాలకు దూరంగా మాజీలు

మహబూబ్ నగర్, అక్టోబరు 16పదేండ్ల పాటు అధికారంలో ఉండి గత అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి పాలైన తర్వాత మాజీ మంత్రులు.. మాజీ ఎమ్మెల్యేలు నియోజకవర్గాలకు దూరంగానే ఉంటున్నారు. అప్పుడప్పుడు చుట్టపు చూపుగా వచ్చి వెళుతున్నారే తప్ప.. నియోజకవర్గ కేంద్రాలలో ఉండడం లేదు. దీంతో పార్టీ క్యాడర్ అయోమయానికి గురవుతోంది. గులాబీ పార్టీని నమ్ముకుని కొనసాగడమా.. లేదా పార్టీ మారడమా అన్న ఆలోచనలలో క్యాడర్ తెలుస్తోంది. స్థానిక సంస్థల ఎన్నికలు వచ్చేనాటికి క్యాడర్ లో పెద్ద ఎత్తున మార్పులు జరగవచ్చనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలను అసెంబ్లీ స్థానాల పునర్విభజన, మహిళ రిజర్వేషన్ అమలు ప్రక్రియలు ఒకింత భయపెడుతున్నాయి. నియోజకవర్గాల పునర్విభజన జరిగితే ఏ మండలాలు.. ఏ నియోజకవర్గంలో చేరుతాయో.. తమ సొంత మండలం తాను పోటీ చేయాలని అనుకుంటున్న నియోజకవర్గంలో ఉంటుందో లేదో..!? మహిళా రిజర్వేషన్ అమలు అయి తమ కోరుకుంటున్న స్థానాలు మహిళలకు వెళ్లిపోతే తమ పరిస్థితి ఏంటి ...?అని ఆలోచనలు చేస్తున్నట్లు తెలుస్తోంది. రిజర్వేషన్లు, పునర్విభజన సంగతులు ఎలా ఉన్నా.. ఇప్పటినుండి ఖర్చులు పెట్టడం ఎందుకు అని ఆలోచనలు చేస్తూ మాజీలు.. వచ్చామా.. చూసామా.. వెళ్ళామా..! అన్నట్లుగా వ్యవహరిస్తుండడం పార్టీ క్యాడర్‌లో ఆందోళనలను కలిగిస్తోంది.ఎన్నికల అనంతరం మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు స్థానికంగా ఒకరు కూడా ఉండటం లేదు. పండుగల సమయాలలో ఒక్కరు ఇద్దరు మినహాయిస్తే.. మిగిలిన వారు ఎవరు కూడా నియోజకవర్గ ప్రజలకు.. పార్టీ క్యాడర్ కు అందుబాటులో ఉండటం లేదు. పార్టీ కార్యక్రమాలు ఏమైనా ఉంటే నడపదడప వచ్చిపోవడమేనా ఇస్తే పార్టీ క్యాడర్ కు ఇబ్బందులు వస్తే వారికి అండగా కూడా ఉండడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొందరు మాజీలు అయితే ఓడిపోయిన తర్వాత నియోజకవర్గానికి ఒకటి రెండుసార్లుక్ మాత్రమే వచ్చి వెళ్లినట్టు పార్టీ శ్రేణులు ఆరోపిస్తున్నాయి.మాజీలు అంటిముట్టనట్టుగా అన్నట్లుగా ఉంటుండడంతో.. స్థానిక నేతలు తమ రాజకీయ భవిష్యత్తు కోసం పక్క చూపులు చూస్తున్నట్లు సమాచారం. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసే లక్ష్యంతో అధికార పార్టీ నాయకులు కార్యకర్తలతో సమాలోచనలు చేయడానికి పలువురు సన్నద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ఉమ్మడి పాలమూరు జిల్లా మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు అందుబాటులో ఉండి, సమస్యలు పరిష్కరించుకుంటే క్యాడర్ ఎవరి దారిన వాళ్ళు వెళ్లడం ఖాయమని పలువురు నాయకులు అంటున్నారు.



### ఇళ్లల్లోకి సముద్ర జలాలు

కాకినాడ వాయుగుండం ప్రభావంతో ఏపీలోని కాకినాడ జిల్లా ఉప్పాడ సముద్ర తీరం అల్లకల్లోలంగా మారింది. భారీగా ఎగసిపడుతున్న రాకాసి అలలు, ఈదురుగాలుల ధాటికి పలు ఇళ్లు, విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. పలు ఇళ్లల్లోకి సముద్ర జలాలు చేరాయి. దాంతో ప్రజలలు భయాందోళనకు గురవుతున్నారు.

## యాదగిరిగుట్టకు వచ్చేనెయ్యి స్వచ్ఛమైనది..... ఆలయ ఈవో

యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ ప్రసాదంలో వాడే నెయ్యి నాణ్యత బాగుందని ఫుడ్ సేఫ్టీ అధికారులు సర్టిఫికెట్ ఇచ్చారని ఆలయ ఈవో భాస్కర్రావు తెలిపారు.. యాదాద్రి కొండపై తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పలు విష యాలను వివరించారు. యాదాద్రీశుడి ప్రసాదంలో వినియోగించే నెయ్యిని పరిశీలించేందుకు ఇటీవల షాంపిల్స్ తీసుకెళ్లారని, వాటిని పరిశీలించిన తరువాత నాణ్యత బాగుందని అధికారులు వెల్లడించారని ఆయన పేర్కొ న్నారు. లడ్డూ తయారీతో పాటు ఇతర ప్రసాదాలకు ప్రతి రోజు వెయ్యి కిలోల నెయ్యిని వాడుతున్నామన్నారు. సంవ త్సరానికి రూ.15 కోట్ల విలువైన నెయ్యిని మదర్ డెయిరీ ద్వారా కొనుగోలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. మదర్ డెయిరీ నుంచి 40 సంవత్సరాలుగా నెయ్యిని టెండర్ ధరల ప్రకారమే కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. నెయ్యి శాంపిలన్ను ప్రతి నెల పరీక్షలకు పంపుతామన్నారు. మదర్ డెయిరీ ద్వారా నెయ్యి కొనుగోలు టెండర్ వచ్చే సంవత్సరం మార్చి 31 వరకు గడువు ఉందని, కానీ, ప్రభుత్వం విజయ డెయిరీ నుంచి నెయ్యిని వాడాలని ఆదేశించిందని చెప్పారు. విజయ డెయిరీ నెయ్యిని వాడాలా.. మదర్ డెయిరీ నెయ్యి వాడాలా అనే అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు..

## కేంద్ర మంత్రులను కలిసిన రింగ్ రోడ్డు రైతులు





యాదాద్రి భువనగిరి జిల్లా త్రిబుల్ ఆర్ రింగ్ రోడ్డు రైతులు కేంద్ర జాతీయ రహదారుల శాఖ మంత్రి నితీష్ గట్కారిని కలిశారు. రాయగిరి సమీపంలోని రైతులను ఆదుకోవాలని కోరారు.కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. రైతులకు జరిగే నష్టాన్ని కేంద్ర మంత్రులకు వివరించారు ఈటల రాజేందర్. రైతులకు అన్ని విధాల బిజెపి పార్టీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారని రైతులు తెలిపారు

### మావోయిస్టు అగ్రనేత కల్పన (అలియాస్) సుజాత అరెస్టు



హైదరాబాద్:అక్టోబర్ 17 మావోయిస్టులకు మరో ఎదురుదెబ్బ తగిలింది, మావోయిస్టు కీలక నేత సుజాతను పోలీసులు పట్టుకున్నారు. చికిత్స కోసం కొత్తగూడెంలోని ఆస్పత్రికి వెళ్తుండగా తెలంగాణ పోలీసులు బుధవారం ఆమెను అరెస్ట్ చేసినట్లుగా తెలిసింది. అయితే, ఆమెను ఛత్తీస్గఢ్లోని సుక్మాలో తెలంగాణ పోలీసులు ఆమెను అరెస్టు చేశారని వార్తలు వచ్చాయి.

మావోయిస్టుల ఆపరేషన్ల లో కీలక పాత్ర పోషించిన సుజాతపై మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఛత్తీస్గఢ్లో రూ.కోటికిపై గా రివార్డు ఉంది. ప్రస్తుతం ఆమె బస్తర్ డివిజనల్ కమిటీకి ఇన్చార్జ్ ఉన్నారు. సుక్మా ప్రాంతంలో జరిగిన అనేక ఘటనల్లో ఆమె మోస్ట్ వాంటెడ్గా ఉన్నారు. మహబూబ్ నగర్కు చెందిన కల్పన అలియాస్ సుజాతను పోలీసులు విచారిస్తున్నారు. మావోయిస్టులకు సంబం ధించిన కీలక సమాచా రాన్ని ఆమె నుండి రాబట్టే ప్రయత్నం చేస్తున్నారు పోలీసులు. సుజాత మావోయిస్టు పార్టీలో కీలకమైన పదవుల్లో పని చేశారు.

## ఆసుపత్రుల్లో అవసరమైన పరికరాలకు ప్రతిపాదనలు రూపొందించాలి

**– పి.హెచ్.సి, సబ్ సెంటర్ల ఎన్.క్యూ.ఏ సర్టిఫికేషన్ చర్యలు**

**– జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**

పెద్దపల్లి రోగులకు మెరుగైన వైద్యం అందించేందుకు ఆసుపత్రుల్లో అవసరమైన పరికరాలకు ప్రతిపాదనలు రూపొందించా లని, వాటిని మంజూరు చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. గురువారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్ లో జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు , సబ్ సెంటర్లు, రోగులకు మెరుగైన వైద్యం అందించే దుకు అవసరమైన పరికరాలు కల్పించాల్సిన సౌకర్యాలపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ జిల్లాలో నూతనంగా మంజూరైన 18 ఆరోగ్య సబ్ సెంటర్ల నిర్మాణ పనులు ప్రారంభించి వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ ఈఈ పంచాయతీరాజ్ అధికారిని ఆదేశించారు. జిల్లాలో ఉన్న పి.హెచ్.సి లు, సబ్ సెంటర్ల పరిధిలో రోగులకు మెరుగైన వైద్యం అందించేందు కు అవసరమైన పరికరాలు, సామాగ్రి, మౌలిక వసతుల ప్రతిపాదనలు తయారు చేసి నివేదికను సమర్పించాలని, అవసరమైన నిధులను కేటాయించడం జరుగుతుంద ని జిల్లా కలెక్టర్ వైద్యారోగ్య శాఖ అధికారికి సూచించారు.

మన జిల్లాలో ఉన్న 18 పి.హెచ్.సి లకు గాను ఇప్పటి వరకు 8 పి.హెచ్.సి లు ఎన్.క్యూ.ఏ సర్టిఫికేషన్ పొందాయని, మిగిలిన పి.హెచ్.సి లు ఎన్.క్యూ.ఏ సర్టిఫికేషన్ పొందే దిశగా అవసరమైన చర్యలు తీసుకోవాలని, అదే విధంగా 3 ఆరోగ్య సబ్ సెంటర్ల ఉన్న ఎన్.క్యూ.ఏ సర్టిఫికేషన్ మరో 25 ఆరోగ్య సబ్ సెంటర్లకు వచ్చేలా చూడాలని, దీనికి పాటించాల్సిన అంశాలు, అవసరమైన సామాగ్రి, కల్పించాల్సిన మౌలిక సదుపాయాల పై సంపూర్ణ సహకారం అందించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో ఉన్న కమ్యూనిటీ హెల్త్ సెంటర్ వద్ద ఉన్న సామాగ్రి, ఏక్కడ అవసరమైన వైద్య పరికరాల పై కూడా నివేదిక తయారు చేయాలని, క్రమ పద్ధతిలో మంజూరు చేసి అవసరమైన పరికరాలు ఆసుపత్రిలో అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ప్రమోద్ కుమార్, పంచాయతీ రాజ్ ఈఈ గిరీష్ బాబు, ప్రోగ్రాం అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మంచిర్యాల జిల్లాలో సీఐలు బదిలీలు

మంచిర్యాల పలువురు సీఐలను బదిలీ చేస్తూ బుధవారం సాయంత్రం ఉత్తర్వులు వెలువడ్డాయి. ఐటీ సెల్ రామగుండంలో విధులు నిర్వహిస్తున్న ఎస్ ప్రమోద్ ఎస్ హెచ్ వో మంచిర్యాల (టౌన్) పీఎస్ ఆఫ్ రామగుండం కమిషనరేట్ కు బదిలీ అయ్యారు. ఎస్ హెచ్ వో స్టో మంచిర్యాల (టౌన్) పీఎస్ సీఐ ఆర్ బన్సీలాల్ అటాచ్డ్ ఐజీపీ మల్టీజోన్-1 హైదరాబాద్ కు, వేణు చందర్ సీసీఎస్ రాజన్న సిరిసిల్ల నుంచి శ్రీరాంపూర్ సర్కిల్ ఆఫ్ రామగుండం కమిషనరేటుకు బదిలీ అయ్యారు

## గుర్తు తెలియని వాహనం ఢీకొని ఇద్దరు యువకులు మృతి



కసింకోట వద్ద జాతీయ రహదారిపై సరోజినీ విల్లా ఎదురుగా జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి చెందారు. కసింకోట సర్కిల్ ఇన్స్పెక్టర్ అల్లు స్వామి నాయుడు అందించిన వివరంగా ఉన్నాయి. అనకాపల్లి నుంచి ఎలమంచిలి వైపుకు వెళుతున్న ద్విచక్ర వాహనాన్ని దారిలో కసింకోట వద్ద వెనకనుంచి గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ సంఘటనలో నక్కపల్లి మండలం నెల్లిపూడి గ్రామానికి చెందిన కురం దాస్ ప్రతాప్ (30), అదే గ్రామానికి చెందిన బర్నికుల రాజేష్ (25) బైక్ పైనుంచి కింద పడి తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందారు. మృతులు ఇద్దరు స్నేహితులు. వృత్తిరీత్యా వీరిద్దరూ కార్ డ్రైవర్లు గా పనిచేస్తున్నారు. ఈ నేపథ్యంలో విశాఖ వెళ్లి తిరిగి ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళుతుండగా ప్రమాదం జరిగింది. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించారు. ఈ మేరకు కసింకోట సిఐ అల్లు స్వామి నాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## మంత్రి ధనంజయ్ ముండే భార్య కారుకు ప్రమాదం



**మంత్రి ధనంజయ్ ముండే భార్య కారుకు ప్రమాదం** జరిగింది.. పూణె-సోలాపూర్ హైవేపై ఘోర ప్రమాదం జరిగింది. మహారాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి ధనంజయ్ ముండే భార్య కారు ప్రమాదానికి గురైంది. ఈరోజు తెల్లవారుజామున 4.30 గంటలకు సోర్తాప్‌వాడి సమీపంలో ఆమె కారు ఎదురుగా వస్తున్న బస్సును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో జయశ్రీ ముండే స్వల్పంగా గాయపడ్డారు. ఈ ప్రమాదం తర్వాత ఆమె ముంబై వెళ్లిపోయారు. ఈ ఘటనపై మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.

## మెట్రోపోలీస్ భవనం సీజ్

హైదరాబాద్ మెట్రో పోలీస్ లార్జెను పోలీసులు పూర్తిగా ఆధీనంలోకి తీసుకున్నారు.. లాడ్జి వద్ద భారీ బందోబస్తు పోలీసులు ఏర్పాటు చేశారు. పలు కీలకమైన డాక్యుమెంట్లను పోలీసులు స్వాధీనపరుచుకున్నారు. లార్జెను సీజ్ చేసేందుకు రెవెన్యూ పోలీసు విభాగం అధికారులు చేరుకున్నారు.. కస్టమర్లను బయటికి పంపి అధికారులు సీజ్ చేసారు.

### రేషన్ బియ్యం అక్రమ రవాణాపై ఉక్కుపాదం

అవనిగడ్డ రేషన్ బియ్యం అక్రమ రవాణాపై పోలీసులుఉక్కుపాదం మోపుతున్నారు. రేషన్ బియ్యంతో అక్రమ వ్యాపారం సాగిస్తున్న కోసూరి రాజారావు అనే వ్యక్తిపై సస్పెక్ట్ షీట్ ఓపెన్ చేసారు. ఎమ్మెల్యే సూచనల మేరకు కఠిన చర్యలకు దిగారు అవనిగడ్డ పోలీసులు. రేషన్ బియ్యం కొన్నా, తరలించినా చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు.

### నిమ్మనపల్లెలో మిస్సింగ్.. బెంగుళూరులో హత్య

అన్నమయ్య నిమ్మనపల్లెలో మిస్ అయిన యువకుడు బెంగుళూరులో స్నేహితుని చేతిలో దారుణ హత్యకు గురైయ్యాడు. మదనపల్లె నియోజకవర్గం, నిమ్మనపల్లె మండలం, గుండ్లబురుజు దళితవాడకు చెందిన రమణ కొడుకు బాలాజీ (24) పవణ హల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని దొడ్డనహల్లిలో రామసముద్రంకు చెందిన స్నేహితుడి భార్యతో అక్రమ సంబంధం పెట్టుకున్నాడు. దీంతో స్నేహితుడే బాలాజీనీ దారుణంగా హత్య చేశాడు. గురువారం ఉదయం వెలుగు చూసిన కలకలం రేపుతున్న ఘటన వివరాలను కర్ణాటక బెంగుళూరు, పవణహల్లి పోలీస్ స్టేషన్ ఎస్ఐ సెల్వం తెలిపారు.

### సింధియా డాక్ యార్డ్ వద్ద రహ దారి పై క్రేన్ బోల్తా

విశాఖపట్నం ఎప్పుడూ రద్దీగా వుండే రహదారి పై క్రేన్ తిరగబటంతో ట్రాఫిక్ కు తీవ్ర అంతరాయం రోడ్డు పై వెళ్ళు తున్న సమయంలో క్రేన్ ప్రమాదవ శాత్తు తిరగబడింది ట్రాఫిక్ పోలీసులు క్రేన్ ను తొలిగించే ప్రయత్నాలు సింధియా నుంచి విశాఖ వచ్చే వారంతా ఈ రహ దారి మీదుగానే చేరుకోవాలి. క్రేన్ తిరగబడి రహదారి మూసుకు పోవడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కోన్నారు.

### యాదాద్రిలో నటుడు సుమన్ పూజలు



యాదాద్రి యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి వారిని సినీ నటుడు సుమన్ గురువారం దర్శించుకున్నారు. సుమన్ మాట్లాడుతూ తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ గారు ఎంతో కృషిచేసి యాదాద్రి ఆలయాన్ని మహాద్భుతంగా తీర్చిదిద్దారు. ఈ ఆలయం అభివృద్ధి కాకముందు ఎలా ఉండేదో నాకు తెలుసు . ఎన్నో వ్యయ ప్రయాసలు గూర్చి కేసీఆర్ గారు ఈ ఆలయాన్ని చాలా అందంగా నిర్మించారు. ఎంతో మంది శిల్పులు పనిచేసే ఈ శిల్పాలను ,గోపురాలను చెక్కారు. ఈ గుడిలోపటికి వెళ్తే ఆధ్యాత్మిక ప్రపంచంలో కి వెళ్లినట్లు ఉంది.. ఇంత అద్భుతమైన గుడిని ప్రతి ఒక్కరు కాపాడుకోవాలని అన్నారు.

### వైకాపా లో చేరిన టీడీపీ నేత

తాడేపల్లి వైఎస్సార్సీపీ కేంద్ర కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్సీపీ అధినేత వైయస్ జగన్ సమక్షంలో కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గానికి చెందిన టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ముదునూరి మురళీకృష్ణంరాజు వైఎస్సార్సీపీలో చేరారు. అయన అమలాపురం నియోజకవర్గ టీడీపీ పరిశీలకుడిగా కూడా ఉన్నారు. ఈ కార్యక్రమానికి పలువురు వైఎస్సార్సీపీ సీనియర్ నాయకులు హాజరయ్యారు..

# సినిమా





## ఇప్పటికీ అలాగే ఉన్నా!



అగ్ర కథానాయిక సమంత నటించిన 'సిటాడెల్' వెబ్‌సిరీస్ ట్రైలర్ ఇటీవలే విడుదలైంది. ఇందులో ఆమె గూఢచారి పాత్రలో కనిపించింది. స్పై ఏజెంట్‌గా మారకముందు సినీ నటి కావాలనే ప్రయత్నాలు చేసినట్లు ట్రైలర్‌లో చూపించారు. ఈ సీన్ గురించి ఓ ఇంటర్వ్యూలో సమంత మాట్లాడింది. ఈ సందర్భంగా తన తొలి సినిమా 'ఏ మాయ చేశావే' ఆడిషన్‌ను గుర్తుచేసుకుంది. 'ఈ సిరీస్‌లో నేను ఆడిషన్ ఇచ్చే ఓ సన్నివేశం ఉంది. అందులో నేను నటనరాని అమ్మాయిగా కనిపించాలి.సింగిల్‌టేక్‌లోనే ఆ సీన్ ఓకే అయింది. ఎందుకంటే నేను ఇప్పటికీ యావరేజ్ నటినే (నవ్వుతూ). ఇంకా నటనలో పరిణితి సాధించే పనిలో ఉన్నాను. అయితే నా ఫస్ట్‌మూవీ 'ఏ మాయ చేశావే' కోసం మాత్రం అద్భుతంగా ఆడిషన్ ఇచ్చాను' అని చెప్పింది సమంత. తన కెరీర్‌లో ఎన్నో విజయాలు ఉన్నా అవన్నీ టీమ్ ఎఫర్ట్స్ అని ఆమె పేర్కొంది. 'ఒక సినిమా వెనక ఎంతో మంది నిపుణుల కృషి ఉంటుంది. మంచి టీమ్ ఉన్నప్పుడే మన ప్రతిభ బయటకు వస్తుంది. అదృష్టం కొద్దీ నేను ప్రతిభావంతులైన నటీనటులు, సాంకేతిక నిపుణులతో కలిసి పనిచేశాను' అని తెలిపింది. 'సిటాడెల్' సిరీస్ నవంబర్ 7 నుంచి అమెజాన్ ప్రైమ్‌లో స్ట్రీమింగ్ కానుంది.

## శరీరం చెప్పిన మాట వినండి..?



సినీ సెలబ్రిటీలకు సోషల్ మీడియాలో ఏ రేంజర్ క్రేజ్ ఉంటుందో ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. మరీ ముఖ్యంగా హీరోయిన్ల గురించి అయితే తెలుసుకునేందుకు అభిమానులు అందరూ కూడా ఎంతగానో ఆసక్తిని కనపరుస్తూ ఉంటారు. హీరోయిన్లు కూడా అభిమానులకు దగ్గరగా ఉంటూ ఎప్పుడు తమ అప్డేట్లను చెబుతూ ఉంటారు. కొంతమంది హాట్ ఫోటోలను సోషల్ మీడియాలో పోస్ట్ చేసి ఫ్యాన్స్ అందరికీ కిక్కెక్కిస్తూ ఉంటారు అన్న విషయం తెలిసిందే. అందుకే అటు సోషల్ మీడియాలో హీరోయిన్లకు మిలియన్ల మంది ఫాలోవర్లు ఉండడం కూడా చూస్తూ ఉంటాం. అందుకే ఇక ఇండస్ట్రీలో స్టార్ హీరోయిన్ గా ఎదిగిన వారి గురించి ఏదైనా మ్యాటర్ ఇంటర్నెట్ లోకి వచ్చిందంటే చాలు అది కాస్త వైరల్ గా మారిపోతూ ఉంటుంది. ఆ విషయం గురించి తెలుసుకునేందుకు అందరూ ఆసక్తిని కనబరుస్తూ ఉంటారు అని చెప్పాలి. అయితే ఇటీవల స్టార్ హీరోయిన్రకుల్ ప్రీత్ సింగ్ గురించి ఒక ఇంట్రెస్టింగ్ న్యూస్ ఇంటర్నెట్లో చక్కర్లు కొడుతుంది. ఇటీవలే రకుల్ జిమ్ లో వర్కౌట్ లు చేస్తున్న సమయంలో గాయపడింది అన్న విషయం తెలిసిందే. ఏకంగా 80 కేజీల బరువు ఎత్తుతున్న సమయంలో ఆమె వెన్నుముకకు గాయమైంది. అయితే గాయమైన వెంటనే హాస్పిటల్కు వెళ్లకుండా నొప్పిని లెక్క చేయకుండా షూటింగ్స్ లో పాల్గొంటూ వచ్చింది రకుల్ ప్రీత్ సింగ్. దీంతో ఇక గాయం తీవ్రతరం కావడంతో చివరికి ఆసుపత్రి పాలు అయింది ఫలితంగా ఆరు రోజులుగా ఆమె మంచానికే పరిమితమైంది. అయితే ఇక ఇదే విషయం గురించి ఇటీవలే మాట్లాడిన రకుల్ ఆసక్తికర విషయం చెప్పుకొచ్చింది. నా శరీరం చెప్పిన మాట వినకుండా నేను బరువులు ఎత్తి స్టుపిడ్ పనిచేశాను. చివరికి ఇలా మంచాన పడ్డాను. కానీ మీరు మాత్రం మీ శరీరం చెప్పిన మాట వినండి. శరీరం చెబితే దాన్ని అస్సలు అశ్రద్ధ చేయవద్దు అంటూ రకుల్ అభిమానులకు ఒక సూచన చేసింది.

## ఆ ఇద్దరు ఏం చేశారు?




అర్జున్, జె.డి చక్రవర్తి కాంబినేషన్‌లో రూపొందిన చిత్రం 'ఇద్దరు'. డి.ఎస్.రెడ్డి సమర్పణలో ఎఫ్ ఎస్ ఎంటర్టైన్మెంట్స్ పై ఎస్ ఎస్ సమీర్ దర్శకత్వంలో మహమ్మద్ ఫర్హీన్ ఫాతిమ నిర్మించారు. ఈ సినిమా ఈనెల 18న వరల్డ్ వైడ్‌గా రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా నిర్మాత డి ఎస్ రెడ్డి మాట్లాడుతూ, 'ఎక్కడా కాంప్రమైజ్ అవ్వకుండా మంచి క్వాలిటీతో తీసిన సినిమా ఇది. ప్రేక్షకులందరూ ఈ సినిమా చూసి మంచి సక్సెస్ చేయాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను' అని అన్నారు. 'నాకు ఈ అవకాశం ఇచ్చిన మా డైరెక్టర్ సమీర్‌కి కృతజ్ఞతలు. అర్జున్, చక్రవర్తి నాకు చాలా సపోర్ట్ చేశారు. ఇందులో ఓ మంచి పాత్ర చేశాను. అది మీ అందరికీ బాగా నచ్చుతుందని ఆశిస్తున్నాను' అని హీరోయిన్ సోని చరిష్ట చెప్పారు. నిర్మాత, దర్శకుడు సమీర్ మాట్లాడుతూ, 'మమ్మల్ని సపోర్ట్ చేసిన ప్రసన్న కుమార్, రామకృష్ణ గౌడ్, జేవిఆర్, రవి, డిఎస్ రెడ్డికి కృతజ్ఞతలు. ఈ సినిమాని మంచి మంచి లొకేషన్స్‌లో, హై క్వాలిటీలో చేశాం. అర్జున్, చక్రవర్తి పోటీ పడి మరీ నటించారు. హీరోయిన్స్‌గా రాధిక కుమారస్వామి, సోనీ చాలా బాగా నటించారు. కళాతపస్వి కె. విశ్వనాథ్‌కి ఇది చివరి సినిమా. అమీర్ ఖాన్ తమ్ముడు ఫైజల్ ఖాన్ కూడా నటించారు' అని తెలిపారు.

## 15 ఎకరాల్లో భారీ సెట్



హీరో శర్వానంద్ ఇటీవలే తన తొలి పాన్ ఇండియా ప్రాజెక్ట్ 'శర్వా38'ని అనౌన్స్ చేశారు. సంపత్ నంది దర్శకత్వంలో ఈ మూవీని శ్రీ సత్యసాయి ఆర్ట్స్ బ్యానర్‌పై కె.కె.రాధామోహన్ ప్రొడక్షన్ నెం. 15గా నిర్మించనున్నారు. లక్ష్మీ రాధామోహన్ సమర్పిస్తున్నారు. 1960లో ఉత్తర తెలంగాణ, తెలంగాణ-మహారాష్ట్ర సరిహద్దు లోని రూరల్ బ్యాక్‌డ్రాప్‌లో సాగే పల్సేటింగ్ పీరియడ్ యాక్షన్ డ్రామాతో ఈ సినిమాని రూపొందిస్తున్నారు. బుధవారం చిత్ర బృందం భూమి పూజతో సెట్ వర్క్‌ను ప్రారం భించింది. ఉత్తర తెలంగాణ స్వరూపాన్ని, ఆ ప్రపంచాన్ని, కల్చర్‌ని రీక్రియేట్ చేసే మ్యాసివ్ సెట్‌ని హైదరాబాద్ సమీపంలోని 15 ఎకరాల విస్తీర్ణంలో హై బడ్జెట్‌తో ఆర్ట్ డైరెక్టర్ కిరణ్ కుమార్ మన్నె రూపొందించారు. ఈ సెట్‌లో కొన్ని అద్భుతమైన సన్నివేశాలను చిత్రీకరించనున్నారు. అలాగే మునుపెన్నడూ చూడని పాత్రలో శర్వానంద్ కనిపించ నున్నారు. తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో ఈ సినిమా విడుదల కానుంది. శర్వానంద్, సంపత్‌నంది వంటి డిఫరెంట్ కాంబినేషన్‌లో వస్తున్న ఈ పాన్ ఇండియా ప్రాజెక్ట్‌పై అందరిలోనూ భారీ అంచనాలు ఉన్నాయి. పైగా ఇది 1960 బ్యాక్‌డ్రాప్ కావడంతో మరింత ఆసక్తి రేకెత్తిస్తోంది. ఈ చిత్రాన్ని ఎక్కడా రాజీపడకుండా నిర్మాత కె.కె.రాధామోహన్ నిర్మిస్తున్నారు. ఓ సరికొత్త నేపథ్యంతో రూపొందుతున్న ఈ చిత్రం ప్రేక్షకులకు ఓ మంచి అనుభూతిని అందిస్తుందనే నమ్మకాన్ని చిత్ర బృందం వ్యక్తం చేసింది. ఈ చిత్రానికి డీవోపీ: సౌందర్ రాజన్, సంగీతం: భీమ్స్ సిసిరోలియో, ఆర్ట్ డైరెక్టర్: కిరణ్ కుమార్ మన్నె.

## బన్నీ కోసం 1600 కి.మీ. సైకిల్ ప్రయాణం



సినీ తారలకు అభిమానులు వుండటం అనేది సర్వసాధారణం. అయితే కొంత మంది అభిమానించడంతో పాటు తమకు మనసుకు నచ్చిన తారలను ఆరాధిస్తుంటారు. సినిమాలో వాళ్ల నటనతో పాటు వ్యక్తిగత జీవితంలో వాళ్ల మనసు, మంచితనం కూడా దీనిపై ఆధారపడి వుంటుంది. ఇలా ఐకాన్‌స్టార్ అల్లు అర్జున్‌కు కేవలం అభిమానులే కాదు ఆర్మీతో పాటు ఆయనన విపరీతంగా ఆరాధించే వాళ్లు కూడా వున్నారు. అందుకు అల్లు అర్జున్ అభిమానులతో ఎంతో ప్రేమగా వుండటమే కారణం. ఇక పుష్ప-2 చిత్రంతో భారతదేశంతో పాటు ఇతర దేశాల్లో కూడా అల్లు అర్జున్ నటనకు ఫిదా అయిపోయి ఆయనకు అభిమానులుగా మారారు. పుష్ప చిత్రంతో తగ్గేదెలే అంటూ ఆయన మేనరిజం స్వాగ్‌కు అందరూ పడిపోయారు.ఇలా అల్లు అర్జున్‌ను అమితంగా ఇష్టపడే ఓ ఉత్తరప్రదేశ్ అభిమాని ఉత్తరప్రదేశ్‌లోని అలీఘర్ నుండి ఐకాన్‌స్టార్‌ను కలవడానికి సైకిల్‌పై 1600 కిలోమీటర్లు ప్రయాణించి అల్లు అర్జున్‌ను చేరుకున్నాడు. తన అభిమాన హీరోని కలిసిన అతను కాసేపు ఆయనతో చిట్ చాట్ చేశాడు. వైరల్‌గా మారిన ఈ వీడియోలో అల్లు అర్జున్ ఆశ్చర్యాన్ని వ్యక్తం చేయడం చూడొచ్చు. తమ అభిమాన హీరోని కలిసిన ఆ అభిమాని ఆనందాన్ని మాటల్లో వర్ణించలేనిది. అల్లు అర్జున్ తన నిజమైన హీరోగా అభివర్ణించడం, అల్లు అర్జున్‌ను కలవడం తన జీవితంలో మరుపురాని అనుభూతిగా ఆ అభిమాని వర్ణించాడు. అంతేకాదు సైక్లింగ్ మొదలుపెట్టే ముందు చాలా సార్లు హనుమాన్ చాలిసా చదివానని ఈ సందర్భంగా ఆ అభిమాని తెలిపాడు.

## ఈసారి అఖండ తాండవమే..



బాలకృష్ణ, బోయపాటి శ్రీను కాంబినేషన్ 'సింహ, లెజెండ్, అఖండ' సినిమాలతో హ్యాట్రిక్ బ్లాక్‌బస్టర్స్ అందుకున్నారు. తాజాగా ఈ కాంబో 4వసారి కలిసి పని చేయనున్నారు. వీరి కాంబినేషన్‌లో వచ్చిన 'అఖండ' బాక్సాఫీస్ రికార్డులను బద్దలు కొట్టింది. దీనికి సీక్వెల్‌గా 'అఖండ 2'ని తెరకెక్కించబోతున్నారు. ఎం. తేజస్విని నందమూరి సమర్పకురాలిగా 14 రీల్స్ ప్లస్ బ్యానర్‌పై రామ్ ఆచంట, గోపీచంద్ ఆచంట పాన్ ఇండియా మూవీగా నిర్మిస్తున్నారు. ఈ సినిమా పలువురు అతిథుల సమక్షంలో బుధవారం ఘనంగా ప్రారంభమైంది. ముహూర్తం షాట్‌కు తేజస్విని కెమెరా స్విచాన్ చేయగా, బ్రాహ్మణి క్లాప్ కొట్టారు. ముహూర్తం షాట్‌కు బాలకృష్ణ పవర్‌ఫుల్ డైలాగ్ చెప్పారు. 'అఖండ'లో హీరోయిన్‌గా నటించిన ప్రగ్యా జైస్వాల్ ఈ సీక్వెల్‌లో పార్ట్ అయ్యారు. కథలో ఆధ్యాత్మిక అంశాలను తెలిపే 'అఖండ 2' టైటిల్ థీమ్‌ను నందమూరి రామకృష్ణ ఆవిష్కరించారు. ఈ చిత్ర రెగ్యులర్ షూటింగ్ త్వరలో ప్రారంభం కానుంది. ఈ చిత్రానికి రచన, దర్శకత్వం: బోయపాటి శ్రీను, నిర్మాతలు: రామ్ ఆచంట, గోపి ఆచంట, డీవోపీ: సి రాంప్రసాద్, సంతోష్ డి డెటాకే, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: కోటి పరుచూరి, ఆర్ట్: ఏఎస్ ప్రకాష్, ఎడిటర్: తమ్మిరాజు.

## జిల్ నుండి గోపీచంద్‌కు అలాంటి అనుభవం



టాలీవుడ్ ఇండస్ట్రీ లో నటుడిగా మంచి గుర్తింపును సంపాదించుకున్న గోపీచంద్ ఈ మధ్య కాలంలో మాత్రం మంచి విజయాలను అందుకోవడం లేదు. కెరియర్ ప్రారంభంలో హీరోగా నటించి మొదటి సినిమాతో అపజయాన్ని అందుకున్న ఈయన ఆ తర్వాత విలన్ పాత్రలలో నటించి సూపర్ సక్సెస్ అయ్యాడు. ఆ తర్వాత మళ్లీ హీరో గా కెరియర్ టర్న్ తీసుకున్న ఈయన అక్కడ కూడా సూపర్ సక్సెస్ అయ్యాడు. కానీ ఈ మధ్య కాలంలో మాత్రం గోపీచంద్ సరైన విజయాలను అందుకోవడంలో చాలా వెనుకబడిపోయాడు. జిల్మూవీ దగ్గర నుండి గోపీచంద్ చాలా అపజాయలను అందుకుంటూ వస్తున్నాడు. జిల్ సినిమా మంచి అంచనాల నడుమ విడుదల అయ్యి బాక్స్ ఆఫీస్ దగ్గర కేవలం యావరేజ్ విజయాన్ని మాత్రమే అందుకుంది. ఆ తరువాత సౌఖ్యం సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన గోపీచంద్ కు ఆ సినిమాతో ఫ్లాప్ దక్కింది. ఇక ఆ తర్వాత గౌతమ్ నంద సినిమా బాగానే ఉన్నప్పటికీ ఆ సమయంలో ఈ సినిమా ప్రేక్షకులను పెద్దగా ఆకట్టుకోలేదు. దానితో ఈ సినిమా కూడా బాక్స్ ఆఫీస్ దగ్గర ఫ్లాప్ అయ్యింది. ఆ తర్వాత ఆక్సిజన్ సినిమాతో కూడా గోపీచంద్ ఫ్లాప్ ను అందుకున్నాడు. ఇక పంతం సినిమా యావరేజ్ విజయాన్ని అందుకుంది. చాణక్యమూవీ కూడా ఫ్లాప్ అయ్యింది. సిటీమార్ సినిమా మాత్రం కాస్త మంచి విజయాన్ని అందుకుంది. ఆరడుగుల బుల్లెట్టు పక్కా , కమర్షియల్ , రామబాణం సినిమాలు వరుసగా ఫ్లాప్ లు అయ్యాయి. ఇక బీమా సినిమా పర్వాలేదు అనే స్థాయి విజయాన్ని అందుకుంది. తాజాగా గోపీచంద్ హీరోగా రూపొందిన విశ్వం సినిమా థియేటర్లలో విడుదల అయింది. ప్రస్తుతం ఈ సినిమా కూడా భారీ స్థాయి కలెక్షన్లను రాబట్టడం లేదు. మరి ఈ సినిమాతో గోపీచంద్ ఎలాంటి విజయాన్ని అందుకుంటాడో తెలియాలి అంటే మరికొన్ని రోజులు వేచి చూడాల్సిందే.



# క్రీడలు



## ఫుట్‌బాల్ చరిత్రలో దిగ్గజ ప్లేయర్



అంతర్జాతీయ ఫుట్‌బాల్ అత్యంత ప్రతిష్టాత్మకమైన ఈవెంట్‌లలో ఒకటిగా పేరుగాంచింది. క్రికెట్‌లోనే కాదు.. ఫుట్‌బాల్ గేమ్‌లోనూ ప్రతీ క్రీడాకారుడు జాతీయ జెర్సీని ధరించి దేశానికి ప్రాతినిధ్యం వహించాలని కోరుకుంటుంటారు. అంతర్జాతీయ స్థాయిలో అద్భుత ప్రదర్శన చేయాలని కోరుకుంటారు. చాలా మంది ఆటగాళ్ళు క్లబ్ స్థాయిలోనూ.. దేశం తరపున గుర్తింపు పొందాలని ఆశిస్తుంటారు. దేశం కోసం ఒక్క గోల్ అయినా సాధించాలని ప్రయత్నిస్తుంటారు. అయితే, కొద్దిమంది మాత్రమే అంతర్జాతీయ వేదికపై నిలకడగా రాణిస్తుంటారు. ఈ క్రమంలో పురుషుల అంతర్జాతీయ ఫుట్‌బాల్‌లో హ్యాట్రిక్‌లతో అరుదైన ఘనత సాధించిన ఐదుగురు ఆటగాళ్లను ఓసారి చూద్దాం..

5. పీలే %-% 7 హ్యాట్రిక్‌లు: బ్రెజిల్, శాంటోస్ రెండింటి తరపున అద్భుతమైన ప్రదర్శనలతో పీలే ఖ్యాతి గడించాడు. 1958లో బ్రెజిల్‌కు మొట్టమొదటి ప్రపంచ కప్ టైటిల్ అందించాడు. ఈసమయంలో ఆయన వయసు కేవలం 18 సంవత్సరాలు మాత్రమే. అతను ఫైనల్‌లో కూడా స్కోర్ చేశాడు. ప్రపంచ కప్ ప్రధాన ఈవెంట్‌లో స్కోర్ చేసిన మొదటి యువకుడిగా నిలిచాడు. బ్రెజిల్ తరపున 92 మ్యాచ్‌లలో 77 గోల్స్ చేశాడు. తద్వారా అత్యధిక ప్రపంచ కప్ టైటిల్‌లను కలిగి ఉన్న జట్టుకు ఆల్-టైమ్ లీడింగ్ స్కోరర్‌గా నిలిచాడు. దీంతో పాటు అంతర్జాతీయ వేదికలపై ఏడు హ్యాట్రిక్‌లు నమోదు చేశాడు. 4. అలీ డేయ్ - 8 హ్యాట్రిక్‌లు: ఇరానియన్ లెజెండ్ అలీ దాయి ఆసియా ఫుట్‌బాల్ సర్టిఫైడ్ లెజెండ్‌గా పేరుగాంచాడు. అతను క్లబ్ స్థాయిలో హెర్తా బెర్లిన్, బేయర్న్ మ్యూనిచ్ కోసం ఆడాడు. ఇరాన్ జాతీయ జట్టుతో ఆడే సమయంలోనే లెజెండరీ హోదా పొందాడు. అలీ డేయ్ తన దేశం కోసం మొత్తం 149 మ్యాచ్‌లు ఆడి, 109 గోల్స్ చేశాడు. ఇందులో మొత్తం 8 హ్యాట్రిక్స్ సాధించాడు. 3. స్వెన్ రైడెల్ - 9 హ్యాట్రిక్‌లు: స్వీడిష్ ఫుట్‌బాల్ దిగ్గజాలలో ఒకరైన స్వెన్ రైడెల్ జాబితాలో మూడవ స్థానంలో ఉన్నాడు. అతను తన అంతర్జాతీయ ఫుట్‌బాల్ కెరీర్‌లో 43 మ్యాచ్‌లలో 49 గోల్స్ చేశాడు. ఈ 49 గోల్స్‌లో అతను తొమ్మిది హ్యాట్రిక్‌లు సాధించడం విశేషం. 2. క్రిస్టియానో రొనాల్డో - 10 హ్యాట్రిక్‌లు: క్రిస్టియానో రొనాల్డో లేకుండా గోల్స్, రికార్డుల గురించి చర్చించడం అంటే కష్టమే. పోర్చుగీస్ గోల్ మెషిన్ పురుషుల అంతర్జాతీయ ఫుట్‌బాల్‌లో అత్యధిక హ్యాట్రిక్‌లు సాధించిన రికార్డును బుధవారం లియోనెల్ మెస్సీ అతనితో సమం చేశాడు. 39 ఏళ్ల రొనాల్డో అంతర్జాతీయ ఫుట్‌బాల్ (133), ఫుట్‌బాల్ చరిత్రలో (906) అత్యధిక గోల్స్ చేసిన ఆటగాడిగా నిలిచాడు. అతను తన కెరీర్‌లో తన దేశం కోసం 10 అంతర్జాతీయ హ్యాట్రిక్‌లతో సహా అద్భుతమైన 58 హ్యాట్రిక్‌లు సాధించాడు.

## ప్రపంచ రికార్డ్ సృష్టించిన ప్లేయర్



పాకిస్థాన్‌తో ముల్తాన్ వేదికగా జరుగుతున్న 2వ టెస్టు మ్యాచ్‌లో ఇంగ్లండ్ పేసర్ బెన్ డకెట్ అద్భుత సెంచరీతో ఆకట్టుకున్నాడు. ఈ క్రమంలో న్యూజిలాండ్ ఆటగాడి ప్రపంచ రికార్డును బద్దలు కొట్టాడు. అదేంటో ఇప్పుడు చూద్దాం. 147 ఏళ్ల టెస్టు చరిత్రలో అత్యంత వేగంగా 2000 పరుగులు చేసిన ఆటగాడిగా ఇంగ్లండ్ ఓపెనర్ బెన్ డకెట్ ప్రపంచ రికార్డు సృష్టించాడు. డకెట్ అతి తక్కువ డెలివరీలను ఎదుర్కొని ఈ రికార్డును నెలకొల్పాడు. ముల్తాన్‌లో పాకిస్థాన్‌తో జరుగుతున్న 2వ టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో బెన్ డకెట్ సెంచరీ సాధించాడు. ఈ మ్యాచ్‌లో డకెట్ 129 బంతులు ఎదుర్కొని 16 ఫోర్లతో 114 పరుగులు చేశాడు. ఈ సెంచరీతో ఇంగ్లండ్ బ్యాట్స్‌మెన్ టెస్టుల్లో 2000 పరుగులు పూర్తి చేసుకున్నాడు. టెస్టు క్రికెట్‌లో ఇప్పటివరకు 2293 బంతులు ఎదుర్కొన్న బెన్ డకెట్ 4 సెంచరీలు, 11 అర్ధసెంచరీలతో 2026 పరుగులు చేశాడు. దీంతో టెస్టు చరిత్రలోనే అతి తక్కువ బంతుల్లో 2000 పరుగులు చేసిన బ్యాట్స్‌మెన్‌గా నిలిచాడు. అంతకుముందు ఈ ప్రపంచ రికార్డు న్యూజిలాండ్ ఆటగాడు టిమ్ సౌథీ పేరిట ఉండేది. టిమ్ సౌథీ కేవలం 2418 బంతుల్లో 2000 పరుగులు పూర్తి చేయడం ద్వారా ఈ రికార్డును లిఖించాడు. ఇప్పుడు ఈ రికార్డు ఇంగ్లండ్ ఎడమచేతి వాటం బ్యాట్స్‌మెన్ పేరిట ఉంది. టెస్టు క్రికెట్‌లో తుఫాన్ బ్యాటింగ్‌తో అదరగొట్టే బెన్ డకెట్.. తన దూకుడు ఆటతో సరికొత్త ప్రపంచ రికార్డు సృష్టించాడు. దీంతో 147 ఏళ్ల టెస్టు చరిత్రలో అతి తక్కువ బంతుల్లో 2000 పరుగులు చేసిన బ్యాట్స్‌మెన్‌గా నిలిచాడు. ముల్తాన్ టెస్టులో టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన పాకిస్థాన్ తొలి ఇన్నింగ్స్‌లో 366 పరుగులు చేసి ఆలౌటైంది. దీంతో బెన్ డకెట్ సెంచరీతో తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన ఇంగ్లండ్ జట్టు 2వ రోజు ముగిసే సమయానికి 6 వికెట్లు కోల్పోయి 239 పరుగులు చేసింది.

## విరాట్ కోహ్లీ ముందు అరుదైన ఘనత..



బెంగళూరులోని ఎం చిన్నస్వామి స్టేడియంలో భారత్-న్యూజిలాండ్ జట్ల మధ్య తొలి టెస్టు జరుగుతోంది. వర్షం కారణంగా తొలిరోజు ఆట రద్దయింది. భారత స్టార్ బ్యాట్స్‌మెన్ విరాట్ కోహ్లీకి ఈ మ్యాచ్ చాలా ముఖ్యమైనది. ఎందుకంటే ఈ మ్యాచ్‌లో అతను టెస్టులో 9 వేల పరుగులు పూర్తి చేసే అవకాశం ఉంది. కోహ్లీ ఇప్పటివరకు 115 మ్యాచ్‌లు ఆడాడు. ఇందులో 8947 పరుగులు చేశాడు. ఈ విధంగా తొమ్మిది వేల పరుగులు పూర్తి చేసేందుకు 53 పరుగులు కావాలి. అలా చేయడంలో విరాట్ విజయం సాధిస్తే, సచిన్ టెండూల్కర్, రాహుల్ ద్రవిడ్, గవాస్కర్ తర్వాత ఈ ఘనత సాధించిన నాలుగో బ్యాట్స్‌మెన్‌గా రికార్డులకెక్కవచ్చు. ఓవరాల్‌గా విరాట్ టెస్టుల్లో 9 వేలు లేదా అంతకంటే ఎక్కువ పరుగులు చేసిన 18వ బ్యాట్స్‌మెన్‌గా నిలవనున్నాడు. భారత మాజీ కెప్టెన్ విరాట్ కోహ్లీ తన టెస్టు కెరీర్‌లో ఇప్పటివరకు 29 సెంచరీలు, ఏడు డబుల్ సెంచరీలు సాధించాడు. ఈ కాలంలో అతని అత్యుత్తమ స్కోరు 254. న్యూజిలాండ్‌తో సిరీస్‌కు ముందు భారత క్రికెట్ జట్టు కోచ్ గౌతమ్ గంభీర్ విరాట్‌ను ప్రశంసించాడు. అతని పరుగుల ఆకలి మునుపటిలానే ఉందని చెప్పాడు.

సచిన్ 200 మ్యాచ్‌ల్లో 15921 పరుగులతో టెస్టు ఫార్మాట్‌లో భారత్ తరఫున అత్యధిక పరుగులు చేశాడు. ఈ జాబితాలో ద్రవిడ్ 13265 పరుగులతో రెండో స్థానంలో ఉన్నాడు. 163 టెస్టు మ్యాచ్‌లు ఆడి ఈ ఘనత సాధించాడు. గవాస్కర్ గురించి మాట్లాడుకుంటే అతను 125 టెస్ట్ మ్యాచ్‌లలో 10122 పరుగులు చేశాడు. ఇది కాకుండా బెంగళూరులో న్యూజిలాండ్‌పై కోహ్లీ 1000 పరుగులు కూడా పూర్తి చేయగలడు. ఇప్పటి వరకు 11 మ్యాచ్‌లు ఆడి 866 పరుగులు చేశాడు. న్యూజిలాండ్‌పై 1,000 పరుగులకు చేరుకోవడానికి కోహ్లీకి 134 పరుగులు మాత్రమే అవసరం. కోహ్లీ ఈ పని చేయగలిగితే అతను ఈ విషయంలో చెతేశ్వర్ పుజారా, వీరేంద్ర సెహ్వాగ్‌లను వెనక్కి నెట్టగలడు. 2024లో కోహ్లీ పెద్దగా పరుగులు చేయలేదు. 16 మ్యాచ్‌ల్లో ఒక్కసారి మాత్రమే 50కి పైగా పరుగులు చేసిన పరిస్థితులు నెలకొన్నాయి. న్యూజిలాండ్‌తో సిరీస్‌లో పేలవమైన ఫామ్ నుంచి బయటపడ్డాలని కోహ్లీ భావిస్తున్నాడు.

## సంచలన నిజం చెప్పిన పాక్ కెప్టెన్?



ఇండియా, పాకిస్తాన్ జట్ల మధ్య మ్యాచ్ జరిగితే ఉత్కంఠ ఏ లెవెల్లో ఉంటుందో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. సాధారణంగా రెండు టీమ్స్ మధ్య మ్యాచ్ జరిగినప్పుడు కేవలం ఆ రెండు దేశాల క్రికెట్ ప్రేక్షకులు మాత్రమే మ్యాచ్ వీక్షించడం చూస్తూ ఉంటాం. కానీ ఇండియా, పాకిస్తాన్ మ్యాచ్ వస్తుందంటే క్రికెట్ ప్రపంచం మొత్తం అన్ని పనులను పక్కన పెట్టేసి.. ఈ మ్యాచ్ చూడటానికి ఇష్టపడుతూ ఉంటుంది. అందుకే ఈ దయాదుల పోరును హై వోల్టేజ్ మ్యాచ్ అని కూడా పిలుచుకుంటూ ఉంటారు. అయితే భారత్, పాకిస్తాన్ మధ్య క్రికెట్ సంబంధాలపై నిషేధం కొనసాగుతున్న నేపథ్యంలో.. కేవలం ఐసీసీ టోర్నీలలో మాత్రమే ఇక ఈ రెండు టీమ్స్ మధ్య మ్యాచులు జరగడం చూస్తూ ఉన్నాం. అయితే ఎన్నిసార్లు మ్యాచులు జరిగిన కూడా ఉత్కంఠ మాత్రం ప్రతిసారి రెట్టింపు అవుతూ వస్తూ ఉంటుంది. కానీ ఎక్కడ తగ్గదు. అయితే మ్యాచ్ జరుగుతున్నప్పుడు.. ప్రేక్షకులకు మాత్రమే కాదు.. గ్రౌండ్లో మ్యాచ్ ఆడుతున్న ఆటగాళ్లకి కూడా ఒత్తిడి తీవ్రంగానే ఉంటుంది అని చెప్పాలి. ఈ క్రమంలోనే ఇండియాతో మ్యాచ్ గురించి ఇటీవల పాకిస్తాన్ కెప్టెన్ చేసిన కామెంట్స్ కాస్త వైరల్ గా మారిపోయాయి. ఎమర్జింగ్ టీమ్స్ ఆసియా కప్ లో భాగంగా భారత్ ఏ తో పాకిస్తాన్ ఏ జట్టు ఈనెల 19వ తేదీన తలబడబోతుంది. ఈ నేపథ్యంలో తమ డ్రెస్సింగ్ రూమ్ లో టీమిండియా గురించి మాట్లాడటం నిషేధించాము అంటూ పాకిస్తాన్ ఏ జట్టు కెప్టెన్ మహమ్మద్ హారీస్ చెప్పుకొచ్చాడు. టీమిండియా తో ఆట అంటేనే తమకు ఒత్తిడి కాస్త ఎక్కువగా ఉంటుందని.. అందుకే టీమిండియా గురించి డ్రెస్సింగ్ రూమ్ లో చర్చించుకోవడంపై నిషేధం విధించినట్లు చెప్పుకొచ్చాడు. కాగా తిలక్ వర్మ కెప్టెన్సీలో ఇండియా ఏ జట్టు బరిలోకి దిగుతూ ఉండగా జట్టులో అభిషేక్, రాహుల్ చాహర్ లాంటి ఆటగాళ్లు ఉన్నారు.

## జైస్వాల్‌కు 4వ ర్యాంక్



అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసిసి) తాజా టెస్ట్ ర్యాంకింగ్స్‌లో జైస్వాల్ 4వ ర్యాంక్‌లో నిలిచాడు. బ్యాటర్ల విభాగంలో కోహ్లీ, రిషబ్ పంత్ టాప్-10లో చోటు దక్కించుకున్నారు. జైస్వాల్ 792రేటింగ్ పాయింట్లతో 4వ స్థానంలో నిలువగా.. ఇంగ్లండ్ కెప్టెన్ హారీ బ్రూక్ 829 రేటింగ్ పాయింట్లతో జైస్వాల్‌ను అధిగమించి మూ డో స్థానానికి ఎగబాకాడు. కోహ్లీ(724పాయింట్లు) 7వ స్థానంలో నిలువగా.. టీమిండియా వికెట్ కీపర్ రిషబ్ పంత్(718) 9వ స్థానంలో ఉన్నాడు. ఐసిసి బుధవారం విడుదల చేసిన టెస్ట్ ర్యాంకింగ్స్‌లో ఇంగ్లండ్ ఆటగాళ్ల హవా కొనసాగింది. ఆ జట్టు స్టార్ ఆటగాళ్లు జో రూట్, హ్యారీ బ్రూక్ తాజా ర్యాంకింగ్స్‌లో టాప్-3లో నిలిచారు. పాకిస్తాన్‌తో ముగిసిన తొలి టెస్ట్‌లో హ్యారీ బ్రూక్ ట్రిపుల్ సెంచరీ, జో రూట్ డబుల్ సెంచరీ చేసిన విషయం తెలిసిందే. ఈ ప్రదర్శనలతో రూట్ కెరీర్ అత్యుత్తమ రేటింగ్ పాయింట్లు (932) సాధించి టాప్ ర్యాంక్‌ను సుస్థిరం చేసుకున్నాడు. బ్రూక్ ఏకంగా 11 స్థానాలు ఎగబాకి కేన్ విలియమ్సన్‌తో సహా రెండో స్థానాన్ని ఆక్రమించాడు. రూట్, బ్రూక్ దెబ్బకు భారత ఆటగాళ్లు యశస్వి జైస్వాల్, విరాట్ కోహ్లీ చెరో స్థానం కోల్పోయి నాలుగు, ఏడు స్థానాల్లో ఉన్నారు. ఇంగ్లండ్‌తో టెస్ట్ మ్యాచ్‌లో సెంచరీలు చేసిన పాక్ ఆటగాళ్లు అఘా సల్మాన్, షాన్ మసూద్ 11, 12 స్థానాలు మెరుగపర్చుకుని 22, 51వ స్థానాలకు ఎగబాకారు. టెస్ట్ బౌలర్ల ర్యాంకింగ్స్ విషయానికొస్తే.. ఈ విభాగం టాప్-10లో చెప్పుకోదగ్గ మార్పులేమీ జరగలేదు. బుమ్రా, అశ్విన్ టాప్-2లో కొనసాగుతుండగా.. రవీంద్ర జడేజా ఆరు, కుల్దీప్ 16 స్థానాల్లో ఉన్నారు. పాక్‌తో టెస్ట్ మ్యాచ్‌లో మెరుగైన ప్రదర్శన కనబర్చిన జాక్ లీచ్ తొమ్మిది స్థానాలు మెరుగుపర్చుకుని 28వ స్థానానికి ఎగబాకాడు. టెస్ట్ ఆల్‌రౌండర్ల విభాగంలో జడేజా, అశ్విన్ టాప్-2లో కొనసాగుతుండగా.. జో రూట్ ఓ స్థానం మెరుగుపర్చుకుని మూడో స్థానానికి చేరాడు.

## హిట్‌మ్యాన్ ఇప్పుడు ఫిట్ మ్యాన్




టీమిండియా కెప్టెన్ గా కొనసాగుతున్న రోహిత్ శర్మ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. కేవలం ఇండియన్ క్రికెట్లో మాత్రమే కాదు వరల్డ్ క్రికెట్లో కూడా తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపును సంపాదించుకున్నాడు రోహిత్ శర్మ. ప్రపంచ క్రికెట్లో ఉన్న అత్యుత్తమ ఆటగాళ్లలో రోహిత్ శర్మ పేరు మొదటి వరుసలోనే వినిపిస్తూ ఉంటుంది అని చెప్పాలి. ఇక ఇండియన్ క్రికెట్లో డబుల్ సెంచరీల ధీరుడిగా సిక్సర్ల వీరుడుగా అభిమానులు అందరూ కూడా రోహిత్ శర్మని పిలుచుకుంటూ ఉంటారు. అయితే ఒకప్పుడు తన బ్యాటింగ్ తోనే అలరించిన రోహిత్ శర్మ.. భారత కెప్టెన్ గా కూడా సూపర్ సక్సెస్ అవుతున్నాడు. ఇప్పటికే ఐపీఎల్లో ముంబై ఇండియన్స్ కెప్టెన్గా తన సత్తా ఏంటో చూపించిన రోహిత్ శర్మ.. ఇక ఇప్పుడు టీమిండియా కెప్టెన్ గా కూడా భారత జట్టుకు ఒక టి20 వరల్డ్ కప్ అందించి అదరగొట్టేసాడు. కాగా టీ20లకు రిటైర్మెంట్ ప్రకటించిన రోహిత్ శర్మ టెస్ట్ వన్డే ఫార్మాట్లో మాత్రమే కొనసాగుతూ ఉన్నాడు అన్న విషయం తెలిసిందే. అయితే రోహిత్ స్టార్ ప్లేయర్ అయినప్పటికీ అతని ఫిట్నెస్ పై ఎప్పుడు విమర్శలు వస్తూ ఉండేవి. అటు క్రికెటర్లకు ఉండాల్సిన ఫిట్నెస్ రోహిత్ శర్మకు లేదని.. ఏకంగా పొట్టతో కనిపిస్తూ ఉంటాడు అంటూ సోషల్ మీడియాలో కూడా ట్రోల్స్ వచ్చాయి. కానీ ఇప్పుడు హిట్ మ్యాన్ కాస్త ఫిట్ మ్యాన్ గా మారిపోయాడు. ఒకప్పుడు ఏకంగా పొట్టతో అన్ ఫిట్ గా కనిపించిన రోహిత్ శర్మ.. ఇక ఇప్పుడు కండలు తిరిగిన దేహంతో లుక్ మార్చేశాడు. న్యూజిలాండ్ టెస్ట్ సిరీస్ ముంగిట రోహిత్ శర్మ.. ఇటీవల ఎన్నడు లేనంత ఫిట్ గా కనిపిస్తున్నాడు. బెంగళూరు గ్రౌండ్ లో ప్రాక్టీస్ సందర్భంగా తీసిన కొన్ని ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ గా మారిపోయాయి. ఇంతకుముందుతో పోల్చి చూస్తే సన్నగా మారడమే కాదు కండలు తిరిగిన దేహంతో హిట్ మ్యాన్ కనిపిస్తున్నాడు. దీంతో ఇది చూసి ఫ్యాన్స్ అందరు కూడా మురిసిపోతున్నారు. ఇప్పుడు హిట్ మ్యాన్ హిట్.. ఫిట్ మ్యాన్ అయిపోయాడు అంటూ కామెంట్ చేస్తూ ఉన్నారు.

# బూస్టర్ ని వినియోగంలోకి తెచ్చిన జలమండలి అధికారులు.





**రాజేంద్ర నగర్ ప్రజా బలం ప్రతినిధి 17 అక్టోబరు 2024**మణికొండలో బి.ఆర్.ఎస్ పార్టీ కార్య కర్తలు గత కొద్ది రోజులుగా ఇంటింటికి బస్తీ బస్తీకి వెళ్లి ప్రజలు ఎదుర్కుంటున్న సమస్యలను ప్రజాభి ప్రాయ సేకరణలో భాగంగా సేకరిస్తున్న సందర్భముగా డాలర్ హిల్స్ కాలనీ, ఖిజ్రా కాలనీ దగ్గర నిర్మించిన నీటిని పంప్ చేసే బూస్టర్ వినియోగంలో ట్రాన్స్ఫార్మర్ లేదని కొద్దికాలం, సాంకేతిక కారణాల వల్ల మరి కొద్ది కాలంగా నిరుపయోగంగా ఉన్న విషయమై జలమండలి జనరల్ మానేజర్ కు వ్రాత పూర్వక పిర్యాదు ఇవ్వడమ్ జరిగిన దరిమిలా అట్టి బూస్టర్ ను అధికారులు సరిచేసి పని మొదలు పెట్టిన శుభ సందర్భముగా సదరు 18 వ డివిజన్ జనరల్ మానేజర్ ను, డెప్యూటీ జనరల్ మానేజర్ ను, మేనేజర్ లను కలసి సగౌరవంగా అభినందించి ధన్యవాదములు తెలిపిన వారిలో బి.ఆర్.ఎస్ పార్టీ మణికొండ మున్సిపాలిటీ కార్య నిర్వాహక అధ్యక్షుడు కుంభగాళ్ల ధనరాజ్, సీనియర్ నాయకులు ముత్తంగి లక్ష్మయ్య, అందె లక్ష్మణ్ రావు, ఉపేంద్రానాథ్ రెడ్డి, యాళల కిరణ్, కందాడ ప్రవీణ్, ఎర్రోళ్ల రమేష్, ఏం.కృపాకర్, సయ్యద్ ఆరీఫ్ సయ్యద్ అష్ఫక్ అలి, సయ్యద్ రఫీక్ తది తరులు కలరు.

# తెలంగాణ గ్రామీణ బ్యాంకు ముత్యంపేట శాఖ నాబార్డ్ వారి ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత పై అవగాహన కార్యక్రమం





**ప్రజాబలం దండేపల్లి మండల రిపోర్టర్ అక్టోబర్ 17** : తెలంగాణ గ్రామీణ బ్యాంక్, ముత్యంపేట శాఖ,నాబార్డ్ వారి ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత పై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది.మంచిర్యాల జిల్లాలోని దండేపల్లి మండలంలోని నెక్కివెంకటాపూర్ గ్రామ ప్రజలకు వివిధ రకాల లోన్ ప్రొడక్ట్స్,డిపాజిట్ స్కీమ్స్ మరియు ఇన్సూరెన్స్ స్కీమ్స్ పై అవగాహన కల్పించడం జరిగింది వీటి తో పాటు ఎన్ పీ ఎస్ వాత్సల్య స్కీముల గురించి సామాజిక భద్రత పథకాల గురించి అలాగే డిజిటల్ సేవలు గురించి పొదుపుల గురించి చాలా చక్కగా కళాజాత వారు మాటల ద్వారా పాటల ద్వారా మ్యాజిక్ షో ద్వారా చాలా చక్కగా తెలియజేశారు.

శాఖ మేనేజర్ ఎన్ కిషోర్ కుమార్,జీ నవ్యశ్రీ,జీ సాగర్ పాల్గొన్నారు.ఎం వీ రూరల్ ఫోక్ ఆర్ట్ ఆర్గనైజేషన్ కళజాతర బృందం సభ్యులు మహేష్,రీయాజ్ పాల్గొన్నారు.

# జల్ జంగల్ జమీన్ గిరిజనుల ఆరాధ్య దైవం అమరజీవి కొమురం భీం 84వ వర్ధంతి లో పాల్గొన్న మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు



**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి అక్టోబర్ 17 :** జల్ జంగల్ జమీన్ గిరిజనుల ఆరాధ్య దైవం అమరజీవి కొమురం భీం 84 వ వర్ధంతి సందర్భంగా కొమురం భీం జిల్లా ఆసిఫాబాద్ నియోజకవర్గంకెరమెరి మండల జోడేఘాట్ గ్రామంలో కొమురం భీం విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించిన మంచిర్యాల శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు. అనంతరం ఏర్పాటు చేసిన కొమురం భీం 84 వ వర్ధంతి వేడుకల్లో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో శిశు సంక్షేమ శాఖ,గ్రామీణాభివృద్ధి మంత్రి, ఆదిలాబాద్ జిల్లా ఇంఛార్జి సీతక్క,ఎంపీలు, ఎమ్మెల్యేలు,రాష్ట్ర నాయకులు,ఎమ్మెల్సీ,జిల్లా అధికారులు,జిల్లా నాయకులు,గిరిజన నాయకులు,నాయకురాలు, కార్యకర్తలు,ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు..

# స్నేహితుని జ్ఞాపకార్థం ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు బ్యాగులు పంపిణీ




**ప్రజాబలం లక్షెట్టిపేట మండల రిపోర్టర్ అక్టోబర్ 17** : మంచిర్యాల జిల్లాలోని లక్షెట్టిపేట మండలంలోని వెంకట్రావుపేట గ్రామానికి చెందిన బోడకుంటి మహేష్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు.ఆతడి మిత్రులు ఎస్ ఎస్ సి బ్యాచ్ 2016-17 మహేశ్ జ్ఞాపకార్థం స్థానిక వెంకట్రావుపేట ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు బ్యాగులు పంపిని చెయ్యడం గురువారం జరిగింది.ఈ కార్యక్రమంలో మహేష్ మిత్రులు పాల్గొన్నారు వీరిని పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

# జోడెన్ ఘాట్ కు తరలిన ఆదివాసీలు




**ప్రజాబలం లక్షెట్టిపేట మండల రిపోర్టర్ అక్టోబర్ 17** : జల్ జంగల్ జమీన్ అంటూ నినదించి రజాకార్ల చేతిలో హతమైన గోండు బెబ్బులి కొమురం భీమ్ జోడేఘాట్ కు తలమల గ్రామస్తులు మండల ఆదివాసీ నాయకులు గురువారం తరలి వెళ్లారు.ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ... ఆదివాసీ హక్కుల కోసం కొమ్రాం భీమ్ చేసిన పోరాటం అద్భుతమని, ఆయన త్యాగాలు ఆదివాసీ సమాజానికి చిరస్థాయిగా నిలిచిపోతాయని గుర్తు చేశారు. తెలంగాణ ప్రాంతంలో ఆయన ఆధ్వర్యంలో జరిగిన గిరిజన పోరాటం నిజాం సర్కార్‌ను ఎదుర్కొనడంలో కీలకమని,ఇలాంటి నాయకుడి వారసత్వాన్ని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని వ్యాఖ్యానించారు. అయన స్ఫూర్తి తో ప్రస్తుత ఆదివాసీ సమస్యల పరిష్కారం కోసం పోరాడాలని, కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజన వ్యతిరేక నిర్ణయాలను అర్థం చేసుకొని ఐక్య పోరాటాలు చెయ్యాలని,తెగల మధ్యలో చిచ్చులు పెట్టె వారి పట్ల జాగ్రత్త పడుతూ ఐక్యతను కాపాడు కుంటూ ముందుకు వెళ్ళాలని కోరారు.కొమ్రాం భీమ్ తన జీవితాన్ని ఆదివాసీ హక్కుల కోసం అంకితం చేసి, సాయుధ పోరాటం ద్వారా నిజాం సర్కార్ ను ఎలా ఎదుర్కొన్నారో వివరించారు.ఈ కార్యక్రమంలో తుడుందెబ్బ జిల్లా ఉపాధ్యక్షుడు గెడం బొజ్జీరావు.మండల నాయకులు మెస్రం చిత్రు,కుర్సెంగ కిష్టు, కోవబాదు,పూసం లింబరావు,పుసం చిత్రు,మహిళలు పాల్గొన్నారు.

# మహనీయుల జీవితాలను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలి..

## జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



**ప్రజాబలం దినపత్రిక మెదక్ జిల్లా ప్రతినిధి 17.10.2024:**సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో వాల్మీకి జయంతి, కొమరం భీం వర్ధంతి సందర్భంగా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు తో కలిసి జ్యోతి ప్రజ్వలన గావించి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించిన కలెక్టర్

గురువారం సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో వాల్మీకి జయంతి, గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కొమరం భీం వర్ధంతి చిత్రపటాలకు పూలమాలలు వేసి కలెక్టర్ నివాళులర్పించారు.

ఈ సందర్భంగా వాల్మీకి జయంతిని ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ మహాకవి వాల్మీకి హిందూ ధర్మానికి అతి ముఖ్యమైన గ్రంథం రామాయణాన్ని రచించారని.. దాని ద్వారా సమాజానికి అనేక విలువలను అందించారని. మానవీయ విలువలను ప్రతిపాదిస్తూ ఆ జ్ఞానాన్ని ప్రపంచానికి అందించిన జ్ఞాన ఘని.. మహర్షి వాల్మీకిలి కలెక్టర్? పేర్కొన్నారు.ప్రతి ఒక్కరూ అనుసరించవలసిన ఆదర్శ కావ్యం రామాయణమని..అలాంటి రామాయణాన్ని రచించిన వాల్మీకి జీవిత చరిత్రలను తెలుసుకోవడం ద్వారా స్ఫూర్తిని పొంది, వారి మార్గంలో పయనించడం ద్వారా అనుకున్న లక్ష్యాలను సునాయాసంగా సాధించగలుగుతామన్నారు .

అనంతరం కొమరం భీమ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించి వర్ధంతి వేడుకలలో నిర్వహించారు. ఆదివాసి ఆత్మగౌరవానికి ప్రతీక కొమరం భీమ్ అని జల్, జంగల్, జమీన్ కోసం సాయుధ పోరాటాలు చేశారు.తమ భూమిలో తమదే అధికారం అని (భూమి. అడవి.నీరు మాదే) అనే నినాదంతో ఉద్యమించి వీరమరణం పొందారని చెప్పారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, జడ్పీ సీఈఓ ఎల్లయ్య,వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి నాగరాజుగౌడ్, గిరిజన సంక్షేమ అధికారి, సంబంధిత నాయకులు ప్రభుత్వ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి పట్టభద్రులు ఓటరుగా నమోదుచేసుకోవాలి

## జిల్లాలో తాసిల్దార్ కార్యాలయాల్లో ఓటరు నమోదు కేంద్రాల ఏర్పాటు

## డిగ్రీ-2021 నవంబర్ లోపు పూర్తి చేసిన వారు అర్హులు

## ఓటర్ నమోదు తేదీలు2024 సెప్టెంబర్ 30 నుండి ,నవంబర్ 06 తేదీ వరకు



ప్రజాబలం దినపత్రిక

మెదక్ హవెలిగానపూర్

17.10.2024:

హవేలీ ఘన్పూర్ మండలం తాసిల్దార్ కార్యాలయంలో ఓటు హక్కు నమోదు చేసుకున్న జిల్లా కలెక్టర్

మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

పట్టభద్రులు, శాసనమండలి ఎన్నికకు ఓటరు నమోదు చేసుకోవాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి రాహుల్ రాజ్ తెలిపారు.

గురువారం క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా హవేలీ ఘన్పూర్ మండలం తాసిల్దార్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ఎమ్మెల్సీ ఓటు హక్కు నమోదు చేసుకున్నారు.

ఈ సందర్భంగా పట్టభద్రుల ఓటరు నమోదుపై ఆయన మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం,ఉమ్మడి మెదక్-నిజామాబాద్- అదిలాబాద్- కరీంనగర్ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానం సంబంధించి అర్హత కలిగిన జిల్లాలోని తాసిల్దార్ కార్యాలయంలో ఓటరు నమోదు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు నమోదు చేసుకోవాలని సూచించారు.

1.11.2021 కంటే ముందు డిగ్రీ, ఏదేని తత్సమాన అర్హతలు కలిగిన పట్ట భద్రులు, డిగ్రీ మెమో,ప్రొవిజనల్ సర్టిఫికెట్, ఆధార్ కార్డ్ ,ఓటర్ ఐడి ,పాస్పోర్ట్ సైజ్ ఫోటో ఈమెయిల్ ఐడి, ఫోన్ నెంబర్ అవసరం ఉంటాయన్నారు.

అర్హులైన పట్ట భద్రులు ఫారం 18 తమ దరఖాస్తులను సంబంధిత సర్టిఫికెట్లను జత చేస్తూ తహసిల్దార్ కార్యాలయం, రెవెన్యూ డివిజన్ అధికారి కార్యాలయం నందు మాన్యువల్ గా లేదా %ఎవశీవశ్రీఖఅస్త్రుఖు.అఱఎ.అఅ% అనే వెబ్ సైట్ లో ఆన్లైన్ ద్వారా నవంబర్ 6 లోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలకు నవంబర్ 23 న డ్రాఫ్ట్ ఓటర్ జాబితా ప్రచురించాలని, డిసెంబర్ 9 లోపు డ్రాఫ్ట్ జాబితా పై అభ్యంతరాలను స్వీకరించి డిసెంబర్ 25 లోపు పరిష్కరించాలని, డిసెంబర్ 30న తుది ఓటర్ జాబితా ప్రచురించాల్సి ఉంటుందని అన్నారు.

తాసిల్దార్ కార్యాలయాల్లో ఓటరు నమోదు ఫారాలు ఉచితంగా అందచేయనున్నట్లు తెలిపారు. పూరించిన దరఖాస్తులు తహసీల్దార్ కార్యాలయాల్లో అందచేయాలని సూచించారు. నవంబర్ 6వ తేది వరకు ఓటరు నమోదుకు అవకాశం ఉన్నదని,

అర్హులైన ప్రతి ఒక్కరు ఓటరు గా నమోదు కావాలని ఆయన పేర్కొన్నారు.

## తపస్ మెదక్ జిల్లా మహిళా కార్యదర్శి గా కె. విజయ



**మెదక్ తుప్రాన్ ప్రజాబలం న్యూస్ :-** తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(తపస్)మెదక్ జిల్లా మహిళా కార్యదర్శిగా కె. విజయ ఎంపీపీఎస్ తాతా పాపాన్ పల్లి,తుప్రాన్ మండలం ఎన్నికైనట్లు తపస్ మెదక్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జిడ్డి ఎల్లం, చల్లా లక్ష్మణ్ తెలిపారు. ఈ సందర్భంగా విజయ మాట్లాడుతూ జిల్లా లో తపస్ సంఘం అభివృద్ధికి కృషి చేస్తామని,సంఘము యొక్క రాష్ట్ర, జిల్లా శాఖ ఆదేశాలను పాటిస్తూ, ఉపాధ్యాయులకు,విద్యారంగానికి అవసరమైన సేవలు అందిస్తామని వారు తెలియజేశారు.

## తాండూర్ లో వాల్మికి జయంతి వేడుకలు



తాండూర్ గొప్ప మానవతావాది, మానవతా విలువలను, ఉన్నతమైన ఆదర్శాలను అడుగడుగునా మనకు భోదించే రామాయణం రాసిన ఆదికవి వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు బెల్లంపల్లి నియోజకవర్గం తాండూర్ మండల్ లోని వాల్మీకి నగర్ లో గల వాల్మీకి సంఘం ఆధ్వర్యంలో గురువారం నాడు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూలమాలవేసి జెండా ఆవిష్కరణ కులమతాలకు అతీతంగా అందరూ పాల్గొని వాల్మీకి జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వాల్మీకి సంఘం నాయకులు మాట్లాడుతూ వాల్మీకి ధర్మాన్ని ఎలా రక్షించాలో వాల్మీకి మహర్షి తన రామాయణం ద్వారా ప్రజలకు అందించారని, మనిషి సన్మార్గంలో నడిచేందుకు ఆయన చేసిన కృషి ఎనలేనిదని, అటువంటి గొప్ప కావ్యాన్ని రచించిన శ్రీ ఆదికవి మహర్షి వాల్మీకి జయంతి ఘనంగా జరుపుకోవడం ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు. రామ కావ్యం వెలుగుల్లో మానవాళి సుభిక్షంగా ఉండాలని కోరుకుంటూ అందరికీ శ్రీ మహర్షి వాల్మీకి జయంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తాండూర్ ఎంపిడిఓ శ్రీనివాస్,సబ్ ఇన్స్పెక్టర్ కిరణ్ కుమార్,సాలిగామ బాణయ్య, బాణయ్య, సిరంగి శంకర్,సూరం రవీందర్ రెడ్డి,మహేందర్ రావు,దాతాత్రేయ రావు,పేర్క రాజన్న,ఎల్క రాంచందర్, పుల్గం తిరుపతి,శేషగిరి,మహేందర్ గౌడ్, జనార్దన్,వెంకటస్వామి,రెహమాత్ ఖాన్,కాంపెల్లి చిన్నయ్య,చందు,శ్రీనివాస్,రాజేశం,సత్యం, వాల్మీకి సంఘాం నాయకులు జంశెట్టి గట్టుమల్లు,ముస్కె లింగమూర్తి,ముస్కె తిరుపతి,మందుల జనార్దన్,ముస్కె సతీష్,సురపతుల శ్రీనివాస్,ముస్కె సాగర్,సురపతుల శ్రీకాంత్,పెనుకూల శ్రీనివాస్,బోగే రాజు,తదితరులు పాల్గొన్నారు.

## కమాన్ పూర్ లయన్స్ క్లబ్ కు ఎల్వీ ప్రసాద్ అవార్డు.



కమాన్ పూర్ లయన్స్ క్లబ్ కు ఎల్ వి ప్రసాద్ అవార్డు అందజేశారు. ఎల్ వి ప్రసాద్ ఐ ఇన్స్టిట్యూట్ 50వేల కార్నియాలు మార్పిడి చేసి ప్రపంచంలోనే మొదటి సంస్థగా రికార్డ్ సృష్టించిన హైదరాబాద్ లోని ఎల్వి ప్రసాద్ ఐ ఇన్స్టిట్యూట్ వారు ప్రత్యేక సెమినార్ను నిర్వహించారు. అలాగే నేత్రదానం కు ముందుండి కృషిచేసిన సదాశయ ఫౌండేషన్ ,కమాన్ పూర్ లయన్స్ క్లబ్ కు సంస్థ వ్యవస్థాపకులు గుండ్లపల్లి నాగేశ్వరరావు లయన్స్ క్లబ్ ప్రధాన కార్యదర్శి నల్లవెల్లి శంకర్ కు సదాశయ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు శ్రావణ్ కుమార్ కు మరియు ప్రధాన కార్యదర్శి లింగమూర్తిలకు ఈ అవార్డును అందజేశారు. కాగా ఈ కార్యక్రమంలో మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు పాల్గొని ఎల్వి ప్రసాద్ బృందాన్ని అభినందించారు. అలాగే ఈ కార్యక్రమంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ మాజీ సలహాదారు కెవిపి రామచంద్రరావు మాజీ ఐఏఎస్ జయప్రకాష్ నారాయణ పాల్గొన్నారు. కమాన్ పూర్ క్లబ్ ఆధ్వర్యంలో అధిక సంఖ్యలో కళ్ళు ఎల్వి ప్రసాద్ ల్యాప్ కు పంపడంతో గుర్తించి అవార్డును అందజేశారు. తమ క్లబ్ ను గుర్తించినందుకు లైన్స్ క్లబ్ అధ్యక్షుడు సాన రామకృష్ణారెడ్డి నల్లవెల్లి శంకర్ భీష్మ చారి వాసు శ్రవణ్ కుమార్ లింగమూర్తి అనంతరాములు చంద్రమౌళి ఎల్వి ప్రసాద్ సంస్థకు కృతజ్ఞతలు తెలిపారు.

## వ్యవసాయంపై అవగాహన ఉన్న వారికి ఏ ఎం సి చైర్మన్ పదవి ఇవ్వాలి

### గెలుపు కోసం కష్టపడ్డ వారిని గుర్తించాలి...
### ఏఎంసీ ప్రకటనలో జాప్యం ఎందుకు...




కమాన్ పూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి వ్యవసాయంపై అవగాహన ఉన్నవారికి ఇవ్వాలని పలువురు కాంగ్రెస్ నాయకులు కోరుతున్నారు. అలాగే కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడి శ్రీధర్ బాబు గెలుపులో ప్రముఖ పాత్ర వహించిన వారికే ఈ పదవి అప్పగించాలని గుసగుసలు విన వస్తున్నాయి. అలాగే సుమారు పెద్దపల్లి జిల్లాలో రెండు మార్కెట్ కమిటీ లు మంథని మరియు కమాన్ పూర్ మాత్రమే ప్రకటించాల్సి ఉంది. కమాన్ పూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవికి తీవ్ర పోటీ నెలకొంది. ఈ పదవి కోసం చాలామంది ఆశావాహులు చైర్మన్ పదవిని ఆశిస్తున్నారు. ముఖ్యంగా ఇందులో రామగిరి ముత్తారం కమాన్ పూర్ మండలాల నుండి నాయకులు తమకే వస్తుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. అలాగే ఈ చైర్మన్ పదవి కోసం మండల కేంద్రానికి చెందిన బీసీ నాయకుడు పెద్ద ఎత్తున పావులు కదిలిస్తున్నాడు. అలాగే ఈసారి స్థానికులకు ఇవ్వాలని బలంగా వినబస్తోంది. అలాగే పట్టణాలకే పరిమితమై వ్యాపారాల్లో నిమగ్నమయ్యే వ్యక్తులకు కాకుండా స్థానికంగా ఉండే నాయకులకు అవకాశం ఇవ్వాలని కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు కోరుతున్నారు. కాంగ్రెస్ నాయకులతోపాటు సీనియర్ పాత్రికేయునికి సైతం మంత్రి ఆశీస్సులు ఉన్నట్లు తెలుస్తోంది. ఏది ఏమైనా ఈసారి కమాన్ పూర్ స్థానికులకే ఇవ్వాలనే వాదన బలంగా వినవస్తోంది. మండల కేంద్రానికి చెందిన బిసి నాయకునికి ఇవ్వడం సభబేనని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. మంత్రి శ్రీధర్ బాబు మనసులో ఎవరు ఉన్నారో త్వరలోనే తేలనుంది.

## మేడిగడ్డ కృంగుబాటుపై కేసు విచారణ
## డిసెంబర్ 27 కు వాయిదా

జయశంకర్ భూపాలపల్లి కాళేశ్వరం ప్రాజెక్టు లోని మేడిగడ్డ కృంగుబాటు పై జయశంకర్ భూపాలపల్లి జిల్లా సెషన్ కోర్టు లో విచారణ జరిగింది. కేసు తదుపరి విచారణ డిసెంబర్ 27కు వాయిదా పడింది. మేడిగడ్డ ప్రాజెక్టులో నాణ్యత లోపంతో అవకతవకలు జరిగియంటూ జిల్లా స్టేషన్ కోర్టులో సామాజిక కార్యకర్త నాగవెల్లి రాజలింగ మూర్తి రివిజన్ పిటిషన్ వేసిన విషయం తెలిసిందే. తేదీ అక్టోబర్ 02, 2023 రోజన భూపాలపల్లి జూనియర్ సివిల్ జడ్జ్ కోర్టులో. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ , హరీష్ రావు , మేఘా కృష్ణా రెడ్డి , రజత్ కుమార్ , హరి రామ్ , శ్రీధర్ అనే ఎనిమిది మంది పై 200 సీఆర్పీసీ పిటిషన్ దాఖలు చేయగా జడ్జి కేసును డిస్మిస్ చేయడం జరిగింది.

దీంతో మార్చి 2024 లో జయశంకర్ భూపాలపల్లి జిల్లా సేషన్ కోర్టులో తిరిగి రివిజన్ పిటిషన్ వేయడం తో విచారన లో భాగంగా సెప్టెంబర్ 5వ తేదీన పై ఎనిమిది మంది కోర్టులో హాజరు కావాలని కోర్టు నోటీసులు పంపింది. తదనంతరం...పిటిషనర్ తరుపున న్యాయవాది గంట సంజీవ రెడ్డి (72) మృతి చెందడం జరిగింది. కోర్టు నోటీసులు పంపిన నేపథ్యంలో 5 గురికి మాత్రమే నోటీసులు అందాయి. కేసీఆర్, స్మితా సబర్వాల్, ఎల్ అండ్ టీ ఎండీ సురేష్ కుమార్ కు నోటీసులు అందలేదు. దీంతో సెప్టెంబర్ 05 న హియరింగ్ రోజు హరీష్ రావు తరుపున హైకోర్టు అడ్వకేట్ లలిత రెడ్డి... మేఘా కృష్ణారెడ్డి, రజత్ కుమార్ తరఫున హైకోర్టు అడ్వకేట్ అవధాని....హరి రామ్ తరపున హైకోర్టు అడ్వకేట్ నరసింహారెడ్డి అనే ఐదుగురు హైకోర్టు న్యాయవాదులు హాజరయ్యారు. విచారణ జరిపించిన కోర్టు ఈ కేసును అక్టోబర్ 17 కు ఈ రోజుకు వాయిదా వేసింది. పిటిషన తరపున న్యాయవాది గంట సంజీవరెడ్డి మృతి చెందడంతో పిటిషనర్ రాపోలు భాస్కర్ అనే హైకోర్టు అడ్వకేట్ తో పాటు మరో ఇద్దరు లోకల్ అడ్వకేట్లను పెట్టుకోవడం జరిగింది. దీంతో గురువారం హియరింగ్ కు హరీష్ రావు తరపున లలితారెడ్డి అడ్వకేట్,...మెగా కృష్ణారెడ్డి, రజిత్ కుమార్ తరపున అవధాని అడ్వకేట్. హరి రామ్ శ్రీధర్ తరపున నరసింహారెడ్డి అనే హైకోర్టు అడ్వకేట్ లు ఈరోజు భూపాలపల్లి జిల్లా సెషన్ కోర్టులో హాజరయ్యారు. సామాన్లు అందనివారికి కెసిఆర్ కు స్మితా సభర్వాల్ కు , ఎల్ అండ్ టి ఎండి సురేష్ కుమార్ సమాన్లు పంపనున్నారు

## మహనీయుల జీవితాలను ఆదర్శంగా తీసుకోవాలి
### – జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



పెద్దపల్లి మహనీయుల జీవితాలను ఆదర్శంగా తీసుకొని వారి ఆశయాల సాధన దిశగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. మహాకవి వాల్మీకి జయంతి పురస్కరిం చుకొని గురువారం సమీకృత జిల్లా కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ఉత్సవ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష పాల్గొన్నారు. మహాకవి వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి, జ్యోతి ప్రజ్వలన చేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ మహాకవి వాల్మీకి హైందవ ధర్మానికి అతి ముఖ్యమైన గ్రంథం రామాయణాన్ని రచించారని, రామాయణ గ్రంథం ద్వారా అనేక విలువలను సమాజానికి అందించారని కలెక్టర్ పేర్కొన్నారు. రామాయణం ద్వారా ఆదర్శ మానవుడికి ఉండవలసిన లక్షణాలు, మానవ సంబంధాలు, విలువలను మహాకవి మనందరికీ బోధించారని అన్నారు. మహాకవి వాల్మీకి రచించిన రామాయణం కారణంగానే మన దేశంలో కుటుంబ వ్యవస్థ పటిష్టంగా ఉందని కలెక్టర్ తెలిపారు. నేడు ప్రపంచ వ్యాప్తంగా ప్రాచుర్యం పొందిన వసుదైక కుటుంబం అనే భావన రామాయణంతో ముడీబడి ఉందని కలెక్టర్ తెలిపారు.

మహాకావ్యం రామాయణాన్ని రచించిన మహాకవి వాల్మీకి జయంతిని పండగగా జరుపుకోవడం సంతోషకరమ ని కలెక్టర్ తెలిపారు. అనంతరం వక్తలు మహర్షీ వాల్మీకి జీవిత విశేషాలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, కలెక్టరేట్ పరిపాలన అధికారి శ్రీనివాస్, కలెక్టరేట్ సూపరింటెండెంట్ లు ప్రకాష్ సునీత ,పద్మావతి, కలెక్టరేట్ సిబ్బంది, బీసీ సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## నల్ల బ్యాడ్జీలతో ప్రైవేట్ డిగ్రీ కళాశాల యాజమాన్యం నిరసన
### నల్ల బ్యాడ్జీలతో అంబేద్కర్ విగ్రహానికి వినతి



పెద్దపల్లి ప్రతినిధి: ఆర్థిక భారంతో విద్యార్థులకు విద్యను అందించలేక పోతున్నామని, ప్రైవేట్ డిగ్రీ కళాశాల యాజమాన్యం ఆవేదన వ్యక్తం చేస్తూ నల్ల బ్యాడ్జీలతో అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం ఇచ్చి తమ నిరసనను వ్యక్తం చేశారు. ప్రైవేట్ కళాశాలల బకాయిలు ప్రభుత్వం చెల్లించకపోవడంతో విధి లేని పరిస్థితుల్లో విద్యాసంస్థలను నిరవధిక బంద్ పాటిస్తున్నట్లు ప్రైవేట్ డిగ్రీ, పీజీ కాలేజ్ మేనేజ్మెంట్ అసోసియేషన్ పేర్కొంది. జిల్లా కేంద్రంలోని డిగ్రీ, పీజీ కళాశాల యాజమాన్యాల ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలు ధరించి అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేట్ కళాశాలలకు చెల్లించాల్సిన ఫీజు రియంబర్స్మెంట్ చెల్లించడం లేదని దీంతో విద్యాసంస్థలను నడపడం భారంగా మారిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. దసరా పడగకు ముందు విడతల వారీగానైన నిధులు విడుదల చేయాలని ప్రభుత్వానికి విన్నవించుకున్నా ఇప్పటి వరకు స్పందించలేదని, గత మూడు సంవత్సరాలుగా ఫీజు రియంబర్స్మెంట్ తో పాటు విద్యార్థులకు రావాల్సిన స్కాలర్షిప్ రావడం లేదన్నారు. నిరుద్యోగులు ఉపాధి కోసం విద్యాసంస్థలను స్థాపిస్తే ప్రభుత్వాలు బకాయిలు చెల్లించకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నయని వారు ఆరోపించారు. ఆర్థికంగా ఇబ్బందులతో కుటుంబాలను పోషించుకోలేని స్థితిలో ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు ఉన్నాయని, ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రైవేట్ డిగ్రీ పీజీ కళాశాలల ఫీజు రియంబర్స్మెంట్ వెంటనే చెల్లించాలని లేని పక్షంలో రాష్ట్ర స్థాయిలో ఆందోళనలు ఉదృతం చేస్తామని వారు హెచ్చరించారు.

## ఉప్పల్ ఆలయంలో దొంగతనానికి యత్నం

మేడ్చల్ ఉప్పల్ వెలుగు గుట్టలోని శ్రీ మల్లికార్జున భ్రమరాంబ దేవాలయంలో దొంగ హల్చల్ చేసాడు. హుండీ దొంగతనానికి ప్రయత్నించాడు. సీసీటీవీ చూసి పరుగులు తీసాడు. దొంగ అలజడితో స్థానపికులు మేలుకొని దేవాలయంలోని వ్యక్తి చూసారు. అయినా దొంగ పరుగుతో తప్పించుకున్నాడు. దొంగతనానికి యత్నించిన చిత్రం సిసిటీవీ పుటేజీలో రికార్డు అయింది....

ఆలయ చైర్మన్ జన్ని రఘు ఉప్పల్ పిఎస్ లో పిర్యాదు చేసారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## తూప్రాన్ ఆసుపత్రి మార్చురీ ముందు ఉద్రిక్తత

మెదక్ తూప్రాన్ ప్రభుత్వాసుపత్రి మార్చురీ ఎదుట ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు, మృతుల కుటుంబ సభ్యుల మధ్య వాగ్వాదం జరిగింది. బుధవారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేసారు. రోడ్డు సరిగా లేకపోవడం వల్లే ప్రమాదం జరిగిందని కుటుంబ సభ్యుల ఆరోపణ. న్యాయం జరిగే వరకు ఇక్కడి నుంచి కదిలేది లేదని పట్టుపట్టారు. పోలీసులు మృతుల కుటుంబాలకు నచ్చజెప్పి పంపించారు.

## ఐ టీ ఐ లో ప్రవేశాలకు దరఖాస్థులు ఆహ్వానం

భూపాలపల్లి, తెలంగాణ ప్రభుత్వ ఉపాధి మరియు శిక్షణ శాఖ ప్రభుత్వ ఐటిఐ, భూపాలపల్లి నందు కొత్తగా ప్రవేశ పెట్టిన ఆరు అడ్వాన్స్ టెక్నాలజీ కోర్సులల్లో ప్రవేశాలకు దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. ఐడిఓసి కార్యాలయంలో కలెక్టర్ ఛాంబర్లో గురువారం ప్రాంతీయ ఉప సంచాల కులు, భూపాలపల్లి, కాజీపేట ఐఐటి ప్రిన్సిపాల్స్ తో ఆడ్వాన్స్డ టెక్నాలజీన సెంటర్ లో ప్రవేశాలు, కళాశాలలో సౌకర్యాలు కల్పనపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 10వ తరగతి ఆపై విద్యార్హతలు కలిగిన విద్యార్థిని, విద్యార్థులు భూపాలపల్లి, సుభాష్ నగర్ కాలనీలోని ఐటీఐ కళాశాలలో నేరుగా కానీ ష్ట్రబిబిజూబ:/తిబితి.బివశ్రీజీనిణజీనిజీ.ఐనీల.తిని వెబ్సైట్ ద్వారా కానీ అడ్మిషన్లు పొందేందుకు ఈ నెల 19వ తేది వరకు అవకాశం ఉన్నట్లు తెలిపారు. ప్రభుత్వం కొత్తగా ప్రవేశ పెట్టిన ఆరు అడ్వాన్స్ టెక్నాలజీ కోర్సులలో శిక్షణ పొందటానికి ప్రభుత్వ ఐటిఐ భూపాలపల్లిలోని ఖాళీగా వున్న సీట్లు భర్తీ కొరకు 6వ విడత వాక్ – ఇన్ ఇంటర్వ్యూ ద్వారా అడ్మిషన్లకు అర్హులైన విద్యార్థులు నుండి దరఖాస్తులు కోరుతున్నట్లు ఆయన తెలిపారు.

Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S
and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com